V6 NEWS
ప్రతి దృశ్యం... ప్రజల పక్షం...

ప్రభాత
వెలుగు
06.02.2019
www.v6velugu.com
బుధవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 351 పేజీలు: 12+12+16 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL


వెలుగు లైఫ్
బుధవారం 06.02.2019
మిద్దె మీదనే... 02
కొండల గొలుసు 06
కుంగిపోవద్దు! 07
గట్టిగా అరిచినా.. 09
మీకేం భారం

ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి



మోడీ కిలాఫ్‌ల అపోజిషన్ పార్టీలను ఒక్కటిజేస్తున్న దీదీ అసల్ టార్గెటేంది? ఢిల్లీ సీట్ మీద కన్నేసి, ఎలక్షన్ల ముంగట దొరికిన మోఖాను వాడుకుంటున్నరా? రోజ్‌వ్యాలీ, శారదా చిట్‌ఫండ్ స్కామ్‌లల్ల బద్నామ్ కాకుండా పార్టీని బచాయించేందుకే ఎన్‌డీఏ సర్కార్‌తో టక్కర్ తీసుకుంటున్నరా? బెంగాల్ పాలిటిక్స్‌తోని రాహుల్ అకేలా అయితడా? దీదీకి చెక్ పెట్టనికి బీజేపీ ఏంజేస్తది?

ఢిల్లీపై దీదీ గురి!

కోల్‌కతా కేంద్రంగా దేశ రాజకీయాలు

- ప్రతిపక్షాల ప్రధాని అభ్యర్థిగా మమత?
- మోడీని ఢీకొట్టే సత్తా తనకే ఉందని సంకేతాలు
- రాహుల్‌కు చెక్ పెట్టడం ఖాయమా?
- బెంగాల్‌లో 20 సీట్లు గెలిచేలా బీజేపీ స్కెచ్
- సీబీఐ ఎపిసోడ్.. మోడీకి, దీదీకి లాభమంటున్న సర్వేలు

సెంట్రల్ డెస్క్: మోడీ సర్కార్‌పై దీదీ సర్కార్ సాగిస్తున్న యుద్ధం వెనుక మతలబు ఏంది? వామపక్షాల కంచుకోటను తన వశం చేసుకొని రెండోసారి సీఎంగా ముందుకుసాగుతున్న మమతా బెనర్జీ ధర్నాలో మర్మం ఏంది?! బెంగాల్ టైగర్ ఇంత స్థాయిలో గర్జించడం వెనుక ఆంతర్యం ఏంది? మరో రెండు మూడు నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు బెంగాల్ కేంద్రంగా రాజకీయాలు వేడెక్కాయి. ఇన్నాళ్లూ మోడీ వర్సెస్ రాహుల్‌గా నడుస్తున్న పోరు.. ఇప్పుడు మోడీ వర్సెస్ దీదీగా టర్న్ తీసుకుంది.

ఇప్పుడే ఎందుకు?

మమతా బెనర్జీ ఆరోపిస్తున్నట్లు మోడీ సర్కార్ సీబీఐని తన చెప్పుచేతల్లో ఉంచుకుందా? అయితే.. ఇన్నాళ్లూ ఆ అంశాన్ని పెద్దగా ప్రస్తావించని దీదీ ఇప్పుడే ఎందుకు తెరమీదికి తెచ్చినట్లు? యూపీఏ హయాంలో ఇలాంటి ఆరోపణలు లేవా?. పంజరంలో చిలుక సీబీఐ' అని గతంలో సాక్షాత్తు సుప్రీంకోర్టే వ్యాఖ్యానించిందంటే కేంద్ర దర్యాప్తు సంస్థ పనితీరు ఏమిటో అర్థం చేసుకోవచ్చు. సీబీఐకి తాము వ్యతిరేకం కాదని, దాని వ్యవహార తీరుకే వ్యతిరేకమని ధర్నా వేదికగా మమతా బెనర్జీ స్పష్టం చేశారు. అన్ని వ్యవస్థలను మోడీ సర్కార్ గుప్పిట్లో పెట్టుకొని రాష్ట్రాలపై ఉసిగొల్పుతున్నదని ఆమె ఆరోపించారు. అయితే, ధర్నా ద్వారా ఒక వైపు మోడీ సర్కార్‌ను ఎండగడుతూనే

మిగతా 3లో

గో బ్యాక్ టు గుజరాత్

- మోడీ సొంత రాష్ట్రం వెళ్లిపోతే మంచిది
- నా పోరాటం దేశం కోసమే: మమత
- ధర్నా విరమించిన బెంగాల్ సీఎం
- ఎంక్వైరీకి హాజరుకావాల్సిందేనని కోల్‌కతా సీపీకి సుప్రీం ఆదేశం
- రాజీవ్‌ను అరెస్టు చేయొద్దని సీబీఐకి కోర్టు నిర్దేశం

05



జనరల్
ఏపీలోనూ రైతుబంధు?
'అన్నదాత సుఖీభవ' పేరిట స్కీమ్. బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు. 2019-20 ఏపీ బడ్జెట్2.26 లక్షల కోట్లు.

04



జనరల్
'పెద్దలు' పరార్
సర్పంచ్‌ను కింద కూర్చోబెట్టిన ఘటనపై విచారణకు ఆదేశించిన మహబూబ్‌నగర్ కలెక్టర్. 'వెలుగు' కథనంపై స్పందన.

02



ప్లే
ఆపతరమా!
నేడు న్యూజిలాండ్‌తో తొలి టీ20. వన్డే సిరీస్ గెలిచి జోరుమీదున్న టీమిండియా. కివీస్‌లో తొలి టీ20 సిరీసే టార్గెట్.

11



బిజినెస్
కిలోమీటర్‌కు రూ. 1.75 మాత్రమే
కొన్ని రూట్లలో ప్రయాణికులకు స్పైస్‌జెట్ ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది.

10

రాష్ట్రం నుంచే 'పీఎం కిసాన్'

- అమలుకు కేంద్రం యోచన
- సీఎస్ జోషితో కేంద్ర అధికారి వసుధ భేటీ
- రైతు బంధు వివరాలపై ఆరా
- కేంద్ర పథకానికి సహకరించాలని విజ్ఞప్తి



మంగళవారం సీఎస్ జోషితో సమావేశమైన కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా

హైదరాబాద్, వెలుగు: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకాన్ని త్వరలోనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషితో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు పథకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పథకాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తున్నారని, లబ్ధిదారుల వివరాలు ఏమిటని ఆరా తీశారు. పీఎం కిసాన్ స్కీంను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా అమలుచేస్తుందనే నమ్మకం ఉన్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ అధికారి అన్నారని సీఎస్ తెలిపారు. ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో రైతు బంధు అమలులో ఉన్న నేపథ్యంలో రైతుల పూర్తి గణాంకాలు పకడ్బందీగా ఉంటాయని, పీఎం కిసాన్‌ను ఇక్కడే మొదట అమలులోకి తీసుకురావాలని కేంద్ర వ్యవసాయ శాఖ యోచిస్తోంది.

యూనిట్‌గా రైతు కుటుంబం: వసుధా మిశ్రా

పీఎం కిసాన్ పథకం పై చర్చించేందుకు రాష్ట్రానికి వచ్చినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా మీడియాకు తెలిపారు. రాష్ట్రంలో రైతుల పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పీఎం కిసాన్‌కు, రైతు బంధుకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న చిన్న సన్నకారు రైతులకు మాత్రమే పీఎం కిసాన్ పథకం వర్తిస్తుందన్నారు. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతు కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. కుటుంబంలోని రైతు, ఆయన భార్య, మైనర్ పిల్లలు ఉంటారని వివరించారు. మేజర్లయిన పిల్లలను వేరే కుటుంబంగా గుర్తిస్తామని చెప్పారు. రైతుల ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించి వారి బ్యాంక్ ఖాతాలోకి నేరుగా డబ్బులు జమ చేస్తామన్నారు. ఇప్పటి వరకు

మిగతా 2లో



కళింగ యుద్ధమేనా?

- ఒడిశాలో పట్టువదలని పట్నాయక్
- ఈసారి కమలంతోనే అసలు సమరం

ఆయన పెద్దగా కనిపించరు. తన పని తాను చేసుకుపోతుంటారు. పార్లమెంట్ ఎన్నికలు.. అసెంబ్లీ ఎన్నికలు.. ఏవైనా గెలుపు ఆయనదే. ప్రభుత్వ వ్యతిరేకత కనిపించకుండా ఎన్నికల్లో సీట్లు పెంచుకోవడం ఆయనకే సాధ్యమైంది. బెంగాల్లో కమ్యూనిస్టుల శకం ముగిసిన తర్వాత ఒంటిచేత్తో అలాంటి అరుదైన ఫీట్‌ను చూపిస్తున్న నేత నవీన్ పట్నాయక్. ఒడిశా సీఎం, బీజేడీ అధినేత. అలాంటి నేత ఇప్పుడు ఒకనాటి మిత్రపక్షం నుంచే సవాలును ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ బలహీనపడుతుంటే బీజేపీ నవీన్ ను ఎదుర్కోవడానికి సిద్ధమవుతోంది.

ఒడిశా రాజకీయ పరిస్థితులపై ఈరోజు 'దంగల్-2019'.

02



2,93,10,130

రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్య

- అసెంబ్లీ ఎన్నికలకన్నా 12.45 లక్షల పెరుగుదల
- పెండింగ్‌లో 10,34,357 దరఖాస్తులు
- 91,333 దరఖాస్తుల తిరస్కరణ

హైదరాబాద్, వెలుగు: లోక్‌సభ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధమైంది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు ఓటర్లు పెరిగారు. ఫిబ్రవరి 4తో కొత్త ఓటర్ల నమోదు గడువు ముగిసింది. దీంతో ఓటర్లు ఎందరున్నారనేదానిపై స్పష్టత వచ్చింది. రాష్ట్రంలో మొత్తం 2,93,10,130 మంది ఓటర్లున్నట్టు ఎన్నికల కమిషన్ ఖరారు చేసింది. కొత్తగా 23,71,136 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే అందులో 12,45,446 మందికి ఈసీ ఓటు హక్కు ఇచ్చింది. కొన్ని కారణాల వల్ల 91,333 మంది రిక్వెస్ట్‌ను ఈసీ తిరస్కరించింది. మరో 10,34,357 మంది దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల నాటికి రిజిస్టరైన ఓటర్లు 2,80,64,684.

మిగతా 3లో

బదిలీలు, సస్పెన్షన్లు

- అటవీ శాఖలో ఒకేసారి 200 మంది అధికారుల బదిలీ
- మరో 11 మంది సస్పెన్షన్
- ప్రభుత్వ ఉత్తర్వులు
- కలప స్మగ్లింగ్‌కు చెక్ పెట్టే దిశగా సర్కారు చర్యలు

02

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
70.00	70.00	70.00
కరీంనగర్	నిజామాబాద్	ఖమ్మం
71.00	70.00	72.00

పైసా కూడా పక్కదారి పట్టొద్దు



మంగళవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న టీచర్ ఎమ్మెల్సీలు

పండిట్, పీఈటీల పదోన్నతులకు సీఎం ఓకే 02

గ్రామాల్లో పనులపై ఆకస్మిక తనిఖీలు చేయాలి: కేసీఆర్

- ప్రతి ఊరికి పక్కా రోడ్డుండాలె.. హరితహారంతో పచ్చగా మార్చుకోవాలె
- ఉపాధి నిధులతో శ్మశాన వాటికలు కట్టించండి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సమీక్షలో సీఎం

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పైసా కూడా పక్కదారి పట్టొద్దని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. పనులు నామమాత్రంగా చేసి, నిధులు కాజేసే పద్ధతి పోవాలని, ప్రతి పైసా సద్వినియోగం కావాలని చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో వివిధ పథకాల కింద అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, 20 బృందాలుగా విడిపోయి ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో హరితహారానికి, శ్మశాన వాటికల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మంగళవారం సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై ఉన్నత స్థాయిలో సమీక్షించారు.

ఫుల్లు నిధులు

పంచాయతీల అభివృద్ధికి నిధులు సమృద్ధిగా ఉన్నాయని సీఎం కేసీఆర్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులు ఇస్తుందో రాష్ట్ర ప్రభుత్వం అంతే మొత్తం నిధులను కేటాయిస్తుందన్నారు. ఉపాధి హామీ నిధులతోపాటు రాష్ట్ర బడ్జెట్ నిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించారు. పంచాయతీల ఆధ్వర్యంలోనే ఉపాధి హామీ పనులు జరగాలని, గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను సృష్టించడానికి ఉపయోగపడాలని చెప్పారు. హరితహారంలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 12,751 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేయాలని,

మిగతా 2లో



రాకేశే హంతకుడు

- జయరాం హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణం
- శిఖా చౌదరి పాత్ర లేదు
- రాకేశ్ రెడ్డి, శ్రీనివాస్‌ను అరెస్టు చేశాం: కృష్ణా జిల్లా ఎస్పీ త్రిపాఠి
- రాకేశ్‌తో మాట్లాడిన సీఐ, ఏసీపీలపై చర్యలు
- శిఖా ప్రమేయం ఉందని జయరాం భార్య పద్మశ్రీ ఆరోపణలు

04

అటవీ శాఖలో 200 మంది ట్రాన్స్‌ఫర్

హైదరాబాద్, వెలుగు: 'జంగల్ బచావో-జంగల్ బడావో' దిశగా తొలి అడుగు పడింది. అటవీ శాఖ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా ఒకేసారి 200 మంది అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ఉత్వర్వులు జారీ చేసింది. మరో 11 మందిని అటవీ శాఖ సస్పెండ్ చేసింది. కలప స్మగ్లింగ్ ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడి అధికారులను సీఎం ఆదేశాల మేరకు బదిలీ చేశారు. అడవుల పెంపకంపై చిత్తశుద్ధి ఉండి నిజాయతీగా వ్యవహరిస్తారని పేరున్న వారికి బాధ్యతలిచ్చారు. హైదరాబాద్‌లో కాకుండా క్షేత్రస్థాయిలో పని చేయాలని సీఎం ఆదేశించడంతో పలువురు ఉన్నతాధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించారు. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎ.కె. సిన్హాకు అచ్చంపేట.. కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ హోదా ఉన్న శర్వానంద్, వినోద్ కుమార్‌లకు మెదక్, కవ్వాల్ బాధ్యతలిచ్చారు. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జనగామ, భూపాలపల్లి, ఖమ్మం, పాల్వంచ, కిన్నెరసాని, వరంగల్, ఖానాపూర్, అమ్రాబాద్, బాన్సువాడ, ఇల్లందు, కాగజ్‌నగర్, ఇచ్చోడకు కొత్త డీఎఫ్‌వోలను నియమించారు. మహబూబాబాద్, గూడూరు, గంగారం, బయ్యారం, ఆజంనగర్, పెద్దపల్లి, నర్సంపేట, మంచిర్యాల, డోర్నకల్, కరీంనగర్, కొత్తగూడెం, కెరిమెరి, బెల్లంపల్లి, తిర్యాని, గాంధారి, బాన్సువాడ, పిట్లం, నాగిరెడ్డిపేట, దూలపల్లి రేంజ్ అధికారులను బదిలీ చేసి కొత్త వారిని నియమించారు.

11 మంది సస్పెండ్

స్మగ్లర్లకు సహకరించిన 11 మంది అధికారులను అటవీ శాఖ సస్పెండ్ చేసింది. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) స్థాయి నుంచి గార్డుల వరకు సస్పెండైన వారిలో ఉన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు గుర్తించిన మరికొందరికి ఉన్నతాధికారులు మెమోలు జారీ చేశారు.

బదిలీ అయిన ఉన్నతాధికారులు

పేరు	హోదా	ప్రస్తుత స్థానం	బదిలీ
ఎ.కె సిన్హా	ఐఎఫ్ఎస్	సీసీఎఫ్, మెదక్	సీసీఎఫ్, అమ్రాబాద్
సి.శ్రవణన్	ఐఎఫ్ఎస్	సీసీఎఫ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్	సీసీఎఫ్, మెదక్
సి.పి వినోద్‌కుమార్	ఐఎఫ్ఎస్	సీఎఫ్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్	సీఎఫ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్
వి.ఎస్.ఎన్.వి ప్రసాద్	ఐఎఫ్ఎస్	డీఎఫ్‌వో, నిజామాబాద్	డిఎఫ్‌వో, నిర్మల్
శివాని డోగ్ర	ఐఎఫ్ఎస్	డీసీఎఫ్, అరణ్య భవన్	డీఎఫ్‌వో, మంచిర్యాల్
సునీల్ ఎస్ హిరామత్	ఐఎఫ్ఎస్	డీఎఫ్ఓ, ఖమ్మం	డీఎఫ్‌వో, నిజామాబాద్
జి.రామలింగరాజు	ఐఎఫ్ఎస్	డీఎఫ్‌వో, మంచిర్యాల్	డీఎఫ్‌వో, వరంగ్ అర్బన్, జనగాం
ఎస్.వి ప్రదీప్‌కుమార్	ఐఎఫ్ఎస్	ఎఫ్‌డీవో, ఏటూరు నాగారం	డీఎఫ్‌వో, జయశంకర్ భూపాలపల్లి
బి.ప్రవీణ్	డీసీఎఫ్	వీఆర్	డీఎఫ్‌వో, ఖమ్మం
ఎం.నాగభూషణం	డీసీఎఫ్	ఎఫ్‌డీవో, కిన్నెరసాని (డబ్ల్యుఎల్ఎం)	ఎఫ్‌డీవో, మంచిర్యాల్
ఎస్ సుజాత	ఏసీఎఫ్	ఫారెస్ట్ జెనెసిస్ట్, వరంగల్	ఎఫ్‌డీవో, పాల్వంచ
జే.వెంకటేశ్వరరావు	ఏసీఎఫ్	వీఆర్	ఫారెస్ట్ జెనెసిస్ట్, వరంగల్
ఎస్ తిరుమల్‌రావు	ఏసీఎఫ్	ఎఫ్‌డీవో, బెల్లంపల్లి	ఎఫ్‌డీవో, ఖానాపూర్
ఎస్.వెంకటేశ్వర్లు	ఏసీఎఫ్	ఎఫ్‌డీవో, అమ్రాబాద్	ఎఫ్‌డీవో, నిజామాబాద్
కె.సుధాకర్	ఏసీఎఫ్	డీఎఫ్‌వో, విజిలెన్స్	డీఎఫ్‌వో, అమ్రాబాద్
పి.సాగర్	ఏసీఎఫ్	డిప్యూటి డైరెక్టర్, టీఎస్ఎఫ్ఏ	ఎఫ్‌డీవో, బాన్సువాడ
పి.అనిల్‌కుమార్	ఏసీఎఫ్	డిప్యూటి డైరెక్టర్, టీఎస్ఎఫ్ఏ	ఎఫ్‌డీవో, ఇల్లందు
ఎం.రాజారమణ రెడ్డి	ఏసీఎఫ్	ఏసీఎఫ్(లా), అరణ్య భవన్	ఎఫ్‌డీవో, కాగజ్‌నగర్



ఢిల్లీలోని ఔరంగజేబ్ రోడ్ క్లస్టర్ హౌజింగ్‌లో నివాసం ఉంటున్న కుటుంబాలతో ప్రియాంక

మహారాష్ట్రలో ప్రియాంక తొలి ర్యాలీ

ముంబై: కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక గాంధీ వాద్రా మహారాష్ట్రలో ర్యాలీతో లోక్‌సభ ఎన్నికల ప్రచారంతో పాటు తన రాజకీయ ప్రయాణాన్నీ ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని నందర్బార్ లో ప్రియాంక ప్రచారం తొలి ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్‌వర్గాలు చెబుతున్నాయి. మాజీ ప్రధాని, దివంగత నేత ఇందిరా గాంధీ కూడా ఇక్కడి నుంచే తన రాజకీయ కెరీర్‌ను మొదలుపెట్టారు. ఇక్కడి ఆదివాసీలకూ, గాంధీల రాజకీయ ప్రయాణానికి విడదీయలేని అనుబంధం ఉందని సీనియర్ నేతలు చెబుతున్నారు. సోనియా గాంధీ కూడా ఇక్కడి నుంచే తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. ఈ క్రమంలో ప్రియాంక గాంధీ కూడా ఇక్కడ ర్యాలీ నిర్వహిస్తే పార్టీకి కొత్త ఊపిరి అందుతుందని స్థానిక నాయకులు అభిప్రాయపడుతున్నారు.

'పెద్దలు' పరార్!

మహబూబ్‌నగర్, వెలుగు:

గ్రామ పెద్దలు కుర్చీల్లో కూర్చుని, దళిత సర్పంచ్‌ను కింద కూర్చోబెట్టి పంచాయతీ చేసిన ఘటనపై సర్కారు సీరియస్ అయింది. 'పెద్దలదే పంచాయతీ' హెడ్డింగ్‌తో మంగళవారం 'వెలుగు'లో ప్రచురితమైన కథనంపై మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ స్పందించారు. జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గం పెదిరిపాడు గ్రామంలో జరిగిన ఈ ఘటనపై ఆరా తీశారు. వెంటనే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీంతో నారాయణపేట ఆర్డీవో శ్రీనివాస్ మంగళవారం ఊరికివెళ్లి సర్పంచ్ బాలప్ప, గ్రామస్తులతో మాట్లాడారు. సర్పంచ్‌ను కింద కూర్చోబెట్టిన గ్రామ పెద్దలు అప్పటికే పరారయ్యారు. దళిత సర్పంచ్‌ను అవమానించారంటూ ప్రజా సంఘాలు ఆందోళనకు దిగాయి. ఆర్డీవోతోపాటు కోస్గి సీఐ శ్రీనివాసరావు కూడా ఈ ఘటనపై విచారణ జరిపారు. తాను ఇష్టపూర్వకంగానే కింద కూర్చున్నానని వారికి బాలప్ప చెప్పినట్టు సమాచారం. గ్రామ పెద్దలంతా రావడంతో కుర్చీలు సరిపోక తాను కింద కూర్చున్నానని అన్నట్టు తెలిసింది. అయితే గ్రామ పెద్దలుగా వ్యవహరించేవారికి భయపడే సర్పంచ్ బాలప్ప అలా చెప్పి ఉంటారని స్థానికులు అంటున్నారు.

'కుర్చీల్లో ఉన్నోళ్లంతా' పరార్

దళిత సర్పంచ్‌ను అవమానించిన ఘటన కలకలం రేపడంతో 'గ్రామ పెద్దలు' పరారయ్యారు. మంగళవారం ఉదయం ప్రజాసంఘాల నేతల నిజ నిర్ధారణ కమిటీ గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించింది. మీడియా కూడా గ్రామానికి వెళ్లింది. గ్రామ పెద్దలను కలవడానికి ప్రయత్నించినా.. ఎవరూ ఊర్లో లేరనే సమాచారం వచ్చింది. దాదాపు ఊరు జనమంతా ఇళ్లలోనే ఉండిపోయారు. ఎవరూ బయటికి రాలేదు, వచ్చినా వివరాలూ చెప్పలేదు. ఈ ఘటనపై నారాయణపేట డీఎస్పీ శ్రీధర్ ప్రజాసంఘాలతో మాట్లాడారు. ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ గోవిందు డీఎస్పీని కోరారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన

దళిత సర్పంచ్‌ను అవమానించిన పెత్తందార్లపై చర్యలు తీసుకోవాలంటూ ప్రజాసంఘాల నాయకులు మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గ్రామాల్లో ఇంకా పెత్తందార్ల మాటే నడుస్తోందని మండిపడ్డారు. కావాలనే బాలప్పను అవమానించారని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా పెదిరిపాడు గ్రామంలో గ్రామస్థులను విచారిస్తున్న అధికారులు

- సర్పంచ్‌ను కింద కూర్చోబెట్టిన ఘటనపై సర్కారు సీరియస్
- 'వెలుగు' కథనానికి స్పందన
- విచారణకు ఆదేశించిన మహబూబ్‌నగర్ కలెక్టర్
- ఆందోళనకు దిగిన ప్రజా సంఘాలు



అట్రాసిటీ కేసు పెట్టాలి

దళిత సర్పంచ్ ను అవమానించిన ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని, గ్రామ పెద్దలుగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష పోరాట సమితి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు బాలప్ప, కురుమన్న డిమాండ్ చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో దళితులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసి, గ్రామ పెత్తందార్లయిన వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, మల్‌రెడ్డిలపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నేటికీ గ్రామాల్లో కుల వివక్షను పాటించడం క్షమించరాని నేరమన్నారు. ఇప్పటికైనా దళిత ప్రజాప్రతినిధి హక్కులను కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కళింగ యుద్ధమేనా?

ఒడిశాలో పట్టువదలని పట్నాయక్

వెలుగు బ్యూరో:

తూర్పు భారతంలో బెంగాల్, బీహార్ తర్వాత పెద్ద రాష్ట్రం ఒడిశా. అంతులేని సహజ సంపదలు ఈ రాష్ట్రం సొంతం. దేశంలోనే బొగ్గు, ముడి ఇనుము ఖనిజాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఒకటి. అయినా జనాభాలో సగం కంటే ఎక్కువమంది పేదలున్న రాష్ట్రం కూడా ఇదే. ఎందుకంటే జనాభాలో మూడో వంతుమంది గిరిజనులే. దీనికి తోడు మావోయిస్టుల సమస్య కూడా తీవ్రంగా ఉంది. ఇలాంటి రాష్ట్రానికి దాదాపు రెండు దశాబ్దాలుగా నవీన్ పట్నాయక్ అన్న పేరు పర్యాయపదంగా మారిపోయింది. దేశ రాజకీయాల్లో ఇప్పటి వరకు ఓటమి ఎరుగని నేతగా అరుదైన రికార్డు ఆయన సొంతం. ప్రతి ఎన్నికల్లోనూ గెలుపు, ప్రతి గెలుపులోనూ ఇంకిన్ని పెరిగే సీట్లు. ఇలా విపక్షాలను మామూలుగా ఓడించడం కాదు పూర్తిగా చిత్తుచేయడం అలవాటుగా మార్చుకున్నారు నవీన్. 1999 పార్లమెంట్ ఎన్నికలతో రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన ఆయన 2000లో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి సీఎం అయ్యారు. బీజేపీకి మిత్రపక్షంగా ఉంటూ వచ్చారు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉండేది. ఆ తర్వాత 2004, 2009, 2014ల్లో లోక్ సభకు, అసెంబ్లీకి కలిపి జరిగిన ఎన్నికల్లో తిరుగులేని విజయాలు సాధించారు. అయితే 2009 ఎన్నికలకు ముందే రాజకీయ విభేదాలతో బీజేడీ, బీజేపీ తెగదెంపులు చేసుకున్నాయి. దీంతో నవీన్ బలహీనపడిన ట్టేనని అందరూ భావించారు. ఎవరి అంచనాలకు అందకుండా 2009 ఎన్నికల నుంచి మరిన్ని సీట్లు పెంచుకుంటూ వచ్చారు నవీన్. దూరమైన బీజేపీ పెద్దగా సాధించింది లేకపోగా విపక్షంగా ఉన్న కాంగ్రెస్ మరింత బలహీనపడిపోయింది.

ఒడిశాకు తాకని మోడీ హవా


2014లో దేశమంతా మోడీ హవా కనిపిస్తే ఒడిశాలో మాత్రం నవీన్ ప్రభంజనమే వీచింది. 21 లోక్ సభ సీట్లలో 20 సీట్లను బీజేడీ సొంతం చేసుకుంటే బీజేపీ ఒక్క సీటుతో సరిపెట్టుకుంది. యూపీ సహా చాలా చోట్ల అంచనాలకు అందకుండా బీజేపీ గెలిచినా ఒడిశాలో ఆనవాలు కూడా లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. తాను చేసిన పనులే తనను గెలిపిస్తాయన్నది నవీన్ ధీమా. ఈసారీ అదే నమ్మకంతో ఉన్నారు. అయితే ఈసారి పరిస్థితి కాస్త మారింది. ఏ చిన్న అవకాశాన్నీ వదలకుండా పాగా వేయడానికి బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. అందుకు రకరకాల ప్రణాళికలు వేస్తోంది. కాంగ్రెస్ మాత్రం ఏ మాత్రం మెరుగుపడలేదు.

ఒడిశా రైతుబంధు... కాలియా

తాజాగా తెలంగాణ రైతుబంధు తరహాలో కాలియా అనే కొత్త పథకాన్ని తీసుకొచ్చారు నవీన్ పట్నాయక్. ఈ పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి ఎంత పొలం ఉన్నా ఏటా రూ.10వేలు అందిస్తారు. అంటే ఒక ఎకరం ఉన్నా, పది ఎకరాలున్నా సాయం అందుతుంది. భూమి లేని ఎస్సీ, ఎస్టీలకు కూడా ఏడాదికి రూ.12,500 ఇస్తామని ప్రకటించారు. పశువులు, చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, పౌల్ట్రీ లాంటి పరిశ్రమల్లో వీరు పనిచేయాల్సి ఉంటుంది.



- 20 ఏళ్లుగా ఏమాత్రం తగ్గని బలం
- బీజేపీ దూరమైనా పెరిగిన సీట్లు
- అంతకంతకూ దెబ్బతిన్న విపక్షాలు
- ఈసారి కమలంతోనే అసలు సమరం



అటు పథకాలు.. ఇటు సవాళ్లు

సంక్షేమ పథకాలే తమను మళ్లీ గెలిపిస్తాయని బీజేడీ నేతలు నమ్ముతున్నారు. జనాభాలో సగానికిపైగా ఉన్న నిరుపేదలే నవీన్ బలం. పుట్టుక నుంచి మరణం వరకు ప్రతి దశలోనూ ఏదోలా ప్రభుత్వ సాయం అందేలా పథకాలను ఆయన అమలు చేస్తున్నారు. గర్భిణుల కోసం మమత యోజన, రూపాయికి కిలో బియ్యం, బడి పిల్లలకు ఉచితంగా యూనిఫాం, సైకిళ్లు, లాప్‌టాప్ లు, ఉచిత మందులు, విద్యార్థినులకు శానిటరీ నేప్ కిన్లు, దోమతెరలు, వితంతు, వృద్ధాప్య పెన్షన్లు, అంత్యక్రియల సాయానికి మహాపారాయణ లాంటి పథకాల్ని తెచ్చారు. పట్టణాల్లో రూ.5కే భోజనం అందించే పథకం ఆహార్ ను మున్సిపాలిటీల్లో అమలు చేస్తున్నారు.. నవీన్ బాగా నమ్మకం పెట్టుకున్న పథకం బిజూ కృషక్ కళ్యాణ్ యోజన. ఈ స్కీంలో రైతులకు ఒక్క శాతం వడ్డీతో రుణాలిస్తోంది రాష్ట్ర సర్కార్.

కళింగ కోసం కాషాయం

బీజేపీతో తెగదెంపుల తర్వాత నవీన్ రెండు జాతీయ పార్టీలకు సమాన దూరంలోనే ఉంటున్నారు. జాతీయ రాజకీయాల్లో కింగ్ లేదా కింగ్ మేకర్ కావాలని ప్రయత్నాలు చేయలేదు. ఇప్పుడు కూడా ఇదే వైఖరి కొనసాగిస్తున్నారు. ఎన్నికల తర్వాత పరిస్థితిని బట్టి ఆయన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే బీజేపీ మాత్రం కళింగ గడ్డపై పాగా కోసం 2014 నుంచే ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. అసెంబ్లీతో పాటు లోక్ సభలో ఎక్కువ సీట్లు దక్కించుకోవాలని అమిత్ షా మిషన్ 120 ప్లాన్ చేశారు. కింది స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తున్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే బీజేపీ బలపడింది. దీంతో కాంగ్రెస్ గతం కంటే మరింత బలహీనపడింది. ఒడిశాలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని అమిత్ షా పదేపదే చెబుతున్నారు. గెలుపు సంగతి అలా ఉంచితే ఆ పార్టీకి కలిసొచ్చే అంశాలు మాత్రం కొన్ని ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన పది సీట్లలో ఎనిమిది ఒడిశా తూర్పుతీరంలోవే. దీంతో ఈ ప్రాంతమే తమను నిలబెడుతుందని బాగా ఆశలు పెట్టుకుంది. 2017 పంచాయతీ ఫలితాలు ఈ ఉత్సాహానికి ఊతమిచ్చాయి. మొత్తం 849 స్థానాల్లో బీజేడీకి 460 సీట్లు దక్కితే బీజేపీకి 306 స్థానాలు వచ్చాయి. కాంగ్రెస్ 66 స్థానాలతో సరిపెట్టుకుంది. మూడేళ్లలోనే ఇంత బలం పెంచుకోవడం బీజేపీకి ఉత్సాహాన్నిస్తోంది. అందుకూ అమిత్ షా తరచూ ఒడిశా వెళుతూ సభలు పెడుతున్నారు.

కాంగ్రెస్ కు మూడో స్థానమే?

ఒడిశాలో కాంగ్రెస్ దాదాపుగా దెబ్బతింది. పేరున్న ఒక్క నేత కూడా ఆ పార్టీలో లేరు. ఉన్నవాళ్లలోనూ నానా విభేదాలున్నాయి. 1995లో అధికారం పోయాక మళ్లీ ఏ దశలోనూ గెలిచే ఆశలు లేని పరిస్థితికి దిగజారింది. ఇటీవలే ఒడిశా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నబా కిషోర్ దాస్ పార్టీకి రాజీనామా చేసి బీజేడీలో చేరారు. రాష్ట్రానికి చెందిన మాజీ కేంద్ర మంత్రి శ్రీకాంత్ జెనాను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నారన్న కారణంతో బహిష్కరించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఒక సీట్ సాధిస్తే కాంగ్రెస్ అసలు ఖాతానే తెరవలేదు.



నాయక్ నహీ... పట్నాయక్

పార్లమెంట్ తో పాటే అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఒడిశా కూడా ఒకటి. రాజకీయ దిగ్గజం, తండ్రి బిజూ పట్నాయక్ మరణం వరకు నవీన్ రాజకీయాలకు దూరంగానే ఉన్నారు. బిజూ ఒడిశాకు సీఎంగా ఉన్న కాలంలో నవీన్ చదువంతా ఇతర ప్రాంతాల్లోనే సాగింది. సొంత ఆసక్తితో ఇంగ్లిష్ రచయితగా ఎదిగారు. ఆయనకు ఒరియా భాష చదవడం, రాయడం కూడా రాదు. ఇప్పటికీ సభల్లో ఒరియాను ఇంగ్లీష్‌లో రాసుకొని చదువుతారు. అలాంటి వ్యక్తి తండ్రి మరణం తర్వాత ఆయన పేరుతోనే బిజూ జనతాదళ్ ఏర్పాటు చేశారు. వాజ్ పేయి హయాంలో బీజేపీతో జతకట్టారు. 200708 కాలంలో తలెత్తిన కాంధమాల్ అల్లర్లు రెండు పార్టీల మధ్య దూరం పెంచింది. అప్పట్లో బజరంగ్ దళ్ కార్యకలాపాలు పెరగడం, స్వామి లక్ష్మణానంద సరస్వతి హత్య సంఘటనలతో ఉద్రిక్తంగా మారింది. దీంతో బీజేపీ మతతత్వ పార్టీ అంటూ నవీన్ తెగతెంపులు చేసుకున్నారు. 2009 ఎన్నికల నుంచి ఒంటరిగానే బరిలో ఉంటున్నారు. ఆయినా ఓటర్ల ఎప్పుడూ ఆయనకే అండగా ఉంటున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా ప్రభుత్వ వ్యతిరేకత కనిపించకపోవడం రాజకీయ విశ్లేషకుల అంచనాలకు కూడా అందని విషయం. పైగా అసెంబ్లీలో మూడింట రెండొంతుల మెజారిటీతో నవీన్ గెలుస్తూ వస్తున్నారు. మన రాష్ట్రం మన పార్టీ నినాదంతో ఆయన సాగుతున్నారు.

నవీన్ కూ తప్పని తలనొప్పులు

ఒడిశాలో మైనింగ్ పెద్ద పరిశ్రమ. భారీ కార్పొరేట్ కంపెనీలు ఇందులో పనిచేస్తున్నాయి. 2014లో వచ్చిన 60వేల కోట్ల మైనింగ్ స్కాం ఆరోపణలే ఈ పరిశ్రమ స్థాయిని చెబుతుంది. ఇందులో నవీన్ పైనా విమర్శలొచ్చాయి. రాష్ట్రంలో వైద్యసేవల పరిస్థితిని చెప్పిన మాంఝీ ఘటన నవీన్ సర్కార్ ను పెద్ద ఇరకాటంలో పెట్టింది. కలహండి జిల్లాకు చెందిన ధన మాంఝీ అనే వ్యక్తి తన కూతురితో కలిసి భార్య శవాన్ని 10కిలోమీటర్లు మోసుకెళ్లడం దేశాన్ని కదిలించింది. ఇలాంటి సంఘటనలతో పాటు నిరుద్యోగ సమస్య నవీన్ కు పెద్ద తలనొప్పిగా మారుతోంది. రాష్ట్రానికి అప్పుల భారం పెరిగిపోవడం, సంక్షేమ పథకాలను సరిగా అమలు చేయలేకపోవడం, చాలాకాలంగా సాగునీటి ప్రాజెక్టులు పెండింగ్ లో పడడంపై నవీన్ విమర్శలను ఎదుర్కొంటున్నారు. మోడీపై వ్యతిరేకతే తనకు కలిసొస్తుందని ఆయన నమ్ముతున్నారు. అలాగే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లలో బీజేపీ, కాంగ్రెస్ చీలిక తెస్తాయని అంచనా వేసుకుంటున్నారు. నవీన్ ఎదుర్కొంటున్న మరో సమస్య మావోయిస్టులు. కొన్నేళ్ల ప్రయత్నాల తర్వాత ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లాల్లో కొంతవరకు మావోయిస్టులను కట్టడి చేశారు. అయితే ఇప్పుడు వారు ఇంతవరకు అడుగుపెట్టని జిల్లాల్లో బలపడే ప్రయత్నాలు చేస్తుండడం నవీన్ పట్నాయక్‌కు కొత్త సవాలు విసురుతోంది.

పైసా కూడా పక్కదారి పట్టొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతీ గ్రామంలో మొక్కలు నాటి రక్షించాలని సూచించారు. ఇందుకోసం ఉపాధి నిధులు వినియోగించుకోవాలన్నారు. అటవీశాఖ అధికారుల సలహాలు, సాంకేతిక సహకారంతో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

శుభ్రంగా ఉంచండి

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు. ఇది గ్రామ పంచాయతీల బాధ్యత అన్నారు. ఊర్లో ఉన్న పాడుపడిన, వాడని బావులను పూడ్చేయాలని, మురికి చెట్లను, కూలిన ఇండ్ల శిథిలాలను, చెత్తాచెదారాన్ని తొలగించాలని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు కచ్చితంగా బీటీ రోడ్డు ఉండాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కొత్తగా 859 గ్రామాలకు రహదారులను నిర్మించాలని, ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధంచేసి పనులు మొదలుపెట్టాలని ఆదేశించారు.

ప్రతి గ్రామంలో శ్మశాన వాటిక

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో శ్మశాన వాటికలు ఉండాలని కేసీఆర్ చెప్పారు. వైకుంఠధామాల పేరిట వాటిని ఏర్పాటు చేయాలన్నారు. మూడు వేలలోపు జనాభా కలిగిన 11,412 గ్రామాల్లో ఒకటి చొప్పున, మూడు వేలకు పైగా జనాభా ఉన్న 1,300 గ్రామాల్లో రెండు చొప్పున మొత్తం 14,012 వైకుంఠధామాలు నిర్మించాలన్నారు. వాటిని కచ్చితంగా ఆరునెలల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూమి లేకుంటే గ్రామ పంచాయతీలు తమ నిధులతో స్థలాలు సమకూర్చాలని, దాతల నుంచి స్వీకరించాలని సూచించారు. అవసరమైతే ఉపాధి హామీ నిధులను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఎంపీలు బి.వినోద్ కుమార్, బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు ఈటల రాజేదర్, డీఎస్ రెడ్యానాయక్, బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే మాలోతు కవిత, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్ పాల్గొన్నారు.

పండిట్, పీఈటీల పదోన్నతికి సీఎం ఓకే

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని సెకండ్ గ్రేడ్ భాషా పండిట్‌లు, పీఈటీలకు ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించింది. దీనికి సంబంధించిన ఫైల్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సంతకం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కేసీఆర్ భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఇకపై గ్రేడ్-2 పండిట్ పోస్టులుండవు. ఈ నిర్ణయంతో 10,880 మంది భాషాపండితులు, పీఈటీలకు మేలు జరగనున్నది.

సీఎంకు ఎమ్మెల్సీల కృతజ్ఞత

పదోన్నతి ఫైలుపై సీఎం సంతకం చేయడంతో టీచర్ ఎమ్మెల్సీలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు పూల రవీందర్, జనార్దన్ రెడ్డి, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ ప్రగతిభవన్‌లో మంగళవారం సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. భాషా పండితుల చిరకాల వాంఛను కేసీఆర్ నెరవేర్చారని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, చావ రవి, పీఆర్‌టీయూటీ రాష్ట్ర కార్యదర్శి చెన్నయ్య హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

సీఎం కేసీఆర్ స్వాగతోపన్యాసం

హైదరాబాద్, వెలుగు: కొత్త సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణనిచ్చే 300 మంది మాస్టర్ ట్రైనర్లకు బుధవారం నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. టీఎస్ ఐపార్డ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు 5 రోజులపాటు శిక్షణ ఇస్తారు. తొలిరోజు ప్రగతి భవన్‌లో కార్యక్రమం జరుగుతుంది. సీఎం కేసీఆర్ స్వాగతోపన్యాసం చేస్తారు. పంచాయతీ రాజ్ చట్టం 2018పై అవగాహన కల్పిస్తారు. ట్రైనింగ్ పూర్తయ్యాక ట్రైనర్లను 30 జిల్లాలకు విభజిస్తారు. జిల్లా కేంద్రాల్లో సర్పంచులు, వార్డు సభ్యులకు వీరు శిక్షణనిస్తారు. టీఎస్ ఐపార్డ్‌లో ఈ నెల 4నే ట్రైనర్లకు శిక్షణ ఇవ్వావాలనుకున్నా బుధవారానికి వాయిదా వేశారు. 12 వేలకు పైగా సర్పంచులు, లక్షకు పైగా వార్డు సభ్యులుండటంతో జిల్లా కేంద్రాల్లోనే ఇవ్వాలని నిర్ణయించారు. రాజధానికి దగ్గరున్న జిల్లాల సర్పంచులు, గతంలో రెండు, మూడు సార్లు గెలిచిన వారిని తొలిరోజు ట్రైనింగ్‌కు ఆహ్వానించినట్టు తెలిసింది.

రాష్ట్రం నుంచే 'పీఎం కిసాన్'

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి ఎలాంటి ప్రత్యేక ప్రతిపాదనలు అందలేదని కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద రైతులకు సంబంధించి పూర్తి వివరాలు ఉన్నాయని, ఇక్కడ వీలైనంత త్వరగా పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేయాలని కోరినట్లు వసుధా మిశ్రా వివరించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ రాహుల్ బొజ్జా, సీసీఎల్ఏ డైరెక్టర్ కరుణ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1కి కటాఫ్

ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతు కుటుంబం యూనిట్‌గా పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తారు. ఏడాది రూ. 6 వేలు (మూడు విడతలుగా) అందజేస్తారు. కుటుంబ సభ్యుల్లో మేజర్ అయిన పిల్లలకు వ్యవసాయ భూమి ఉంటే వారిని వేరే కుటుంబంగా పరిగణిస్తారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నాటికి రెవెన్యూ రికార్డుల్లో ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులే ఈ పథకానికి అర్హులు. గత డిసెంబర్ 1 నుంచి మార్చి నాటికి మొదటి విడతగా లెక్కగట్టి పథకం నిధులు మంజూరు చేస్తారు.



ఢిల్లీపై దీదీ గురి!

(మొదటిపేజీ తరువాయి)

మరోవైపు ప్రతిపక్షాలకు తానే పెద్దదిక్కన్న సంకేతాలను మమత పంపారు. కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీని ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్ శ్రేణులు, కొన్ని ప్రతిపక్ష పార్టీలు తెరమీదికి తెస్తున్నాయి. డీఎంకే బహిరంగంగానే ఆయన పేరును ప్రకటించేసింది. ఇది కొందరు సీనియర్లకు మింగుడు పడటం లేదు. అన్ని పార్టీలు ఒక్కతాటిపైకి వస్తున్నప్పుడు.. కేంద్రంలో అధికారంలోకి రావడం అంత కష్టమేమి కాదని, అలాంటప్పుడు తామెందుకు ప్రధాని కావొద్దని పలువురు నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. వారిలో మమత కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఆమె సీబీఐ అంశాన్ని తెర మీదికి తెచ్చారు. దేశ రాజకీయాలను తనవైపు తిప్పుకున్నారు. దీదీ ధర్నాకు ప్రతిపక్ష పార్టీలన్నీ మద్దతు తెలపక తప్పని పరిస్థితి ఎదురైంది. ఇలా అందరి మద్దతును కూడగట్టిన మమత.. రేపు లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాల ప్రధాని అభ్యర్థిగా తెరమీదికి వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కర్నాటక ముఖ్యమంత్రి కుమార స్వామి ప్రమాణం వేళ మొదలైన ప్రతిపక్షాల ఐక్యత.. ఇటీవల కోల్‌కతాలో మమత నిర్వహించిన ర్యాలీతో పటిష్టమైంది. కోల్‌కతా ర్యాలీకి 24 పార్టీలు తరలివచ్చి.. నరేంద్రమోడీ సర్కార్‌పై కాలు దువ్వాయి. ర్యాలీ ద్వారా తన బలం ఇది అని మమత నిరూపించుకునే ప్రయత్నం చేశారు. ఇప్పుడు ధర్నా ద్వారా మరోసారి నిరూపించుకునే ప్రయత్నం చేశారు.

ఆ స్కాంల మాటేంది?

రోజ్‌వ్యాలీ, శారదా చిట్‌ఫండ్ స్కాములు కొన్నాళ్లుగా మమత సర్కార్‌ను కుదిపేస్తున్నాయి. తృణమూల్ నేతలకు ఇందులో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. కేసుల విచారణను మొదట బెంగాల్ పోలీసుల పరిధిలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రారంభించింది. దీనికి ప్రస్తుత కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ నేతృత్వం వహించారు. కేసు తప్పుదోవపడుతోందని బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో.. సీబీఐ దర్యాప్తునకు కోర్టు ఆదేశించింది. విచారణ మొదలెట్టిన సీబీఐ.. కేసును నీరుగార్చేందుకు రాజీవ్ కీలక పత్రాలు మాయం చేసినట్లు గుర్తించింది. విచారణకు సహకరించాలని కోర్టు ఆదేశించినా రాజీవ్ స్పందించలేదు. కోర్టు సమన్లూ లెక్కచేయలేదు. ఈ క్రమంలో రాజీవ్ ఇంట్లో సీబీఐ అధికారులు సోదాలకు రావడం.. వారిని బెంగాల్ పోలీసులు అదుపులోకి తీసుకోవడం.. వెంటనే సీపీకి మద్దతుగా మమత రాత్రికి రాత్రి ధర్నా ప్రారంభించారు. స్కామ్‌ల నుంచి తప్పించుకునేందుకే మమత ధర్నా నాటకం ఆడారని బెంగాల్‌లో ప్రతిపక్ష సీపీఎం దుయ్యబడుతోంది. స్కాముల్లో మమత అనుచరులు ఉన్నారని, వారిని రక్షించేందుకు ఆమె ఎత్తులు వేస్తున్నారని బీజేపీ ఆరోపిస్తోంది. స్కాముల విషయంలో జనంలోనూ మమతపై నిరసన వ్యక్తమవుతోంది. తాము తప్పు చేయలేదని, కావాలనే మోడీ సర్కారు రాష్ట్రాన్ని నాశనం చేయాలని చూస్తోందని ధర్నా వేదికగా దీదీ ధిక్కార స్వరం వినిపించారు. స్కాముల్లో తమవారి ప్రమేయం లేదన్న సంకేతాలను జనంలోకి తీసుకెళ్లాలని ప్రయత్నించారు.



బెంగాల్‌లో ఎవరి బలమెంత?

బెంగాల్‌లో అధికార టీఎంసీ హవా తగ్గలేదని ఇటీవలి సర్వేలు వెల్లడించాయి. బీజేపీ కూడా బలపడుతోందని అంచనా వేశాయి. రాష్ట్రంలోని ప్రతిపక్ష సీపీఎం వంటి వామపక్షాల ఓట్లు కమలం వైపు మళ్లుతున్నాయని, బీజేపీ 7 లోక్ సభ స్థానాలు గెలుచుకుంటుందని సీ ఓటర్ సంస్థ గత నెలలో నిర్వహించిన సర్వేలో తేలింది. ఇదే సంస్థ గతేడాది నవంబర్‌లో చేసిన సర్వేలో బీ జేపీకి 9 సీట్లొస్తాయంది. క్షేత్రస్థాయిలో బీజేపీకి బలమైన నాయకత్వం లేదని, అది ప్రాతినిధ్యం వహిస్తున్న అసన్‌సోల్, డార్జిలింగ్ హిల్స్‌లోనూ పరిస్థితి అనుకూలించడం లేదని విశ్లేషించింది. అయితే.. మమత చేపట్టిన తాజా ధర్నాతో బీజేపీ పుంజుకోవడం ఖాయమని సర్వేలు అంచనా వేస్తున్నాయి. కుంభకోణాల ఎఫెక్ట్ మమత సర్కార్‌పై పడుతుందని, దాని నుంచి దృష్టి మరల్చేందుకే ఆమె ధర్నాకు దిగినట్లు ఓటర్లు భావిస్తున్నట్లు కొన్ని జాతీయ మీడియా సంస్థలు లెక్కలు గట్టాయి. 2014 ఎన్నికల మాదిరిగానే ఈ సారి మమతా బెనర్జీ పార్టీకి 34 సీట్లొస్తాయని తొలుత చెప్పిన సంస్థలు.. ఇప్పుడు ఆ సీట్లు తగ్గొచ్చని అంటున్నాయి. మరికొన్ని సంస్థలు మమతకు ధర్నా కలిసి వస్తుందని చెప్తున్నాయి. ఏదేమైనా బెంగాల్‌లో సీబీఐ ఎపిసోడ్ బీజేపీకి, టీఎంసీకి లబ్ధి చేకూర్చనుంది. ఒకప్పుడు బెంగాల్ అంటేనే తాము అన్న స్థాయిలో ఉన్న వామపక్ష పార్టీలు ఇప్పుడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొబోతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో తృణమూల్‌కాంగ్రెస్ పార్టీకి 43.7 శాతం, బీజేపీకి 31.8శాతం ఓట్లు రావొచ్చని సీ ఓటర్ సర్వే తెలిపింది. ఇక్కడి 5 రీజినల్స్‌లో డెల్టా, నార్త్ బోర్డర్‌లో తృణమూల్‌కు.. హైలాండ్స్, సదర్ ప్లెయిన్స్‌లో బీజేపీకి మంచి పట్టు ఉందని పేర్కొంది.



మోడీ వ్యూహమేంది?



బెంగాల్‌లో పట్టుకోసం బీజేపీ ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. 42 లోక్‌సభ స్థానాలున్న బెంగాల్‌లో 2014 ఎన్నికల్లో బీజేపీ 2 సీట్లే గెలిచింది. అందులో అసన్‌సోల్ నుంచి బాబుల్ సుప్రియో, డార్జిలింగ్ హిల్స్ నుంచి అహ్లువాలియా విజయం సాధించారు. ఆ ఇద్దరూ కేంద్ర మంత్రులుగా కొనసాగుతున్నారు. ఆ ఎన్నికల్లో టీఎంసీ 34 సీట్లు గెలిచింది. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ 20 సీట్లు సాధించాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాని మోడీ ఫోకస్ పెట్టారు. ఇటీవల మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి కేంద్రం భారతరత్న ప్రకటించింది. ప్రణబ్ బెంగాల్‌వాసి కావడంతో ఆ రాష్ట్ర ప్రజలు తమవైపు మళ్లుతారని బీజేపీ భావిస్తోంది. ఇటీవల మోడీ బెంగాల్ వెళ్లి.. మమతా బెనర్జీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీ చీఫ్ అమిత్ షా వీలుదొరికినప్పుడల్లా అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకప్పుడు వామపక్షాలు వర్సెస్ తృణమూల్ అనే స్థాయిలో ఉండే బెంగాల్ పాలిటిక్స్.. ఇప్పుడు తృణమూల్ వర్సెస్ బీజేపీ అన్నట్లుగా మారిపోయాయి. మమత ధర్నా అంశం కూడా తమకే కలిసి వస్తుందని బీజేపీ నమ్ముతోంది.



మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ ఉత్తమ్. పక్కన సబిత, షబ్బీర్ తదితరులు

గెలుస్తామని ఎలా చెబుతున్నారు?

- 'లోక్‌సభ'కు స్ట్రాటజీ ఉందా?
- రాష్ట్ర నేతలకు రాహుల్ ప్రశ్నలు
- మళ్లీ సమావేశమై పక్కా వ్యూహంపై చర్చిద్దామని సూచన

హైదరాబాద్, వెలుగు: అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా ఓడిపోయారు? ప్రజల విశ్వాసం పొందలేకపోవడానికి కారణాలేమిటి? టీఆర్ఎస్‌కు 12 శాతం ఓట్లు ఎలా పెరిగాయి? లోక్‌సభ ఎన్నికల్లో గెలుపునకు ఏదైనా స్ట్రాటజీ ఉందా? అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన మీరు పార్లమెంట్ ఎన్నికల్లో గెలుస్తామని ఎలా చెబుతున్నారు? కాంగ్రెస్ పార్టీ చీఫ్ రాహుల్ గాంధీతో సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు ఎదురైన ప్రశ్నలివి. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ వార్ రూంలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో రాహుల్ భేటీ అయ్యారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆర్సీ కుంతియా, ఏఐసీసీ కార్యదర్శులు శ్రీనివాసన్, సలీం, బోసు రాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు పొన్నం ప్రభాకర్, రేవంత్ రెడ్డి, కుసుమ కుమార్, అజారుద్దీన్, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. సుమారు గంటకుపైగా సాగిన సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణాలు.. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు వ్యూహాలపై రాహుల్ ఆరా తీసినట్లు తెలిసింది. వచ్చే ఎన్నికలు కాంగ్రెస్ కు అత్యంత కీలకమని, అధికారంలోకి రావడానికి ప్రతి సీటు అవసరమేనని చెప్పినట్టు సమాచారం. రెండు, మూడు రోజుల్లో మళ్లీ సమావేశమై లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చిద్దామని, దీనికి ప్లాన్లతో రావాలని రాహుల్ ఆదేశించినట్టు తెలిసింది. టికెట్ల ప్రకటనలో ఆలస్యం, టీడీపీతో పొత్తు మంచిదే అయినా చంద్రబాబు జోక్యం ఎక్కువ కావడం, జనంలో తెలంగాణ సెంటిమెంట్ రావడం, కేసీఆర్ విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేయడం, ఈసీ భారీగా ఓట్లను తొలగించడంతో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైందని పలు కారణాలను రాష్ట్ర నేతలు రాహుల్ కు చెప్పినట్లు సమాచారం. అందరి సమక్షంలోనే రాహుల్ ఒక్కొక్కరి అభిప్రాయాలనూ అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. గత ఐదేళ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర నాయకత్వం సరైన పోరాటాలు చేయకపోవడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి రాహుల్ తో చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో సరైన నాయకత్వం లేకపోవడం పార్టీకి పెద్ద లోపమని, జనంలో పార్టీ ఉండాలనే ఆలోచన నాయకత్వం చేయాలని వీరు రాహుల్ తో అన్నట్లు తెలిసింది.

ఏపీలో టీడీపీకి షాక్

పార్టీ వీడే యోచనలో చీరాల ఎమ్మెల్యే ఆమంచి ○ వైఎస్సార్ సీపీలోకి ఖలీల్ బాషా

విజయవాడ, వెలుగు: ఏపీలోని ప్రకాశం జిల్లా చీరాల ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ టీడీపీని వీడే యోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. వైకాపాలో చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. పార్టీ మార్పుపై సన్నిహితులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నట్లు సమాచారం. ఈనెల 13న వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా ఆమంచి ఆ పార్టీలో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు కడప జిల్లాలో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ నేత ఖలీల్ బాషా టీడీపీని వీడారు. మంగళవారం హైదరాబాద్ లోని లోటస్ పాండ్ లో జగన్మోహన్ రెడ్డి సమక్షంలో ఖలీల్ వైఎస్సార్ సీపీలో చేరారు. ఖలీల్ కు కండువా కప్పి పార్టీలోకి జగన్ ఆహ్వానించారు. కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే అంజాద్ బాషా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఎప్పుడూ సెక్యులర్ కాలేడు



- సామాజిక అసమానతలకు పాలకులే కారణం: గడ్కరీ
- కాళేశ్వరం ప్రాజెక్టుకు వారంలోనే అనుమతిచ్చామన్న కేంద్ర మంత్రి

హైదరాబాద్/సికింద్రాబాద్, వెలుగు: 'రాజు, ప్రభుత్వం, పరిపాలన.. సెక్యులర్‌గా ఉండొచ్చు. కానీ వ్యక్తి ఎప్పుడూ సెక్యులర్ కాలేడు. తప్పుడు పనులు చేస్తేనే కాదు.. మంచి పనులు చేసినా ఎక్కువ మంది శత్రువులు పెరుగుతారు' అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. ప్రజలను కన్ఫ్యూజ్ చేసే రాజకీయాలు జరుగుతాయని, జాగ్రత్తగా ఉండాలని బీజేపీ కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల్లో గెలవడం ముఖ్యం కాదని హామీలు నిలబెట్టుకోవడం ముఖ్యమన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా సామాజిక అసమానతలు కొనసాగడానికి కారణం పాలకులేనని విమర్శించారు. ఆర్థికంగా వెనుబడిన వర్గాల కోసం కేంద్రం తీసుకువచ్చిన 10శాతం కోటా చరిత్రాత్మకమన్నారు. డీపీఆర్ లేకున్నా.. నీటి సమస్య పరిష్కారం కోసం కాళేశ్వరం ప్యాజెక్టుకు కేవలం వారం రోజుల్లోనే అనుమతులిచ్చామని తెలిపారు. చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర ప్రజలు బీజేపీని కచ్చితంగా ఆదరిస్తారని, మెజారిటీ సీట్లలో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే కేంద్ర ప్రభుత్వ మంత్రివర్గంలో తెలంగాణకు స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. ఏపీలో పోలవరం ప్రాజెక్టుకు 100 శాతం నిధులను కేంద్రమే ఇచ్చిందని తెలిపారు. నల్లా దగ్గర జరిగే మహిళల లొల్లి మాదిరి 45 టీఎంసీల నీళ్ల విషయంలో ఆంధ్ర, తెలంగాణ అధికారులు, మంత్రులు గొడవ పడుతున్నారని ఆయన విమర్శించారు. ఒకరికొకరు నమస్కారం చేసుకోలేని, ముఖం కూడా చూసుకోలేని వారు మోడీకి వ్యతిరేకంగా కూటమి కడుతున్నారని చంద్రబాబు, కాంగ్రెస్ దోస్తీని ఉద్దేశించి గడ్కరీ ఎద్దేవా చేశారు. దేశంలో బలమైన, పటిష్టమైన ప్రభుత్వం కావాలో.. కిచిడీ ప్రభుత్వం కావాలో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీ దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే 'పీఎం కిసాన్'

కోదండరెడ్డి విమర్శ

హైదరాబాద్, వెలుగు: ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే బీజేపీ సర్కారు పీఎం కిసాన్ సమ్మాన్ పథకాన్ని తెచ్చిందని కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. కోదండరెడ్డి మంగళవారం విమర్శించారు. ఈ పథకంతో ఒక్కో రైతుకు రోజుకు రూ.17 మాత్రమే అందుతాయన్నారు. కనీస మద్దతు ధరపై ప్రధాని మోడీ పార్లమెంట్‌లో ఏనాడూ మాట్లాడలేదని మండిపడ్డారు. పంటల బీమా పేరుతో కార్పొరేట్ కంపెనీలకే లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. ఏడాదికి రూ. 6 వేల సాయం పేరుతో రైతులను అవమానపరిచారని విమర్శించా



రు. కేంద్రం ఇచ్చే నామమాత్రపు సాయం వద్దంటూ కిసాన్ సెల్ ఆధ్వర్యంలో రూ.17 చెక్కును మోడీకి పంపినట్టు చెప్పారు.

బీసీలకూ రిజర్వేషన్లు పెంచాలి: వీహెచ్

అగ్ర వర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇచ్చిన మోడీ బీసీలకూ రిజర్వేషన్లు పెంచాలని కాంగ్రెస్ నేత వి. హన్మంతరావు కోరారు. కుల సంఘాలను విడదీయాలనే ప్రయత్నంలో సీఎం కేసీఆర్ ఉన్నారని, దాంట్లో జోక్యం చేసుకోవద్దన్నారు. రాష్ట్రంలో మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. లాబీయింగ్‌తో పదవులు తెచ్చుకుంటున్నారని ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేసిన ఆరోపణలపై పార్టీ అంతర్గత భేటీలో చర్చించుకుంటామన్నారు.

2,93,10,130

రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్య

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో 2018 జనవరి నాటికి 2,53,27,785 మంది ఓటర్లు ఉన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ముసాయిదా నోటిఫికేషన్ వచ్చేనాటికి ఆ సంఖ్య 2,61,36,776 కు పెరిగింది. మరణాలు, ఓటు హక్కును ఇతర రాష్ట్రాలకు మార్పించుకోవడం, డూప్లికేషన్లు ఇతరత్రా కారణాలతో 1,36,964 మందిని జాబితా నుంచి తొలగించారు. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికల నాటికి 8,08,991 మంది కొత్త ఓటర్లు నమోదు అయ్యారు. తాజాగా జాబితాలో చేరిన 12.45 లక్షల మందికి ఫొటో ఓటర్ గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు ఈసీ చర్యలు చేపట్టింది. పార్లమెంటు సమావేశాల తర్వాత లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రాబోతుండటంతో 28వ తేదీ లోపు ఉద్యోగుల బదిలీలు పూర్తి చేయాలని ఇప్పటికే సర్కారును ఈసీ ఆదేశించింది.

ఓటర్ల నమోదు వివరాలు

ఫారం	దరఖాస్తులు	అంగీకరించినవి	తిరస్కరించినవి	పెండింగ్
ఫారం-6	17,97,628	9,32,756	61,047	8,03,825
ఫారం-6ఏ	2,091	94	72	1,925
ఫారం-7	1,97,818	1,38,836	5,986	52,996
ఫారం-8	2,22,914	97,126	20,761	1,05,027
ఫారం-8ఏ	1,50,685	76,634	3,467	70,584
మొత్తం	23,71,136	12,45,446	91,333	10,34,357

నేడు తిరుపతిలో జగన్ 'శంఖారావం'

తిరుపతి, వెలుగు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ' సమర శంఖారావం' పేరుతో ఏపీలో సదస్సులు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతిలోని యోగానంద్ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే సదస్సులో పాల్గొననున్నారు. చిత్తూరు జిల్లా బూత్ కన్వీనర్లు, పార్టీ కార్యకర్యకర్తలతో సమావేశం కానున్నారు. ఈ నెల 7న కడప, 11న అనంతపురం, 12న నెల్లూరు, 13న ప్రకాశం జిల్లాల్లో సమర శంఖారావం సదస్సుల్లో ఆయన పాల్గొననున్నారు.

జీశాట్ 31 ప్రయోగం నేడే

శ్రీహరికోట: జీశాట్ 31 ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. బుధవారం తెల్లవారుజామున 2.31 గంటలకు జరిగే ప్రయోగానికి కౌంట్ డౌన్ మొదలైంది. ఫ్రెంచ్ గయానాలోని కౌరూ ప్రయోగ కేంద్రం నుంచి ఏరియాన్ 5 రాకెట్ తో జీశాట్ 31ను నింగిలోకి పంపనున్నారు. ఇంటర్నెట్, డీటీహెచ్ ప్రసారాలు, మొబైల్ నెట్ వర్క్ లను మరింత పటిష్టం చేసేందుకు ఇస్రో ఈ ఉపగ్రహాన్ని పంపుతోంది. భారత భూభాగంతో పాటు సముద్ర తీరాలు, దీవుల్లో సమాచార వ్యవస్థలు పటిష్టం అవుతాయి. ఇస్రో పంపుతున్న ఈ 40వ కమ్యూనికేషన్ ఉపగ్రహం బరువు 2,535 కిలోలు.



దక్షిణ మధ్య రైల్వే జీఎంగా మాల్యా బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, వెలుగు : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గా గజానన్ మాల్యా మంగళవారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. అప్పటివరకు ఆయన బీహార్ లోని జమాల్ పూర్ ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ (ఐఆర్ఎస్ఎంఈ) సంస్థ డైరెక్టర్ గా పనిచేశారు. 1979లో స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటిస్ గా సర్వీసును ప్రారంభించిన ఆయన రైల్వేలో డిప్యూటీ జనరల్ మేనేజర్, రాంచీ డివిజన్ డీఆర్ఎం, ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, రైట్స్ జనరల్ మేనేజర్ గా బాధ్యతలు నిర్వర్తించారు.

చెరువులకు లోయర్ మానేరు నీళ్లు

హైదరాబాద్, వెలుగు: లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ) నుంచి చెరువులకు నీళ్లు విడుదల కానున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మంగళవారం ఈఎన్సీ మురళీధర్ కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ ఆఫీసర్లు ఎల్ఎండీ పరిధిలోని ఎమ్మెల్యేలతో బుధవారం జలసౌధలో సమావేశం అవుతారని సమాచారం. గతేడాది ప్రాజెక్టుకు 50 టీఎంసీలు నీళ్లు వచ్చి చేరినా ఆయకట్టుకు చుక్క కూడా వదల్లేదు. ఖరీఫ్ లో మాత్రం ఎల్ఎండీ కింద చెరువులను నింపారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు మిగిలిన నీళ్లను తరలించారు.

'సమ్మర్ సమురాయ్ కి లక్షమంది స్టూడెంట్లు'

హైదరాబాద్, వెలుగు: ఈ ఏడాది సమ్మర్ సమురాయ్ కార్యక్రమంలో లక్ష మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నామని రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు సమాజంపై అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు మార్కెట్ యార్డులు, గ్రామాల సందర్శన, స్వచ్ఛరాజకీయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఉన్నత విద్యపై మంగళవారం హైదరాబాద్ లో నిర్వహించిన సదస్సులో ఆయన చెప్పారు. సమావేశంలో కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై వివరణ ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, వెలుగు: వన్యప్రాణులు ముఖ్యంగా పులుల సంరక్షణకు తీసుకున్న చర్యలపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు మంగళవారం ఆదేశించింది. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పులుల సంరక్షణ పథకాన్ని అమలు చేయాలని దాఖలైన పిల్ పై చీఫ్ జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డిలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. వన్యప్రాణులను వాటి మానాన వాటిని వదిలేసినా అవి అంతరించిపోవని హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకే నెలలో రెండు పులులు చనిపోయాయని, మహారాష్ట్ర అడవుల నుంచి వచ్చిన 20 పులులు కనిపించట్లేదని, కరెంటు ఫెన్సింగ్ తో అవి చనిపోతున్నాయని హైదరాబాద్ బండ్లగూడ కు చెందిన పిటిషనర్ జాగిర్ దియాసూర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

రాకేశే హంతకుడు

జయరామ్ హత్యకేసును చేధించాం : కృష్ణా ఎస్పీ త్రిపాఠి

- ఆర్థిక లావాదేవీలే కారణం
- శిఖా చౌదరి పాత్ర లేదు
- రాకేశ్ రెడ్డి, శ్రీనివాస్ అరెస్టు
- రాకేశ్ తో మాట్లాడిన సీఐ, ఏసీపీలపై చర్యలు



జయరాం హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

విజయవాడ, వెలుగు: కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ చిగురుపాటి జయరామ్ హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి చెప్పారు. జయరామ్ మేనకోడలు శిఖా చౌదరి స్నేహితుడు రాకేశ్ రెడ్డి హత్య చేసినట్లు తేలిందన్నారు. ఈ కేసులో శిఖా చౌదరికి ఎలాంటి పాత్ర లేదని ఆయన స్పష్టం చేశారు. రాకేశ్ రెడ్డి, వాచ్ మెన్ శ్రీనివాస్ ను అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. మంగళవారం ఏపీలోని కృష్ణా జిల్లా నందిగామ పోలీస్ స్టేషన్ లో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. "టెక్రాన్ సంస్థలో సమస్యలు వచ్చినప్పుడు రాకేశ్ రెడ్డి దగ్గర జయరామ్ అప్పు తీసుకున్నారు. శిఖా చౌదరికి సహకరించాలని రాకేశ్ రెడ్డిని జయరాం కోరారు. ఈ క్రమంలో రాకేశ్ రెడ్డి, శిఖా చౌదరి మధ్య సంబంధాలు కొనసాగాయి. కొంత కాలంగా వాళ్లిద్దరి మధ్య సంబంధాలు లేవు. జయరామ్ తన డబ్బులు ఇవ్వకపోవడంతో శిఖా ఇంటి వద్ద రాకేశ్ రెడ్డి నిఘా ఏర్పాటు చేశాడు. గత నెల 29న జయరామ్ శిఖా చౌదరి ఇంటికి వెళ్లాడు. ఈ విషయాన్ని వాచ్ మెన్ రాకేశ్ రెడ్డికి చెప్పాడు. దీంతో ఓ అమ్మాయి పేరుతో రాకేశ్ రెడ్డి జయరామ్ తో చాటింగ్ చేశాడు. ఈ చాటింగ్ ద్వారా రాకేశ్ రెడ్డి ఇంటికి జయరామ్ వెళ్లాడు. తర్వాత డబ్బుల కోసం జయరామ్ ను నిలదీశాడు. జయరామ్ కోరిక మేరకు కోస్టల్ బ్యాంకు మాజీ మేనేజర్ ఈశ్వరప్రసాద్ రూ.6 లక్షలు చెల్లించాడు. విజయవాడలోని కోస్టల్ బ్యాంకు నుంచి డబ్బులు ఇస్తానని జయరామ్ రాకేశ్ రెడ్డితో చెప్పాడు. అయితే డబ్బుల కోసం జయరామ్ ను రాకేశ్ రెడ్డి కొట్టాడు. సోఫాపై ముఖం వేసి నొక్కడంతో ఊపిరాడక ఆయన చనిపోయాడు. మృతదేహాన్ని పథకం ప్రకారమే అక్కడి నుంచి కార్లో తరలించాడు. అందుకోసం ఇద్దరు పోలీసుల సలహాలు తీసుకున్నాడు" అని ఎస్పీ త్రిపాఠి చెప్పారు. ఈ కేసులో ఇంకా సాక్ష్యాలను సేకరించాల్సి ఉందన్నారు. ఈ హత్యలో శిఖా చౌదరికి పాత్ర ఉందనేందుకు ఆధారాలు లేవని చెప్పారు. ఆమెను ఈ కేసు నుంచి తప్పించాల్సిన అవసరం తమకు లేదన్నారు. గతనెల 31న కృష్ణా జిల్లా ఐతవరం దగ్గర రాత్రి హైవే గస్తీ పోలీసులు జయరామ్ మృతదేహాన్ని గుర్తించడం తెలిసిందే. సెల్ ఫోన్ ఆధారంగా బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈ నెల 1న జయరామ్ మామ గుత్తా పిచ్చయ్య చౌదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నందిగామ డిఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ లు ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజీ, ఫోన్ కాల్స్ డేటా ఆధారంగా పోలీసులు ఈ కేసును ఛేదించారు.

వెలుగులోకి ఇద్దరు పోలీసుల పాత్ర

జయరామ్ హత్య తర్వాత హైదరాబాద్ లోని నల్లకుంట సీఐ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డితో రాకేశ్ రెడ్డి మాట్లాడినట్టు ఆధారాలు లభించాయని కృష్ణా జిల్లా ఎస్పీ త్రిపాఠి చెప్పారు. వారి సలహాతోనే జయరామ్ మృతదేహాన్ని రాకేశ్ రెడ్డి రాష్ట్ర సరిహద్దులు దాటించినట్లు తెలిసింది. ఇప్పటికే హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ నల్లకుంట సీఐ శ్రీనివాస్ ను బదిలీ చేశారు. ఏసీపీ మల్లారెడ్డిని అంబర్ పేట్ హెడ్ క్వార్టర్స్ కు అటాచ్ చేసినట్లు రాచకొండ సీపీ మహేశ్ భగవత్ ప్రకటించారు.

శిఖా ప్రమేయం ఉంది

జయరామ్ భార్య పద్మశ్రీ

జయరామ్ హత్యకేసులో శిఖా ప్రమేయం ఉందని ఆయన భార్య పద్మశ్రీ బుధవారం హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏపీ పోలీసులు ఆమెను తప్పిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ప్రాణ హాని ఉందని రక్షణ కల్పించాలని కోరారు. అంతకు ముందు నందిగామ పోలీసులు జయరామ్ భార్య పద్మశ్రీ వాంగ్మూలం నమోదు చేశారు. శిఖా చౌదరి ప్రమేయం లేకుండా రాకేశ్ ఈ నేరానికి పాల్పడే అవకాశం లేదని ఆమె చెప్పినట్లు తెలుస్తోంది. ఇక్కడ న్యాయం జరగని పక్షంలో అమెరికా పోలీసులకి ఫిర్యాదు చేస్తానని ఆమె చెప్పినట్లు సమాచారం.

రాన్ బాక్సీ డీల్ తో కోట్లకు పడగెత్తి..

- పారిశ్రామికవర్గాల్లోనూ జయరాం వివాదాస్పదుడే



దారుణ హత్యకు గురైన పారిశ్రామికవేత్త డాక్టర్ చిగురుపాటి జయరామ్ కు పారిశ్రామిక వర్గాల్లోనూ వివాదాస్పదుడిగా పేరుంది. 1980ల్లో బయో కెమికల్ జెనెటిక్స్ లో డాక్టరేట్ చేసిన చిగురుపాటి.. దేశంలో అవకాశాలు పెద్దగా లేకపోవడంతో అమెరికా వెళ్లారు. అమెరికాలో అప్పుడప్పుడే బయో టెక్నాలజీ బూమ్ మొదలైంది. రీకాంబినెంట్ డీఎన్ఏ టెక్నాలజీ ఆధారంగా తయారైన డ్రగ్స్ కు ఎఫ్ డీఏ అనుమతులు వెంట వెంటనే రావడంతో ఆ రంగంలోకి అడుగుపెట్టిన ఫార్మా కంపెనీలు మిలియన్ల డాలర్లు సంపాదించడం మొదలెట్టాయి. రీకాంబినెంట్ బయో టెక్నాలజీతో తయారైన ఇన్సులిన్ అప్పట్లో పెద్ద సంచలనం. స్వతహాగా తెలివైనవాడు, నెట్ వర్కింగ్ స్కిల్స్ ఉండటంతో జయరామ్ అమెరికాలో సక్సెస్ ఫుల్ కెరీర్ నిర్మించుకున్నారు.

తొలుత రెడ్డీస్ ల్యాబ్స్ తో..

1991-92 సమయంలో ఇండియాలో ఆర్థిక సంస్కరణలు మొదలవడంతో దేశీయ కంపెనీలు కొత్త వ్యాపార అవకాశాలపై దృష్టి పెట్టాయి. అప్పుడే డాక్టర్ రెడ్డీస్ వ్యవస్థాపక చైర్మన్ అంజిరెడ్డి కూడా బయోటెక్నాలజీ రంగంలోకి అడుగుపెట్టేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. అప్పుడే ఆయన దృష్టిలో చిగురుపాటి జయరాం పడ్డారు. చిగురుపాటిని టాప్ లెవల్ ఎగ్జిక్యూటివ్ గా నియమించి బయో టెక్నాలజీ డివిజన్ ను అప్పగించారు. డాక్టర్ రెడ్డీస్ లో కొంత సక్సెస్ ను చవిచూసిన చిగురుపాటి.. తర్వాత విభేదాలతో సంస్థ నుంచి బయటపడి సొంత కంపెనీ పెట్టుకున్నారు. కానీ డాక్టర్ రెడ్డీస్ బయోటెక్నాలజీ డివిజన్ చీఫ్ గా డెవలప్ చేసిన ప్రొడక్ట్స్ నే సొంత కంపెనీకి తీసుకువెళ్లారన్న అభియోగాలు వచ్చాయి. దీంతో పేటెంట్ విభేదాలు తలెత్తినట్టు వార్తలు వచ్చాయి. తర్వాత జెనోటెక్ లాబ్స్ లో మెజార్టీ వాటాలను తీసుకొన్నారు.

ఒక్క డీల్ తో కోట్లు..

చిగురుపాటి డెవలప్ చేస్తున్న డ్రగ్స్ పోర్ట్ ఫోలియోను గుర్తించిన రాన్ బాక్సీ ప్రమోటర్లు అప్పట్లోనే జెనోటెక్ లో 10 శాతం వాటా తీసుకున్నారు. తర్వాత ఏడాదిలోనే (2007 నాటికి) 234 కోట్ల రూపాయలతో వాటాను 45 శాతానికి పెంచుకున్నారు. 2008లోనూ మరిన్ని షేర్లుకొన్నారు. ఇలా రాన్ బాక్సీ భాగస్వామ్యంతో చిగురుపాటికి కోట్లు వచ్చిపడ్డాయి. కానీ రాన్ బాక్సీకి మాత్రం ఆశించిన స్థాయిలో ఫలితాలు అందలేదు. ఈలోపు రాన్ బాక్సీని జపాన్ దిగ్గజం దైచీ టేకోవర్ చేసింది. జెనోటెక్ లోనూ మిగతా వాటాను కొనుగోలుకు ఆఫర్ చేసింది. అయితే ఆ రేటును తిరస్కరించిన చిగురుపాటి కోర్టుకెళ్లారు. ఆ తర్వాత దైచీ.. రాన్ బాక్సీని సన్ ఫార్మాకు అమ్మేసుకుంది. కొత్త యాజమాన్యం చిగురుపాటిని కంపెనీ నుంచి బయటికి పంపేసింది. చిగురుపాటి మాత్రం రాన్ బాక్సీ డీల్ లో వచ్చిన కోట్ల రూపాయలతో దూకుడుగా ముందుకుపోయారు. అన్ని బిజినెస్ నిర్ణయాల్లోనూ అంచనాలు తప్పాయి. చివరికి కథ విషాదాంతమైంది.



స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లు, ప్రింటర్స్ ను చూపుతున్న రాచకొండ సీపీ మహేష్ భగవత్

చిక్కిన దొంగనోట్ల ముఠా

భారీగా రూ.500, రూ.2వేల నకిలీ నోట్లు స్వాధీనం

- కేవలం సంతల్లోనే చెలామణి చేస్తున్న గ్యాంగ్
- 10 మందిని అరెస్ట్ చేసిన రాచకొండ పోలీసులు

హైదరాబాద్, వెలుగు: మరో దొంగనోట్ల ముఠా పోలీసులకు చిక్కింది. అసలు నోట్లకు ఏ మాత్రం తీసిపోని విధంగా నకిలీ నోట్లు తయారు చేసి చెలామణి చేస్తున్న ఓ గ్యాంగ్ ను రాచకొండ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నకిలీ నోట్లను ఈ ముఠా సభ్యులు కేవలం పశువుల సంతల్లోనే చెలామణి చేస్తుండడం విశేషం. ఇందుకు సంబంధించిన వివరాలను రాచకొండ సీపీ మహేష్ భగవత్ మీడియాకు వెల్లడించారు.

12 మందితో గ్యాంగ్..

ఇప్పన్నపల్లి రాజేష్ (34)ది ఆదిలాబాద్ జిల్లా చెన్నూర్. 2013లో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తూ కూకట్ పల్లి పోలీసులకు చిక్కాడు. బయటకొచ్చాక హైదరాబాద్ లోని సరూర్ నగర్ డాక్టర్స్ కాలనీలో ఓ ఇంటికి అద్దెకు తీసుకుని నకిలీ నోట్లు ప్రింట్ చేసేందుకు ప్లాన్ చేశాడు. అందుకోసం కలర్ ప్రింటర్లు, స్కానర్లు, స్క్రీన్ ప్రింటింగ్ మెటీరియల్ సమకూర్చుకున్నాడు. తయారీ, సరఫరా కోసం ఏపీలోని శ్రీకాళహస్తికి చెందిన రోషన్ మహబూబ్ షేక్, పలదుసు ధరణి (విజయవాడ), కొప్పుల శ్రీనివాస్ (రాజమండ్రి), చంద్రశేఖర్ (రావులపాలెం), సుఖేష్ (ఏలూరు), దుర్గా ప్రసాద్ లతో రెండు ముఠాలను ఏర్పాటు చేశాడు. వీరంతా కలిసి రూ.500, రూ.2వేల నకిలీ నోట్లు తయారు చేస్తున్నారు.

పశువుల సంతల్లో మార్పిడి

నకిలీ నోట్లను ఎవరూ గుర్తుపట్టకుండా ప్రింటింగ్ కు నాణ్యమైన పేపర్ వాడారు. కరెన్సీ నోట్లపై ఉండే గాంధీబొమ్మతోపాటు వాటర్ మార్క్, ఎలక్ట్రోటైప్ మెటీరియల్ ను సమకూర్చుకున్నారు. ఈ గ్యాంగ్ హైదరాబాద్ శివారులో మార్కెటింగ్ కోసం మలక్ పేటకు చెందిన మహ్మద్ బాబా, బాబానగర్ కు చెందిన మహ్మద్ షకీల్, మీర్ చౌక్ కు వాసి ఇస్మాయిల్ (38) లను చేర్చుకుంది. వీరు చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం తోపాటు సిటీ శివారు ప్రాంతాల్లో జరిగే పశువుల సంతల్లో నకిలీ నోట్లు చెలామణి చేస్తున్నారు.

లక్షకు మూడు లక్షలు

హైదరాబాద్ శివారులో నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న వారికి ఈ ముఠా లక్ష ఇస్తే మూడు లక్షల విలువైన నకిలీనోట్లు ఇచ్చేది. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న ఎల్బీనగర్ పోలీసులు డాక్టర్స్ కాలనీలోని రాజేష్ ఉంటున్న ఇంటిపై దాడి చేశారు. గ్యాంగ్ లోని 10 మందిని అరెస్టు చేసి 614 నకిలీ రూ.2 వేల నోట్లు, 3,795 రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. స్కానర్, కలర్ ప్రింటర్స్, స్క్రీన్ ప్రింటింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సీపీ మహేష్ భగవత్ తెలిపారు. పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలిస్తున్నామన్నారు.

ఏపీలోనూ 'రైతు బంధు'?

'అన్నదాత సుఖీభవ' పేరుతో పథకం

- ఓటాన్ బడ్జెట్ లో రూ.5000 కోట్లు కేటాయింపు
- నిరుద్యోగ భృతి రూ. 2 వేలకు పెంపు
- 70 ఏళ్లు దాటిన వారికి 10% అదనపు పెన్షన్
- 2019-20 బడ్జెట్ రూ.2.26 లక్షల కోట్లు
- 2017-18 నాటికి రూ.2. 23 లక్షల కోట్లకు అప్పు



విజయవాడ, వెలుగు: ఎన్నికల వేళ రైతులను ప్రసన్నం చేసుకోవడానికి బడ్జెట్ లో కొత్త పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వ 'రైతు బంధు' తరహాలో 'అన్నదాత సుఖీభవ' పేరుతో పెట్టుబడి సాయం అందించనున్నట్లు వెల్లడించింది. ఇందుకోసం రూ.5 వేల కోట్లను కేటాయించినట్లు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. ఏపీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను శాసనసభలో మంగళవారం యనమల ప్రవేశపెట్టారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2.26 లక్షల కోట్లతో ప్రభుత్వం బడ్జెట్ రూపొందించింది. ఇది గతేడాది కన్నా 18.38 శాతం ఎక్కువ. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.1.80 లక్షల కోట్లు, ఆర్థిక లోటు అంచనాను రూ.32,390 కోట్లుగా చూపించారు. మూలధన వ్యయం రూ.29,596 కోట్లు, రెవెన్యూ మిగులు రూ.2,099 కోట్లుగా అంచనా వేశారు. 2014-15లో రూ.1,48,744 కోట్ల అప్పుంటే 2017-18 నాటికి రూ.2,23,706 కోట్లకు చేరిందని యనమల వెల్లడించారు. నిరుద్యోగులకు రూ. వెయ్యి భృతిని రూ.2 వేలకు పెంచుతున్నట్లు యనమల తెలిపారు. ఇందులో భాగంగా యువనేస్తం పథకానికి రూ. 1,200 కోట్లు కేటాయించామన్నారు. మహిళా సాధికారత కోసం ప్రవేశపెట్టిన 'పసుపు కుంకుమ'కు రూ. 4వేల కోట్లు ప్రకటించారు. పథకం కింద డ్వాక్రా సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి అదనంగా రూ. 10 వేలు చెల్లిస్తామని యనమల తెలిపారు. బీసీల్లోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. ఫెడరేషన్లను కూడా ఫైనాన్స్ కార్పొరేషన్లుగా మార్చుతూ నిర్ణయం తీసుకున్నారు. కాపు కార్పొరేషన్ కు రూ. 1,000 కోట్లు కేటాయించారు. డ్రైవర్స్ సాధికారిక సంస్థ ఏర్పాటు చేసి రూ.150 కోట్లు ప్రకటించారు. బీసీలతో పాటు అగ్రవర్ణాలకు కూడా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికీ నిధులు కేటాయించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ కు రూ.100 కోట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ కు రూ. 50 కోట్లిచ్చారు. ఉద్యోగులకూ ప్రభుత్వం పెద్ద ఎత్తున వరాలు కురిపించింది. కొత్త పెన్షన్ స్కీమ్ లో మార్పులకు కమిటీ ఏర్పాటు చేసింది. 70 ఏళ్లు దాటిన వాళ్లకు అదనంగా 10 శాతం పెన్షన్ ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.

ఆర్థిక శాఖకు రూ. 51,841 కోట్లు

రంగాలవారీగా ఆర్థిక శాఖకు అత్యధికంగా రూ.51,841 కోట్లు కేటాయించారు. తర్వాత పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.35,182 కోట్లు, జలవనరుల శాఖకు రూ.16,852 కోట్లు, వ్యవసాయ రంగానికి రూ. 12,732 కోట్లు, వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి రూ.10,032 కోట్లు, వృద్ధాప్య, వితంతు పింఛన్లకు రూ.10,401 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.8,242.64 కోట్లు, హోం శాఖకు రూ.6,397 కోట్లు, రోడ్లు భవనాలు, రవాణా శాఖకు రూ.5,382 కోట్లు ప్రకటించారు.

ఈడీ విచారణకు వాద్రా

మనీ లాండరింగ్ పై స్టేట్ మెంట్ రికార్డు చేసే చాన్స్

న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ కేసులో రాబర్ట్ వాద్రా ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరుకానున్నారు. బుధవారం ఈడీ వాద్రాను విచారిస్తుందని పేరు చెప్పడానికి ఇష్టపడని పెద్దాఫీసర్ ఒకరు తెలిపారు. బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో విచారణకు ఈడీకి సహకరించాల్సిందిగా ఢిల్లీ కోర్టు వాద్రాను ఆదేశించిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా లండన్ లోని ఆస్తులు, బ్యాంకు ట్రాన్సాక్షన్లు, కొనుగోళ్లు తదితరాలపై ఈడీ వాద్రాను ప్రశ్నించనుందని సమాచారం. మనీ లాండరింగ్ యాక్ట్ కింద ఆయన స్టేట్ మెంట్ కూడా రికార్డు చేస్తారని తెలిసింది. 2010లో లండన్ లోని 12, బ్రయాన్ స్టన్ స్క్వేర్ లో 1.9 మిలియన్ పౌండ్ల విలువైన భవంతిని కొనేందుకు వాద్రా మనీ లాండరింగ్ కు పాల్పడ్డారనేది ఈడీ ప్రధాన ఆరోపణ. తమ విచారణలో వాద్రాకు లండన్ లో తొమ్మిది మిలియన్ పౌండ్లు విలువజేసే రెండు ఇళ్లు, ఆరు ఫ్లాట్లు ఇంకా మరిన్ని ఆస్తులు ఉన్నాయని తెలిసిందని ఈడీ కోర్టుకు నివేదించింది. అయితే, కేవలం రాజకీయ దురుద్దేశాలతోనే తనపై నేరారోపణలు జరుగుతున్నాయని వాద్రా ఆరోపించారు.

మేం ఏ తప్పూ చేయలేదు

అమెరికా కోర్టుకు తెలుగు విద్యార్థుల విజ్ఞప్తి

- ఎనిమిది మందిని మిషిగన్ కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు
- ఫణిదీప్ కర్నాటీని బెయిల్ పై విడుదల చేసిన కోర్టు
- మిగతా వారికి డిటెన్షన్ కొనసాగింపు
- స్టూడెంట్లకు సాయం చేస్తున్న తెలుగు అసోసియేషన్లు
- విద్యార్థులు తెలిసే నేరం చేశారన్న అమెరికా విదేశాంగ శాఖ
- తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడి

వాషింగ్టన్ : ఫార్మింగ్టన్ యూనివర్సిటీ వ్యవహారానికి సంబంధించి తామే తప్పు చేయలేదని తెలుగు విద్యార్థులు అమెరికా కోర్టుకు వివరించారు. స్టింగ్ ఆపరేషన్ పేరిట ట్రాప్ చేశారని ఆరోపించారు. పోలీసులు ఈ కేసులో అరెస్టు చేసిన ఎనిమిది మంది తెలుగువారు ఫణిదీప్ కర్నాటి, భరత్ కాకిరెడ్డి, సురేశ్ కందాల, ప్రేమ్ రాంపీసా, సంతోష్ సామ, అవినాశ్ తక్కళ్లపల్లి, అశ్వంత్ నూనె, నవీన్ పత్తిపాటిలను మంగళవారం అమెరికాలోని మిషిగన్ కోర్టులో ప్రవేశపెట్టారు. తర్వాత ఈ ఎనిమిది మంది తరఫు అటార్నీలు (న్యాయవాదులు) విచారణకు హాజరై వాదనలు వినిపించారు. వీరిలో మంచి ట్రాక్ రికార్డు ఉన్న ఫణిదీప్ కర్నాటికి మాత్రం బెయిల్ లభించింది. మిగతావారిని డిటెన్షన్ సెంటర్ కు తరలించారు.

నేరం రుజువైతే ఐదేళ్ల జైలు

అమెరికాలో అక్రమంగా ఉంటూ, ఉద్యోగాలు చేసుకోవాలనుకునే వారిని పట్టుకునేందుకు అక్కడి పోలీసులు, ఇమిగ్రేషన్ అధికారులు 'యూనివర్సిటీ ఆఫ్ ఫార్మింగ్టన్ 'పేరిట ఉత్తుత్తి వర్సిటీని పెట్టిన విషయం తెలిసిందే. అందులో ఏదో కోర్సులో చేరి నవారు క్లాసులకు హాజరుకాకుండా.. బయట ఉద్యోగాలు చేసుకునేందుకు అవకాశమిచ్చారు. ఇది నిజమని నమ్మి తెలుగువారు సహా వందలాది మంది భారతీయ విద్యార్థులు ఆ వర్సిటీలో చేరారు. బయట ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఈ విద్యార్థులను చేర్చేందుకు కొందరు తెలుగువారు మధ్యవర్తులుగా వ్యవహరించారు. ఏడాదిన్నర పాటు ఈ వ్యవహారాన్ని కొనసాగించిన అమెరికన్ పోలీసులు, ఇమిగ్రేషన్ అధికారులు.. గత సోమ, మంగళవారాల్లో పలు చోట్ల దాడులు చేసి వీరందరినీ అదుపులోకి తీసుకున్నారు. అమెరికాలో అక్రమంగా ఉండేందుకు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ కేసులు పెట్టారు. ఇలా అరెస్టు చేసినవారిలో మధ్యవర్తులుగా వ్యవహరించిన ఎనిమిది మందిని మంగళవారం మిషిగన్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టులో ప్రవేశపెట్టారు. అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉండేందుకు వందల మంది విదేశీ విద్యార్థులకు సాయం చేశారని చార్జిషీట్ లో ఆరోపించారు. జడ్జి ఈ ఆరోపణలపై ప్రశ్నించగా.. తమకు ఇది చట్టవిరుద్ధమని తెలియదని, తామే నేరమూ చేయలేదని నిందితులు వివరించారు. దీంతో జడ్జి విచారణను వాయిదా వేశారు. ఫణిదీప్ కర్నాటి అటార్నీ జాన్ బ్రూస్టర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. 10 వేల డాలర్ల బాండ్ ను పూచీకత్తుగా తీసుకుని మంజూరు చేశారు. మిగతా ఏడుగురిని డిటెన్షన్ కు పంపారు. తర్వాత అటార్నీ జాన్ బ్రూస్టర్ మాట్లాడారు. ప్రభుత్వం స్టింగ్ ఆపరేషన్ చేసి విద్యార్థులకు వల వేయడం సరికాదని, ఇదంతా కావాలని చేశారని ఆరోపించారు. ఈ ఎనిమిది మందిపై నేరం రుజువైతే ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడవచ్చన్నారు.

నేరమని తెలిసే చేశారు: యూఎస్

ఈ కేసులో అరెస్టైన వారందరికీ తాము చట్టవిరుద్ధమైన పని చేస్తున్నట్టు ముందే తెలుసని అమెరికా విదేశాంగ శాఖ సోమవారంఆరోపించింది. "లెక్చరర్లు లేకుండా, క్లాసులకు వెళ్లకుండా, వర్సిటీలో చేరిన తొలి రోజు నుంచే ఉద్యోగం చేసుకోవడానికి అవకాశం ఉండదని వారికి తెలుసు. విదేశాల నుంచి వచ్చి చదువుకునేవారికి అమెరికా ప్రభుత్వం అన్ని రకాలుగా సాయం చేస్తుంది. ఇక్కడికి వచ్చే ఇండియా విద్యార్థుల విలువ ఏమిటో మాకు తెలుసు. ఏటా సుమారు రెండు లక్షల మంది భారతీయ స్టూడెంట్లు అమెరికాలో ఉన్నత చదువుకోసం వస్తున్నారు. వారి వల్ల ఆరు బిలియన్ డాలర్లు (సుమారు రూ.42 వేల కోట్లు) ఆదాయం వస్తోంది. వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. కానీ ఇంత ఘనమైన స్టూడెంట్ ప్రోగ్రామ్ ను కొందరు విద్యార్థులు, మధ్యవర్తులు దుర్వినియోగం చేయడం దారుణం. దీనికి సంబంధించి అమెరికా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది."అని పేర్కొంది.

అమెరికా సర్కారు తీరు సరికాదు: నాటా

బాధితులైన విద్యార్థులకు అండగా ఉంటామని నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (నాటా) ప్రకటించింది. అనుమతిలేని, నకిలీ యూనివర్సిటీ అని తెలియకే చాలా మంది అందులో చేరారని పేర్కొంది. విషయం బయటపడగానే చాలా మంది తెలుగు విద్యార్థులు నాటా ప్రతినిధులకు ఫోన్లు చేశారని, తాము వెంటనే అవసరమైన చర్యలు చేపట్టామని వెల్లడించింది. ఇమిగ్రేషన్ లాయర్లు విజయ్ ఎల్లారెడ్డి, సంతోష్ సోమిరెడ్డి తదితరుల ద్వారా ఉచితంగా న్యాయ సహాయం అందిస్తున్నామని తెలిపింది. నాటా ప్రతినిధులు డిటెన్షన్ సెంటర్లకు వెళ్లి అక్కడున్న విద్యార్థులను కలిసి, ధైర్యం చెబుతున్నారని పేర్కొంది. విద్యార్థులెవరూ ఇలాంటి ట్రాప్ లో పడొద్దని, నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించింది.

త్వరగా విడుదలయ్యేలా చూస్తాం

అమెరికా తెలంగాణ అసోసియేషన్

తెలుగు విద్యార్థులు త్వరగా విడుదలయ్యేలా చూస్తామని అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ (ఆటా తెలంగాణ) ప్రకటించింది. మిషిగన్ కోర్టులో ప్రవేశపెట్టిన తెలుగువారి తరఫున అటార్నీని ఏర్పాటు చేశామని, ఇమిగ్రేషన్ లాయర్ బజూకా వాదనలు వినిపించారని ఆటా తెలంగాణ ప్రతినిధి వెంకట్ మంతెన చెప్పారు. స్టూడెంట్లను ఫెడరల్ కస్టడీలోనే ఉంచాలని అటార్నీ కోరారని, ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుంటే పరిస్థితి క్లిష్టమవుతుందని తెలిపారు. వచ్చే వారం తిరిగి విచారణ ఉండే అవకాశముందన్నారు.

బుధవారం | హైదరాబాద్
06.02.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu

దీదీ ధర్నా విరమణ



సుప్రీంతీర్పుతో నైతిక విజయం దక్కిందన్న బెంగాల్ సీఎం

దీదీ ఆవేశపూరిత ప్రసంగం.. అవసరమైతే ప్రాణత్యాగానికీ వెనుకాడనని ప్రకటన

'సండే హైడ్రామా'పై బెంగాల్ సీఎస్, డీజీపీ, కోల్‌కతా సీపీలకు ధిక్కార నోటీసులు

న్యూఢిల్లీ, కోల్‌కతా :

మోడీ వర్సెస్ దీదీ యుద్ధంలో ఒక అంకానికి తెర పడింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేపట్టిన ధర్నా మంగళవారం ముగిసింది. శారద, రోజ్‌వ్యాలీ కేసుల్లో సీబీఐ దర్యాప్తుకు సంబంధించి సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన దరిమిలా దీదీ తన ధర్నా విరమించారు. కోల్‌కతా సిటీలోని మెట్రో చానెల్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నుంచి ఆమె 'సత్యాగ్రహం' పేరిట ధర్నాకు దిగిన సంగతి తెలిసిందే. సుప్రీం తీర్పును రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి దక్కిన విజయంగా భావిస్తున్నట్లు మమత చెప్పారు. మోడీకి దేశాన్ని పరిపాలించే హక్కు లేదని, ఆయన తిరిగి గుజరాత్ వెళ్లిపోవాలని అన్నారు.

పోరాటాలు తనకు కొత్త కాదని, ఇకముందు కూడా ఇదే పంథాను అనుసరిస్తానని మమత తెలిపారు. బెంగాల్ సీఎం ధర్నాకు దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ మద్దతు పలికాయి.

బీజేపీ, టీఎంసీ పోటాపోటీ నైతికత

కోర్టు తీర్పు అనంతరం ఆశ్చర్యకరంగా ఇరు శిబిరాల్లోనూ ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. నైతిక విజయం తమదంటే తమదంటూ తృణమూల్, బీజేపీ ప్రకటలు చేశాయి. టీఎంసీ చీఫ్ , బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సత్యాగ్రహ ధర్నా మూడో రోజు సాయంత్రానికి ముగిసింది. తొలుత ఫిబ్రవరి 8 వరకూ ధర్నా చేస్తానన్న దీదీ.. కోర్టు తీర్పు అనంతరం నిర్ణయాన్ని మార్చుకున్నారు. తీర్పు తర్వాత పార్టీ కార్యకర్తలు, మీడియాను ఉద్దేశించి మాట్లాడిన మమత.. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు మాత్రమే బిగ్‌బాస్‌లని, ఇవాల్టి కోర్టు తీర్పు ప్రజలందరి విజయమని అన్నారు. బీజేపీ నేతల నోటివెంట ఇవే మాటలు వినిపించాయి. రాజీవ్ కుమార్‌ను కాపాడేందుకు మమత చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని, ఇది కోర్టులో కేంద్రానికి దక్కిన విజయమని పలువురు మంత్రులు వ్యాఖ్యానించారు.

మోడీ.. గో బ్యాక్ టు గుజరాత్: మమత

మోడీకి వ్యతిరేకంగా తాను చేస్తోన్న పోరాటం వ్యక్తిగతం కాదని, దేశం కోసం అవసరమైతే ప్రాణత్యాగానికీ వెనుకాడబోనని మమత అన్నారు. ప్రఖ్యాత దేశభక్తి గీతం 'యే మేరే వతన్‌కే లోగో..'ను గుర్తుచేసుకుంటూ ఆవేశపూరితంగా ప్రసంగించిన మమత అనూహ్య వ్యాఖ్యలూ చేశారు. ఏకవ్యక్తి పరిపాలన ఈ దేశం నడవదని, మోడీ తిరిగి గుజరాత్ వెళ్లిపోతే మంచిదని సూచించారు. 'ఎంక్వైరీ పేరుతో పిలవడం, అరెస్టులు చేయడం అలవాటుగా మారింది. సీబీఐకి ప్రత్యేకంగా కోర్టులున్నాయి. అక్కడ ప్రజలకు న్యాయం దక్కుతుందన్న నమ్మకమేది? ఇది నా పర్సనల్ ఒపీనియన్ కాదు, జన మందరి తర పునా అడుగుతున్నా. రాజీవ్ కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేసేందుకు ప్రయత్నించింది. కాబట్టే మేం కేంద్రాన్ని ధిక్కరించాం. రోజ్ వ్యాలీలో తానూ ఒక రోజా పువ్వునేనని బీజేపీ ఎంపీ బాబుల్ సుప్రియో స్వయం గా ఒప్పు కున్నారు. మరి కేంద్రం ఆయన జోలికి వెళ్లదేం? ఇన్వెస్టిగేషన్ నిష్పక్షపాతంగా సాగితే అభ్యం తరమూ లేదు. రాజకీయ కుట్రలు చేస్తే గట్టిగా బుద్ధిచెబుతాం' అని మమత అన్నారు.

సీబీఐ విచారణకు రావాల్సిందే

కోల్‌కతా కొత్వాల్‌కు సుప్రీం ఆదేశం.. అరెస్టు వద్దని సీబీఐకి సూచన



న్యూఢిల్లీ: రాజకీయంగా దుమారం రేపిన 'సెంటర్ వర్సెర్ వెస్ట్ బెంగాల్' కేసులో సుప్రీంకోర్టు సమయోచిత ఆదేశాలిచ్చింది. శారద చిట్‌ఫండ్, రోజ్ వ్యాలీ కుంభకోణం కేసుల్లో ఆధారాలు మాయం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సిట్ అధికారి, ప్రస్తుత కోల్ కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్.. సీబీఐ ముందు హాజరుకావాల్సిందేన ని తేల్చిచెప్పింది. అదే సమయంలో, ఆయనను అరెస్టు చేయడంగానీ, మరో విధంగా బలవంత పెట్టడంగానీ చేయకూడదంటూ సీబీఐని ఆదేశించింది. కాంట్రవర్సీకి తావులేకుండా రాజీవ్‌ను షిల్లాంగ్ (మేఘాలయ)లోని సీబీఐ కార్యాలయంలో ప్రశ్నించాలని సూచించింది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన బెంచ్ ఈ మేరకు మంగవారం ఉత్తర్వులిచ్చింది. ఇక ఆదివారం కోల్‌కతాలో సీబీఐ ఆఫీసర్లను స్టేట్ పోలీసులు అరెస్టు చేయడం, కేంద్ర దర్యాప్తు సంస్థ ఆఫీసును చుట్టుముట్టడం లాంటి ఘటనలకు సంబంధించి వెస్ట్‌బెంగాల్ చీఫ్ సెక్రటరీ, డీజీపీ, కోల్‌కతా సీపీలకు ధిక్కార నోటీసులు జారీ అయ్యాయి. రాజీవ్ కుమార్ విచారణ కోసం సీబీఐ.. డీఎస్పీ తథాగత బర్ధన్ నేతృత్వంలో స్పెషల్ టీంను ఏర్పాటు చేసింది.

అరెస్టు చేసే ఉద్దేశం సీబీఐకి లేదు

సీబీఐ తరఫున అటార్నీ జనరల్ కేకే వేణు గోపాల్ వాదనలు వినిపించారు. అనుమా నాల నివృత్తి కోసమే రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించాలనుకున్నాం తప్ప, అరెస్టుచేసే ఉద్దేశం సీబీఐకి లేదన్నారు. అయితే, రాజీవ్‌ఇం టికి వెళ్లేలోపే సీబీఐ బృందాన్ని బెంగాల్ పోలీసులు అడ్డుకుని దాడి చేశారని చెప్పారు. సుదీర్ఘంగా సాగుతోన్న దర్యాప్తులో రాజీవ్ కుమార్‌ను సీబీఐ ఇప్పటికిప్పుడే ప్రశ్నించానుకోవడం విడ్డూరంగా ఉందని, ఎన్నికలు సమీపిస్తున్నందున పొలిటికల్ మైలేజీ కోసమే కేంద్రం ఇలాంటి ట్రిక్స్ ప్లే చేస్తోందని వెస్ట్‌బెంగాల్ తరఫు న్యాయవాది అభి షేక్ సింఘ్వీ అన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. చివరికి రాజీవ్ కుమార్‌ను సీబీఐ ముందు హాజరుకావాల్సిందేనని స్పష్టం చేసింది.

"తృణమూల్ కాంగ్రెస్, బీజేపీలు రెండూ అవినీతిలో కూరుకున్నాయి. కోర్టు ఆదేశాలమేరకు సీబీఐ ఒక రాష్ట్రంలో కేసు విచారణ జరిపినంతమాత్రాన అది ఆ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలపై దాడిచేసినట్టుకాదు. చాలామంది ఎంపీలు స్కామ్‌లో అరెస్టయ్యారు. బీజేపీ ఎందుకు విచారణకు ఐదేళ్లపాటు ఆగాల్సివచ్చింది?"

- సీపీఎం సీనియర్ నేత సీతారాం ఏచూరి

శారదా స్కాంలో.. బీజేపీ నేతకు 3 కోట్లు

నిందితుడి లేఖను బయటపెట్టిన మమత

కోల్‌కతా: శారదా చిట్‌ఫండ్‌స్కాంలో బీజేపీ నేత, అస్సాం మంత్రి హిమాంత బిస్వ శర్మకూ హస్తం ఉందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. హిమాంత శర్మ తమ వద్ద రూ.3 కోట్లు తీసుకున్నాడంటూ చిట్‌ఫండ్ ఓనర్ సుదీప్త సేన్‌రాసిన లేఖను సీఎం మంగళవారం బయటపెట్టారు. ఏప్రిల్ 6, 2013 తేదీతో ఉన్న ఆ లేఖలో.. ''మరో బడానేత నన్ను మోసం చేశారు. ఆయనే హేమంత బిస్వ శర్మ. గడిచిన ఆర్నెల్లుగా ఆయన నా వద్ద దాదాపు 3 కోట్లు తీసుకున్నారు. నగదు, వోచర్ల రూపంలో ఈ సొమ్ము తీసుకున్నారు. ఈ సొమ్ము తిరిగి వ్వాల్సి ఉంది.' అంటూ సుదీప్త సేన్‌పేర్కొన్నారు. ఈ లేఖను బయటపెట్టిన మమతా బెనర్జీ బీజేపీపై మండిపడ్డారు. ప్రధాని మోడీ ఒక్కొక్క నేతను ఎంపిక చేసి సీబీఐతో దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. బీజేపీలో చేరిన నేతలంతా సేఫ్.. ఇతర పార్టీల్లో ఉన్న నేతలపై మాత్రం వేధింపులు తప్పడంలేదని ఆరోపించారు.

కోల్‌కతా ఘటన వెనుక మోడీ రాజకీయం: సామ్నా

ముంబై: పశ్చిమ బెంగాల్ సీబీఐ మధ్య నడుస్తున్న వార్ వెనక మోడీ సర్కార్ రాజకీయ ప్రయోజనాలున్నాయని శివసేన అభిప్రాయపడింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధికోసమే సర్కార్ ఈ అంశాన్ని ఉపయోగించుకుంటోందని పార్టీ అధికారిక పత్రిక సామ్నా తన తాజా సంపాదకీయంలో అభిప్రాయపడింది. కోల్‌కతా సిటీ పోలీస్ కమిషనర్‌పై కేంద్రం రెండు నెలల కిందటే చర్యలు తీసుకోవాల్సిందని చెప్పింది.

రాజీవ్ కుమార్‌పై చర్యలు

న్యూఢిల్లీ: కోల్‌కతా కొత్వాల్ రాజీవ్ కుమార్‌పై క్రమశిక్షణ చర్యలకు కేంద్రం ఉపక్రమించింది. సర్వీస్ నిబంధనలు ఉల్లంఘించారంటూ సిటీ పోలీస్ కమిషనర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కేంద్రం మంగళవారం ఆదేశించింది. ఈమేరకు బెంగాల్ సీఎస్‌కు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీచేసింది. సీఎంతో పాటు రాజీవ్ కుమార్ ధర్నాలో పాల్గొనడం సర్వీసు రూల్స్‌ను అతిక్రమించడమేనని హోంశాఖ స్పష్టంచేసింది.



జాతీయ రాజకీయాల్లో మమత కీలకం: ఏపీ సీఎం

కోల్‌కతా : ఫెడరల్ ఫ్రంట్ నిర్మాత మమతా బెనర్జీయేనని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. ప్రతిపక్షాలకు ఆమె మూలస్తంభమని కొనియాడారు. సేవ్ ఇండియా పేరుతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి చేపట్టిన మూడురోజుల ధర్నాలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. రాష్ట్రంలోని 42 ఎంపీ సీట్లను గెలుచుకుని జాతీయస్థాయిలో కీలకపాత్ర ఆమె పోషించగలరన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తంచేశారు. జనవరి 19న సిటీలో జరిగిన ప్రతిపక్షాల ర్యాలీలో పాల్గొన్న 23 పార్టీల ప్రతినిధిగా తాను ఇక్కడకు వచ్చానని చంద్రబాబునాయుడు చెప్పారు. సుప్రీంకోర్ట్ తీర్పును కూడా ఆయన స్వాగతించారు.



అన్న గది పక్కనే చెల్లి ఆఫీస్

- కాంగ్రెస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రియాంకకు గది కేటాయింపు
- ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో నేమ్‌ప్లేట్

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ప్రియాంక గాంధీకి కాంగ్రెస్‌పార్టీ హెడ్‌క్వార్టర్స్‌లో ఒక ప్రత్యేక ఆఫీస్‌గదిని కేటాయించారు. కాంగ్రెస్‌చీఫ్‌రాహుల్‌గాంధీ గది పక్కనే ఆమెకు కేటాయించారు. గతంలో రాహుల్ గాంధీ ఉపయోగించిన గదినే ప్రియాంకకు ఇచ్చారని కాంగ్రెస్‌వర్గాలు చెప్పాయి. ఈ మేరకు ఆమె గది ముందు 'ప్రియాంక గాంధీ వాద్రా, జనరల్ సెక్రటరీ' అని ఇంగ్లీష్, హిందీల్లో రాసిన నేమ్‌ప్లేట్లను తగిలించారు. అంతే కాకుండా ఆమె కోసం లక్నోలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయాన్ని కూడా ఆధునికీకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు కేవలం ఎన్నికల ప్రచారంలో మాత్రమే పాల్గొన్న ప్రియాంక ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. లోక్ సభ ఎన్నికల సమీపిస్తున్న వేళ కాంగ్రెస్‌పార్టీ అనూహ్యంగ ఆమెను యూపీలో రంగంలోకి దించింది. ఈ మేరకు ఆమెను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించి, ఉత్తర్‌ప్రదేశ్‌తూర్పు బాధ్యతలు కూడా అప్పగించింది . అ యితే కుంభమేళలో పాల్గొన్న అ నంతరం ప్రియాంక బాధ్యతుల స్వీకరిస్తారని పలువరు కాంగ్రెస్‌నేతలు చెప్తున్నారు.

యోగికి మళ్లీ షాక్

- రెండోసారీ హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతి నో

కోల్‌కతా: అనూహ్య పరిణామాల మధ్య ఆదివారం రద్దైన బీజేపీ బహిరంగ సభ.. మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. పురులియా జిల్లా కేంద్రంలో జరిగిన ఈ మీటింగ్‌కు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పురు లియా మీటింగ్‌లో 'వెస్ట్‌బెంగాల్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. కోర్టు తీర్పు తర్వాత మమత యూటర్న్ తీసుకున్నారు. సీఎం అయిఉండి ధర్నాకు దిగడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు కాదా? బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం వచ్చిన మరుక్షణం టీఎంసీ గుండాలను ఎరిపారేస్తాం' అని యోగి అన్నారు. మంగళవారం కూడా యోగి హెలికాప్టర్‌ను అనుమతించకపోవడంతో ఆయన రోడ్డు మార్గం ద్వారా జార్ఖండ్ గుండా బెంగాల్‌లోకి ప్రవేశించారు. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతి నిరాకరించామన్నది మీడియా ప్రచారంగా మమత కొట్టిపారేశారు.

'అన్నా' దీక్ష విరమణ

హజారే డిమాండ్లు అంగీకరించిన మహారాష్ట్ర సర్కారు

రాలేగావ్‌సిద్ధి: లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థల ఏర్పాటుకు మహారాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే ఆమరణ దీక్ష విరమించారు. సొంత గ్రామం రాలేగావ్‌సిద్ధిలో ఆయ న ఏడు రోజులుగా దీక్ష చేస్తోన్న సంగతి తెలిసిందే. మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్, మంత్రులు మంగళవారం హజారేతో జరిపిన చర్చలు ఫలప్రదంగా ముగిశాయి. సాధ్యమైనంత వేగంగా లోక్‌పాల్‌ను ఏర్పాటుచేస్తామని, ఫిబ్రవరి 13న లోక్‌పాల్ సెర్చ్ కమిటీ మీటింగ్ నిర్వహిస్తామని, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను అనుసరించి గ్రాఫ్ట్ కమిటీని కూడా ఏర్పాటు చేస్తామని సీఎం ఫడ్నవిస్‌తెలిపారు. పాలనలో పాదర్శకత ఉండాలంటే లోక్‌పాల్, లోకాయుక్తలు ఉండితీరాల్సిందేనని అన్నా హజారే ఉద్ఘాటించారు. అన్నాను కలిసిన సీఎం బృందంలో కేంద్ర మంత్రులు రాధామోహన్‌సింగ్, శుభాష్ భమ్రే, రాష్ట్ర మంత్రులు గిరీశ్ మహాజన్‌తదితరులున్నారు. 81 ఏండ్ల వయసున్న అన్నా ఈ సారి ఏడు రోజుల పాటు దీక్ష చేశారు. నాలుగున్నర కేజీల బరువు తగ్గారు. దీక్షకు మద్దతుగా రాలేగావ్‌సిద్ధి ప్రజలు ఇటీవల బంద్ నిర్వహించారు. ప్రభుత్వ అధికారులను గ్రామంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకున్నారు. కాగా, ఎన్నికలకు ముందు లోక్‌పాల్, లోకాయుక్తల ఏర్పాటు డిమాండ్‌కు ఆ పార్టీ సీనియర్ నేతలు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ మద్దతు పలికారని హజారే చెప్పారు. గతంలో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో తాను జరిపిన దీక్షకు దేశమంతా స్పందించిందని, దాని ఫలితంగానే బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆయన చెప్పారు.




రాలేగావ్‌సిద్ధిలో అన్నాహజారేతో దీక్ష విరమింపచేస్తున్న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్

గవర్నర్‌పై పేపర్ బాల్స్

యూపీ అసెంబ్లీలో గందరగోళం

లక్నో: ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజునే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గవర్నర్ రామ్ నాయక్ సభను ఉద్దేశించి ప్రసంగిస్తున్నప్పుడు ఎస్పీ, బీఎస్పీ ఎమ్మెల్యేలు ఆయనపై పేపర్ బాల్స్ విసిరారు. అసెంబ్లీలో నిరసన చేస్తుండగానే బ్రెయిన్ హేమరేజ్‌తో బాధపడుతున్న ఎస్పీ ఎమ్మెల్యే సుభాష్ పాసి కిందపడిపోయారు. వెంటనే ఆయనను కింగ్ జార్జ్ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యేను అబ్జర్వేషన్లో ఉంచినట్టు డాక్టర్లు చెప్పారు. సభలో ప్రతిపక్షాల తీరును ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగి తీవ్రంగా ఖండించారు. ఎస్పీబీఎస్పీ ఎమ్మెల్యేలు సభలో గూండాల్లో ప్రవర్తించారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని చెరకు రైతులకు మిల్లు యజమానులు బాకీలు చెల్లించాల్సిన ఆలస్యం చేస్తున్నారంటూ ఎస్పీబీఎస్పీ ఎమ్మెల్యేలు నిరసనలు తెలిపారు. విపక్షాలను టార్గెట్ చేస్తూ సీబీఐ, ఈడీలను వాడుకుంటోందని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విపక్షాలు నినాదాల మధ్యనే గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు.



అంటార్కిటికా కాదు ఆస్ట్రియా

కనుచూపు మేర మంచు తప్ప మరేదీ కనిపించని అంటార్కిటికా ఖండంలా కనిపిస్తున్నా ఇది ఆస్ట్రియాలోని ఓ చిన్న పట్టణం. పేరు జెల్‌ఆమ్‌సీ. ఉష్ణోగ్రతలు పడిపోయి మంచు విపరీతంగా కురవడంతో టౌన్‌లోని సరస్సు గడ్డకట్టుకుపోయింది. ఇళ్లు, వాకిళ్లలో మంచు పేరుకు పోయి అంటార్కిటికాను తలపిస్తోంది.

టెర్రరిస్టు గ్రూపులకు అమెరికా ఆయుధాలు



- సంకీర్ణ బలగాల నుంచి టెర్రరిస్టులకు
- కొనుగోలు ఒప్పందాలు బేఖాతర్
- సౌదీ తీరుపై యూఎస్ ఆగ్రహం

యెమెన్: అమెరికాలో తయారైన అత్యాధునిక ఆయుధాలు టెర్రరిస్టు గ్రూపులకు చేరుతున్నాయని ఓ ప్రముఖ మీడియా సంస్థ ఆరోపించింది. సంకీర్ణ బలగాలకు అమ్మిన వెపన్స్ యెమెన్‌లోని ఉగ్రవాదుల చేతుల్లో పడ్డాయని చెబుతోంది. యెమెన్‌అంగట్లో అమెరికా ఆయుధాల అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నట్లు తమ స్టింగ్‌ఆపరేషన్‌లో బయటపడిందని పేర్కొంది. వీటిలో ఆర్డినరీ రైఫిల్‌నుంచి అత్యాధునిక మిస్సైల్స్‌వరకు ఉన్నాయని వివరించింది.

ఎలా చేరుతున్నాయి?

అమెరికాలో తయారైన అత్యాధునిక ఆయుధాలను సౌదీ అరేబియా, యునైటెడ్‌ఎమిరేట్స్‌కొనుగోలు చేస్తున్నాయి. ఇందుకోసం వేలాది డాలర్లు వెచ్చించి అమెరికాతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆయుధాల అమ్మకం సందర్భంగా వాటిని దుర్వినియోగం చేయకూడదని, తయారీకి సంబంధించిన పేటెంట్ తమదేనని పేర్కొంటూ యూఎస్ పలు షరతులు విధించింది. వెపన్స్‌ను ఇతర సంస్థలకు గానీ, దేశాలకు గానీ అమ్మకూడదనే నిబంధన పెట్టింది. విదేశాలకు అమ్మే ఆయుధాల విషయంలో అగ్రరాజ్యం ఈ షరతులు విధిస్తుంది. వాటిని ఉల్లంఘించడాన్ని అమెరికా తీవ్రంగా పరిగణిస్తుంది. అయితే, ఈ ఒప్పందాన్ని సౌదీ, యూఏఈ పట్టించుకోవట్లేదు. అమెరికా నుంచి అందుకున్న ఆయుధాలను రహస్యంగా టెర్రరిస్టు గ్రూపులకు అందిస్తున్నాయి. యెమెన్‌లో తమ ప్రాబల్యాన్ని పెంచుకునే ఉద్దేశంతో పాటు స్థానిక తెగల మద్ధతు కోసం ఈ ఆయుధాలను ఉపయోగించుకుంటున్నాయి. వాటి చేతుల్లోంచి జారిన ఆయుధాలు అంతిమంగా టెర్రరిస్టు గ్రూపులకు చేరుతున్నాయి. ఇరాన్‌లోని రెబెల్‌గ్రూపులకూ ఈ వెపన్స్‌అందుతున్నాయి. ఇలా అమెరికా తయారుచేసిన ఆయుధాలే అటు తిరిగి, ఇటు తిరిగి టెర్రరిస్టుల భుజాల మీదికి చేరి అగ్రరాజ్యం సైనికుల ప్రాణాలను బలితీసుకుంటున్నాయి.

విచారణ జరుగుతోంది: యూఎస్ఆర్మీ

తమ ఆయుధాలు టెర్రర్‌గ్రూపుల చేతుల్లో పడుతున్నాయనే ఆరోపణలపై ఉన్నత స్థాయి విచారణ జరిపిస్తున్నట్లు అమెరికా ఆర్మీ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో అమెరికా, సౌదీ మధ్య బంధంపై కొత్త ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి. ఇప్పటికే జర్నలిస్ట్ జమాల్ ఖషోగి హత్యపై సౌదీ ప్రభుత్వంపై అగ్రరాజ్యం గుర్రుగా ఉంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఎడారి దేశానికి ఆయుధాల ఎగుమతులపై అమెరికా పునరాలోచన చేయనుందనే ప్రచారం సాగుతోంది.

పంటకాలనీలకు సర్వే

రైతు వారీగా సమగ్ర సమాచార సేకరణ • స్థానిక అవసరాలకు తగ్గట్టుగా పంట



సమగ్రంగా సర్వే

రైతులకు సమగ్ర వివరాలను ప్రత్యేక ఫార్మేట్‌లో సేకరిస్తాం. సేద్యానికి సంబంధించి సమగ్ర వివరాలు తెలుస్తాయి. పంట కాలనీల ఏర్పాటుకు ఈ సమాచారం ఉపయోగపడుతుంది.

నాగేంద్రయ్య, కామారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి


కామారెడ్డి, వెలుగు: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, స్థానిక అవసరాలకు తగ్గట్టు పంట ఉత్పత్తులను పెంచేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా పంట కాలనీలను ఏర్పాటు చేసేందుకు రైతు వారీ సర్వేకు వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. రైతుల పంట సాగు , వారు వినియోగిస్తున్న పరికరాలు, సాగు నీటి వసతి, విత్తనాలు తదితర అంశాలను సేకరించేందుకు ప్రత్యేక ఫార్మట్‌ను తయారు చేశారు. ఈ సర్వేను రాష్ట్రమంతటా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రాష్ట్ర ప్రజల అవసరాలకు సరిపడా పంటలు పండించకపోవడంవల్ల ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

ధరలు తగ్గించాలనే..

వివిధ రకాల పంచలను దూర ప్రాంతాల నుంచి తేవడం వల్ల రవాణా ఖర్చులు, దళారుల దోపిడి పెరిగి వినియోగదారుల మీద భారం పడుతోంది. సీజన్లలో కూరగాయలు, పూలు, పండ్ల ధరలు మండిపోతున్నాయి. ఈ సమస్యల్ని అధిగమించేందుకు గాను ఆయా జిల్లాల్లో ప్రజల అవసరాలు స్థానికంగానే తీరేలా పంట ఉత్పతులను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పంట కాలనీల విషయాన్ని సీఎం కేసీఆర్ తన ఎన్నికల ప్రచారంలోనే ప్రముఖంగా చెప్తూ వచ్చారు. రాజధానికి సమీపంలో పంట కాలనీలు ఏర్పాటు చేయాలని మొదట భావించినా.. అన్ని జిల్లాల్లో పంట కాలనీలను ఏర్పాటు చేయాలని ఇప్పుడు ప్రభుత్వం అలోచిస్తోంది. ఇందుకోసం ఎక్కడ ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో పండిస్తున్నారు, కూరగాయల సాగెంత, పండ్ల తోటలు, పూల తోటలెక్కడెక్కడ సాగవుతున్నాయి, పాడి తో పాటు రైతుకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని వ్యవసాయ శాఖ సేకరిస్తుంది.

39 అంశాలతో సర్వే

రైతు సమగ్ర సర్వేకు 39 అంశాలతో ప్రత్యేక కాలమ్స్ రూపొందించారు. రైతు కుటుంబ పరిస్థితి, ఆర్థిక, సామాజిక స్థితిగతులు, రైతుకున్న భూ విస్తీర్ణం, వానకాలం, యాసంగిలో సాగు చేస్తున్న పంటల వివరాలు, వాటి విస్తీర్ణం, నేల స్వభావం, విత్తనాలు, సేంద్రియ ఎరువుల వాడకం, భూ సార పరీక్షలు, దిగుబడులు, అమ్మకాలు, స్థానికంగా మార్కెటింగ్ వసతి, సంతలు, ఉద్యానవన పంటలు, పశుసంపద, వ్యవసాయ పరికరాల వినియోగం, పంటరుణాలు, బ్యాంకు ఖాతాలు, పట్టాదారు పాసు పుస్తకం నంబర్, ఆధార్‌నంబర్ వంటి సమాచారాన్ని రైతుల నుంచి సేకరిస్తారు. రైతులు ఎప్పుడు ఒకే తరహా పంటల్ని పండిస్తుంటారు. వరి ఎక్కువ సాగు చేస్తారు. కొన్ని జిల్లాల్లో కొన్ని పంటలు అస్సలే కనిపించవు. కూరగాయలు, పండ్ల తోటలు, పూలు తక్కువ విస్తీర్ణంలో సాగవుతున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం తక్కువగా ఉంది. ఉల్లి మహారాష్ట్ర నుంచి, టమాట, ఇతర కూరగాయలు కర్నూల్ నుంచి వస్తున్నాయి. పూలు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి దిగుమతి అవుతున్నాయి. ఈ పరిస్థితి లేకుండా జిల్లా ప్రజలకు అవసరమైన కూరగాయలన్నీ ఇక్కడే పండించేలా కాలనీలను ఏర్పాటు చేస్తారు. జిల్లాల్లో నేలల స్వభావానికి అనుగుణంగా పంటలను ఎంపిక చేస్తారు. ఒకే తరహా పంటలు ఒకే ప్రాంతంలో ఎక్కువగా సాగు కాకుండా చూస్తారు. జిల్లాల్లో వ్యవసాయ అనుబంధ ఇండస్ట్రీస్ ఏర్పాటు, మహిళ సమాఖ్యల ద్వారా ఆహార ఉత్పతులను తయారీ లాంటి కార్యక్రమాలు కూడా చేపడతారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు రైతు వారీ సర్వే చేపడుతారు. ఏవోలు, ఏఈవోలు ఇందులో పాల్గొంటారు. ఒక్కో అధికారికి కొన్ని గ్రామాలు కేటాయించి సమాచారాన్ని సేకరిస్తారు. మార్చి నెలాఖరులోగా సర్వే పూర్తి చేస్తారు.



తడారిన భూములకు జీవం

- ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం పనుల్లో కదలిక
- ఖరీఫ్‌కు నీరందించేలా ప్రణాళిక

నిజామాబాద్, బాల్కొండ, వెలుగు: ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ (ఎస్సారెస్పీ) పునరుజ్జీవానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎగువ ప్రాంతంలో మహారాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా ప్రాజెక్టులు నిర్మించడంతో ఎస్సారెస్పీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ప్రాజెక్టులోకి నీరు చేరక ఆయకట్టులో సేద్యం ప్రమాదంలో పడింది. తెలంగాణను కోటి ఎకరాల మాగాణం చేయాలన్న సంకల్పంతో టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకాన్ని చేపట్టింది. ఎల్లంపల్లి నుంచి ఎస్సారెస్పీలోకి ఎత్తిపోతల ద్వారా నీటిని నింపే ఈ పథకాన్ని రూ.1,080కోట్లతో చేపట్టింది. వరద కాలువను రిజర్వాయర్‌గా మార్చి మూడు సార్లు నీటిని ఎత్తిపోసేలా పథకాన్ని రూపొందించారు. ఏడాదిన్నర కింద పనులు ప్రారంభించినా ఇంకా ఓ కొలిక్కి రాలేదు. ఇటీవల ఇరిగేషన్ పనులను సమీక్షించిన కేసీఆర్ పునరుజ్జీవ పథకం తీరు మీద అసంతృప్తి వ్యక్తం చేయడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. వచ్చే ఖరీఫ్ నాటికి సాగునీరందించేలా పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు.

మూడు పంపు హౌజులు

నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్‌లో 2017 ఆగస్టు 10న ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. మహారాష్ట్ర ప్రాజెక్టుల కారణంగా బీడుగా మారుతున్న ఆయకట్టును కాపాడేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. ఎస్సారెస్పీ వరద కాలువను రిజర్వాయర్‌గా మార్చి మూడు సార్లు నీటిని ఎత్తిపోస్తారు. ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు, పోతారం చెరువు తదితర ప్రాంతాలకు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తున్నారు. అక్కడ నుంచి వేసిన పైప్‌లైన్ 102 కిలోమీటర్ల దగ్గర వరద కాలువను దాటుతుంది. ఇక్కడ పైపులైను నుంచి నీటిని వరదకాలువలోకి వదులుతారు. ఈ ప్రాంతంలో వరదకాలువలో క్రాస్ రెగ్యులేటర్ గేట్లను బిగిస్తారు. గేట్లను దింపినపుడు కాలువలో నీరు నిండుగా నిలువ ఉంటుంది. గేట్లను పైకి తీస్తే మధ్యమానేరులోకి నీరు పారుతుంది. ఇక్కడ నుంచి నీటిని మల్యాల మండలం రాంపూర్ వద్ద నిర్మించిన పంప్‌హౌజ్‌లోకి తరలిస్తారు. ఇక్కడ కూడా గేట్లతో క్రాస్ రెగ్యులేటర్‌ను నిర్మిస్తారు. ఇబ్రహీంపట్నం మండల రాజేశ్వర్ రావు పేట దగ్గర మరోసారి నీటిని ఎత్తి పోస్తారు. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ దగ్గరున్న జీరోపాయింట్ దగ్గర మరో పంపుహౌజ్ నిర్మించి, ఇక్కడినుంచి ప్రాజెక్టులో నీటిని నింపుతారు.

పూర్తికావచ్చిన మట్టిపనులు

జగిత్యాల జిల్లా రాంపూర్ దగ్గర మొదటి పంప్ హౌజ్ ,ఇదే జిల్లాలోని ఇబ్రహీం పట్నం మండలం రాజేశ్వరరావుపేట్ లోని రెండో పంప్ హౌజ్ , ఎస్సారెస్పీ జీరోపాయింట్ వద్ద మూడో పంపుహౌజ్‌లను నిర్మిస్తున్నారు.ఈ మూడు పంపుహౌజ్‌ల వద్ద 30.98 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు, 5.10 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాలి. వీటితో పాటు మ్యాన్ పవర్,పనులకు కావాల్సిన మిషనరీ అందుబాటులో ఉంచుకోవాలి. మూడు పంపుల దగ్గర 30 లక్షల క్యూబిక్ మీటర్ల మేరమట్టి పనులు పూర్తి చేసారు. 3.53 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. ఇంకా 1.57 లక్షల క్యూడిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాల్సిఉంది. వచ్చే వర్షకాలం నాటికి ఈ పనులు పూర్తి చేయాలని ఆధికారులు ప్లాన్ చేస్తున్నారు. ఒక్కో పంప్ హౌజు దగ్గర ఎనిమిది చొప్పున మూడు పంప్ హౌజ్‌ల్లో 24 మోటర్లను ఫిబ్రవరిలో బిగించనున్నారు. మోటార్లను ఇప్పటికే చైనా నుంచి తెప్పించారు.

మోటార్లు బిగిస్తాం

వచ్చే ఖరీఫ్ నాటికి ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా సాగునీరు, తాగేనీరు అందిస్తాం. సిఎం తో సమీక్ష తర్వాత పనులు వేగవంతమయ్యాయి. మట్టి పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. కాంక్రీట్ పనులు చురుగ్గా చేస్తున్నాం. ఫిబ్రవరిలో మోటర్లను బిగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పనులను ఉన్నత స్థాయి ఆధికారులు పర్యవేక్షిస్తున్నారు.

- ఆల రాంప్రసాద్ వరదకాలువ డీఈ

సమాజం కల్తీమయమైంది

- యూపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు



భద్రాద్రికొత్తగూడెం, వెలుగు : ప్రస్తుత సమాజం మొత్తం కల్తీమయంగా మారిందని ఉత్తరప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కొత్తగూడెంలో కలెక్టర్ రజత్‌కుమార్ షైనీతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆహార పదార్థాలు, వ్యాపారం అంతా కల్తీమయం అవుతుందని, చివరకు మనుషుల మనసులు కూడా నకిలీ అయ్యే పరిస్థితి రావడం విచారకరమని అన్నారు. ప్రస్తుతం ప్రజాస్వామ్య విలువలను కాపాడే వ్యక్తులు సమాజానికి అవసరమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు గతంలో ఎంతో మంది మహనీయులు కృషి చేశారన్నారు. ప్రజాస్వామ్య కర్తవ్యాలను చిత్తశుద్ధితో నిర్వర్తించే వ్యక్తులు తయారుకావాలన్నారు. ఓటు పవిత్రతను కాపాడాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశం కోసం పోరాడిన మహనీయులను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో రోజు రోజుకు విలువలు తగ్గిపోతుండడం విచారకరమన్నారు. డబ్బు, మద్యానికి అమ్ముడు పోయే పరిస్థితి పోవాలన్నారు. మంచితనం, సేవాభావం కలిగిన వ్యక్తులను ఎన్నికల్లో గెలిపించుకుంటే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎంతో విలువైన ఓటును ప్రలోభాలకు లొంగిపోయి అమ్ముకోకూడదన్నారు.



సాలహారాలకు మెరుగులు దిద్దుతున్న స్థపతి ఆనంద వేలు

సాలహారాలకు తుది మెరుగులు

యాదగిరికొండ, వెలుగు: యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ విస్తరణలో భాగంగా గోపురాలపై నిర్మించే సాలహారాలకు స్థపతి ఆనందచారి వేలు మంగళవారం తుది మెరుగులు దిద్దారు. వీటిని త్వరలోనే భారీ యంత్రాలతో గోపురాలపై భాగంలో అమర్చనున్నట్లు తెలిపారు

యాదాద్రి పనుల్లో స్వల్ప మార్పులు



దక్షిణ భాగంలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు

యాదగిరికొండ, వెలుగు: యాదాద్రి ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా వ్రత మండపం, రథశాల, విష్ణు పుష్కరిణి నిర్మాణంలో మార్పులు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయ ఈశాన్య భాగంలో నిర్మించిన వ్రత మండపం, రథశాల, విష్ణుపుష్కరిణిని మరింత పెంచడంతో పాటు, దక్షిణ భాగంలో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ కాలమ్స్ తగ్గించాలని ఇటీవల పర్యటించిన సీఎం సూచించడంతో ఆ మేరకు మార్పులు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. కొండపైకి వచ్చిన భక్తులు ఎటు వైపు నుంచి చూసిన ప్రధాన ఆలయ గోపురాలు కనబడేలా ఉండాలని సూచించారు. ఆధ్యాత్మికత



ఉట్టిపడేలా, వైభవోపేతంగా నిర్మాణాలు జరగాలని అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులు పూర్తయ్యేంత వరకు ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సీఎం సూచించడంతో అధికారులు అందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.





భజనలు చేస్తున్న కళాకారులు

అల్లముని కొండపై ఆత్మ లింగం

ఆహ్లాదకరంగా అల్లమా ప్రభు జాతర

బాన్సువాడ, వెలుగు: కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో మంగళవారం అల్లమా ప్రభు జాతర కొనసాగింది. చుట్టూ వాతావరణం జనంతో ఎంతో ఆహ్లాదకరంగా మారింది. సోమవారం అర్ధరాత్రి కొండపై నిర్వహించిన అగ్నిగుండం చూసేందుకు తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, బీదర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు దీపారాధన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బొమ్మన్‌దేవ్‌పల్లి నుంచి కొండపైకి జెండాను ఊరేగింపుగా తీసుకొచ్చారు. మంగిటి నుంచి వచ్చిన శివ మహారాజ్ అగ్ని గుండాన్ని ప్రారంభించారు. మహారాజ్ అగ్ని గుండం తొక్కి వెళ్లిన తర్వాత భక్తులు ఆ గుండాన్ని తొక్కేందుకు పోటీ పడ్డారు. అనంతరం అగ్ని గుండంలోని బూడిదను పూజించి, భక్తులు దానిని తీసుకొని నుదుటిపై పెట్టుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. జాతరలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కొండపై ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇన్‌ఛార్జి ఎస్సై కోనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును నిర్వహించారు.



అల్లమా ప్రభు కొండపై భక్తుల రద్దీ



దీపారాధన చేస్తున్న మహిళలు



హెర్బల్ బ్యూటీసోప్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థిని గండు సుస్మిత

జాతీయ స్థాయికి వెలిదండ స్టూడెంట్

హుజూర్‌నగర్, వెలుగు: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండకు చెందిన విద్యార్థిని రూపొందించిన హెర్బల్ బ్యూటీ సోప్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. యుక్తవయస్సులో కనిపించే మొటిమలు, చర్మ సంబంధ ఫంగల్ వ్యాధులను నియంత్రించేందుకు వెలిదండకు చెందిన గండు సుస్మిత అనే విద్యార్థిని సైన్స్ ఉపాధ్యాయులు కళావతి, బుచ్చారావుల ఆధ్వర్యంలో హెర్బల్ బ్యూటీ సోప్‌ను తయారు చేసి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో ప్రదర్శించింది. తుది పరీక్షలో ఎంపికైన ఈ ప్రదర్శనను ఫిబ్రవరి 14,15 తేదీల్లో ఢిల్లీ ఐఐటీలో ప్రదర్శించనున్నట్లు హెచ్ఎం పీవీ.రావు తెలిపారు. దీంతో సర్పంచ్ ఆదూరి పద్మ, ఎంపీటీసీ రామకోటమ్మ, దాతలు మేదరమెట్ల అనసూయ, పోటు రామారావులు హర్షం వ్యక్తం చేశారు.

యూపీ ఫారెస్టు ఆఫీసర్ల పర్యటన



కరీంనగర్ హైస్కూల్‌ను సందర్శించిన ఉత్తరప్రదేశ్ అధికారులు

మల్కాపూర్ గ్రామస్తులకు ప్రశంస

మెదక్, వెలుగు: తూప్రాన్ మండలంలోని మల్కాపూర్ , చేగుంట మండలం కరీంనగర్ గ్రామాల్లో ఉత్తరప్రదేశ్ ఫారెస్ట్ అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. ఉత్తరప్రదేశ్ పీసీసీఎఫ్ ప్రదీప్ రావ్, ఉన్నతాధికారులు జీఎన్ మూర్తి, రంజన్, హేమంత్‌కుమార్, కమలేష్ కుమార్, సంజయ్ శ్రీవాత్సవ, సునీల్ చౌదరి ఈ బృందంలో ఉన్నారు. హరితహారం కింద మల్కాపూర్‌లో నాటిన మొక్కలను పరిశీలించారు. గ్రామంలోని కాలనీల్లో ఎవెన్యూ ప్లాంటేషన్ తరహాలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్న గ్రామస్తులను ప్రశంసించారు. అనంతరం గ్రామంలోని రాక్ గార్డెన్‌ను చూశారు. గ్రామంలోని ఖాళీ ప్రదేశాల్లో, ఇళ్లు, పొలాల వద్ద లక్షకు పైగా మొక్కలు నాటినట్టు తూప్రాన్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు వారికి వివరించారు. నాటిన మొక్కలకు ప్రతి రోజు ట్యాంకర్ల ద్వారా నీరు పోస్తున్నామన్నారు. అనంతరం అధికారుల బృందం చేగుంట మండలం కరీంనగర్ జెడ్పీహెచ్ఎస్ ప్రాంగణంలో హరితహారంకింద నాటిన మొక్కలను చూసి, స్టూడెంట్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ మెదక్ సర్కిల్ పీసీసీఎఫ్ ఏ.కె. సిన్హా, మెదక్, సిద్దిపేట డీఎఫ్ఓలు పద్మజ ఉన్నారు.

ఎక్కన్నుంచి పాలించాలె?



- కొత్త పంచాయతీల్లో భవనాల కొరత
- అద్దె భవనాల్లోనే కొనసాగింపు
- త్వరలో జిల్లాల నుంచి ప్రతిపాదనలు
- వచ్చే బడ్జెట్‌లో మరిన్ని నిధులు
- ఆరు నెలల్లోపే ఆఫీసుల నిర్మాణాలు!

హైదరాబాద్, వెలుగు:

సర్పంచ్ ఎన్నికలు ముగిశాయి. పాలకవర్గాలు కొలువుదీరాయి. పరిపాలనా మొదలైంది. అయితే కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీల్లో ఆఫీసుల్లేక రోజువారీ పనులకు ఇబ్బందులేర్పడుతున్నాయి. గ్రామానికి చాలా చేద్దామని ఉత్సాహంగా ఉన్న సర్పంచ్‌లకు కార్యాలయ భవనమే మొదటి సమస్యగా మారింది. ప్రస్తుతానికి అద్దె భవనంలో టేబుల్, కుర్చీ ఏర్పాటు చేసుకున్న సర్పంచ్‌లు శాశ్వత భవనాల కోసం వేచి చూస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా ఆఫీస్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

త్వరలో ప్రతిపాదనలు

కొత్తగా ఏర్పాటైన పంచాయతీల్లో ఆఫీసుల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ జిల్లా యంత్రాంగం నుంచి ప్రతిపాదనలు కోరనుంది. ఒక్కో ఆఫీస్‌కు ఎంత భూమి అవసరం, ఎక్కడెక్కడ అందుబాటులో ఉంది, ఎక్కడ సేకరించాలి, ఎన్ని నిధులు అవసరం వంటి అంశాలపై ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని కోరుతోంది. గత ఏడాది ఆగస్టు 1 నుంచి కొత్త పంచాయతీలు మనుగడలోకి వచ్చాయి. ఆయా పంచాయతీల్లో ఆఫీసుల నిర్మాణానికి 201819 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.1,200 కోట్లు కేటాయించింది. ఈ నెలలో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించే అవకాశముంది. ఆఫీసు నిర్మాణానికి సుమారు 1500 గజాల స్థలం అవసరమని అంచనా. నిర్మాణానికి రూ.20 లక్షల వరకు కావొచ్చు. భూమిని ఎన్‌ఆర్‌ఐల నుంచి సాయంగా గానీ, దాతల నుంచి సేకరించాలని భావిస్తున్నారు. భవనంలో మీటింగ్ ఏరియా, సర్పంచ్, గ్రామ కార్యదర్శికి ఒక్కో గది ప్లాన్ చేస్తున్నారు.

ప్రతి నెల గ్రామ సభ

కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి నెలా గ్రామ సభ ఏర్పాటు చేయాలి. విధిగా సర్పంచ్, వార్డు మెంబర్లు సమావేశమై గ్రామాభివృద్ధిపై చర్చించాలి. పంచాయతీ కార్యదర్శి జనానికి అందుబాటులో ఉండాలి. గ్రామానికి పైఅధికారులు, ఎమ్మెల్యే, ఎంపీ.. ఎవరొచ్చినా సమావేశాల నిర్వహణకు ఆఫీస్ అవసరం. దీన్ని తక్షణ అవసరంగా భావించి ప్రభుత్వం ఆఫీస్‌ల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తోంది. లోక్‌సభ ఎన్నికలు అయిన వెంటనే భవనాల నిర్మాణం ప్రారంభించి ఆరు నెలల్లో కంప్లీట్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

నిధులున్నాయి..

పంచాయతీ ఆఫీస్‌ల నిర్మాణానికి ప్రభుత్వం గత బడ్జెట్‌లోనే నిధులు కేటాయించింది. ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. జిల్లాల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. ఆరు నెలల్లో పూర్తి చేయాలనే నిబంధన మేరకు కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తాం. అయితే ఈ అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

- రామారావు, డిప్యూటీ కమిషనర్, పంచాయతీరాజ్ శాఖ

విద్యార్థినులకు ఉచితంగా న్యాప్కిన్లు

- పైలట్ ప్రాజెక్టుగా ఐదు మండలాల ఎంపిక

హైదరాబాద్, వెలుగు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు సీఎస్సార్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)లో భాగంగా ఉచితంగా న్యాప్కిన్లు సరఫరా చేయాలని ఎన్‌ఐఆర్‌డీ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్), బీడీఎల్ (భారత్ డైనమిక్స్ లిమిటెడ్)లు నిర్ణయించాయి. దీనికి సంబంధించి బీడీఎల్ ఎండీ నారాయణన్, ఎన్‌ఐఆర్‌డీ సీఎస్సార్ డైరెక్టర్ మురుగేషన్ మంగళవారం ఎంవోయూ కుదుర్చుకున్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా తొలిదశలో రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్, మొయినాబాద్, గండిపేట, శంషాబాద్, శేరిలింగంపల్లి మండలాలను ఎంపిక చేశారు. అనారోగ్య సమస్యలు రాకుండా, గ్రామీణ పారిశుధ్యానికి తాము ప్రాధాన్యమిస్తున్నామని ఎంవోయూలో పేర్కొన్నారు.

క్విక్ బైట్స్



10,781 సర్కారు స్కూళ్లలో 40 మంది లోపే విద్యార్థులు

- ప్రైమరీ, యూపీఎస్‌లలో తగ్గిన విద్యార్థులు
- హైస్కూళ్లలోనూ అదే పరిస్థితి

హైదరాబాద్,వెలుగు: సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతూ వస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 10,781 స్కూళ్లలో 40 మంది లోపే విద్యార్థులున్నారు. గతేడాదితో పోలిస్తే విద్యార్థుల సంఖ్య క్రమేణా తగ్గుతున్నట్టు తెలుస్తోంది. పాఠశాలల్లో చదువులు మెరుగయ్యేలా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నా విద్యార్థుల సంఖ్య పెరగడం లేదన్నది స్పష్టమవుతోంది. రాష్ట్రంలో 25,206 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 20,574 ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, 4,632 హైస్కూళ్లు ఉన్నాయి. ఈ ఏడాది 10,781 ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూళ్లలో 40 మంది కంటే తక్కువే విద్యార్థులు చేరారు. గతేడాది 40లోపు విద్యార్థులున్న స్కూళ్లు 9,166 ఉన్నాయి. 40కి పైగా విద్యార్థులున్న పాఠశాలలు గతేడాది 10,470 ఉంటే, ఈ ఏడాది 9,743 ఉన్నాయి.

హైస్కూళ్లలోనూ..

హైస్కూళ్లలోనూ విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గుతోంది. గతేడాది వందలోపు విద్యార్థులున్న స్కూళ్లు 974 ఉంటే, ఈసారి 1,196కు చేరాయి. ఏడాదిలోనే 222 హైస్కూల్స్ వందలోపు బడుల జాబితాల్లోకి చేరాయి. సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ప్రభుత్వం కొత్తగా గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయడమే కారణమని అధికారులు చెబుతున్నారు.

గతేడాది నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. వీటికి తోడు కస్తూర్బా గురుకులాలు, మోడల్ స్కూళ్ల పనితీరు మెరుగుపడడంతో విద్యార్థులు అటువైపు వెళ్తున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

‘సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నం’

హైదరాబాద్, వెలుగు: వివిధ హోదాల్లో ఉన్న టీఆర్ఎస్ పార్టీ నేతలు ట్రేడ్ యూనియన్లకు గౌరవాధ్యక్షులుగా ఉండకూడదన్న సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఆర్టీసీ ఎంప్లాయీస్‌యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. హిందూ మజ్దూర్ సభ నాయకత్వ బాధ్యతల నుంచి మాజీ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డిని రాజీనామా చేయించాలని కోరారు. పలు జోన్లకు గౌరవాధ్యకులుగా కొనసాగుతున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు వాళ్ల గౌరవాధ్యక్ష పదవులకు రాజీనామా చేయాలని విజ్ఞప్తి చేశారు. రానున్న యూనియన్ ఎన్నికల్లో పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొనకుండా ఆదేశాలు ఇవ్వాలని, ట్రేడ్ యూనియన్ల అధ్యక్షులను ప్రజాస్వామ్యబద్ధంగా కార్మికులే ఎన్నుకునేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పథకాలు, ప్రాజెక్టులపై నివేదిక ఇవ్వండి

- ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి

హైదరాబాద్, వెలుగు: ప్రభుత్వ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, టీఎస్ ఐపాస్ ప్రాధాన్యం ప్రకారం నివేదికలు సిద్ధం చేయాలని అన్ని శాఖల అధికారులను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. ఎస్‌కే సింగ్ నేతృత్వంలోని 15వ ఆర్థిక సంఘం 18 నుంచి 20 వరకు రాష్ట్రంలో పర్యటించనున్న నేపథ్యంలో శాఖల ముఖ్య కార్యదర్శులు, అధికారులతో మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. 18న స్థానిక సంస్థలు, పారిశ్రామిక, వాణిజ్య, కార్మిక రంగాల ప్రతినిధులతో సంఘం సభ్యులు భేటీ ఉంటుంది. 19న సీఎం ఆధ్వర్యంలో అధికారులతో, 20న ఆర్థికసంఘం నిపుణులతో సమావేశం ఉంటుంది. కాళేశ్వరం, మిషన్ భగీరథలో భాగంగా చేపట్టిన నిర్మాణాలను పరిశీలిస్తారు.

55 విలేజ్ కోర్టులు ఏర్పాటు చేస్తాం

- హైకోర్టుకు జీవో కాపీ

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో 55 విలేజ్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హైకోర్టుకు మంగళవారం తెలిపింది. దా నికి సంబంధించి జారీచేసిన జీవో కాపీని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ హైకోర్టుకు సమర్పించారు. తమకు ఇచ్చిన హామీమేరకు విలేజ్ కోర్టుల ఏర్పాటుకు జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డిలతో కూడిన ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. గ్రామ న్యాయాలయాలపై రెండేళ్ల నుంచి చెబుతున్నా స్పందన లేదని గతవారం ప్రభుత్వంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వం జీవో జారీ చేయడంతో హైదరాబాద్‌కు చెందిన ఎం.నరేంద్రగౌడ్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని మూసివేస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనం ప్రకటించింది.

విత్తన అభివృద్ధికి ఇండో జర్మన్ సహకారం

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో విత్తన రంగ అభివృద్ధికి మరో మూడేళ్ల పాటు ఇండో జర్మన్ ప్రాజెక్టు సహకారం అందించనుంది. మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథితో ఇండోజర్మన్ ప్రాజెక్టు ప్రతినిధులు సమావేశమయ్యారు. రెండేళ్లుగా ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, భాగస్వామ్య సంస్థల కృషిని జర్మన్ ఫెడరల్ మినిస్ట్రీ సభ్యుడు సిగ్రిట్ గియాన్స్ ప్రశంసించారు. విత్తనోత్పత్తికి మంచి అవకాశాలున్న రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకుని విత్తనోత్పత్తి, నాణ్యత ధృవీకరణపై పొరుగు రాష్ట్రాలు, అంతర్జాతీయ విత్తన ప్రముఖులతో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.



మంగళవారం గాంధీభవన్ ముందు ధర్నా చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

వీహెచ్‌ను సస్పెండ్ చేయాలి

- దళితులను అవమానించారు
- గాంధీభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ధర్నా

హైదరాబాద్, వెలుగు:

దళితులను అవమానించిన కాంగ్రెస్ నాయకుడు వీ.హన్మంతరావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన సుమారు వంద మంది కాంగ్రెస్ దళిత కార్యకర్తలు మంగళవారం గాంధీభవన్ ఎదుట ధర్నాకు దిగారు. వీహెచ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని గాంధీ విగ్రహం ఎదుట బైటాయించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం గాంధీభవన్ ఇన్‌చార్జి కుమార్‌రావుకు యువజన, ఎన్ఎస్‌యూఐ నాయకులు మోహన్, రాజేష్‌లు వినతి పత్రం అందజేశారు. సీఎల్పీ నేతగా మల్లు భట్టి విక్రమార్క ఎన్నికైన సందర్భంగా మూడు రోజుల క్రితం పీసీసీ బీసీ సెల్ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో సన్మాన సభ ఏర్పాటు చేశారు. అందులో అంబర్‌పేట కాంగ్రెస్ నేత నూతి శ్రీకాంత్‌తోపాటు ఆయన అనుచరులు వేదికపై భట్టిని సన్మానిస్తున్న సమయంలో అక్కడే ఉన్న వీహెచ్‌కు నూతి అనుచరులు తగిలారు. దీంతో వీహెచ్, నూతి వర్గీయులకు వాగ్వాదం జరిగింది. ఒకదశలో తోపులాట, పిడిగుద్దులకు దిగారు. దీంతో భట్టి సన్మాన సభ రసాభాసగా మారింది. ఆ వెంటనే తమను అవమానించేలా మాట్లాడారని వీహెచ్‌పై నూతి అనుచరులు బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వీహెచ్ ఒత్తిడితో నూతి శ్రీకాంత్‌ను కాంగ్రెస్ ఓబీసీ హైదరాబాద్ నగర అధ్యక్ష పదవి నుంచి పార్టీ తొలగించింది.

రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం

వారంలోపు వీహెచ్‌పై పార్టీ చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని నాయకులు మోహన్, రాజేష్ గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ హెచ్చరించారు. వీహెచ్ నుంచి తమకు ప్రాణహాని ఉందన్నారు.

గ్రూప్-1 శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, వెలుగు: గ్రూప్ 1లో ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ అభ్యర్థుల నుంచి గిరిజన సంక్షేమ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వంద మందిని ఎంపిక చేసి పోలీస్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ సెంటర్ల(పీఈటీసీ) ద్వారా మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామని సంక్షేమ శాఖ డైరెక్టర్‌వి సర్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. ఎస్టీ అభ్యర్థులకు 75, ఎస్సీలకు 15, బీసీలకు 10 సీట్లు కేటాయించామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీల్లో వచ్చిన మార్కులు, రిజర్వేషన్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంత ఎస్టీ అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత అభ్యర్థులకు రూ.2 లక్షలకు మించరాదని చెప్పారు. బుధవారం నుంచి ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని, ఇతర వివరాలకు 04027540104 నంబర్‌కు ఆఫీస్ వేళల్లో ఫోన్‌చేయాలని సూచించారు.

వేసవికి మరో 142 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, వెలుగు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వేసవిలో వివిధ ప్రాంతాలకు మరో 142 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. కాకినాడ టౌన్-రాయచూర్-కాకినాడ టౌన్ (80 సర్వీసులు), కాకినాడ టౌన్-కర్నూలు సిటీ-కాకినాడ టౌన్ (52 సర్వీసులు), నర్సాపూర్-హైదరాబాద్ (5 సర్వీసులు), హైదరాబాద్- విజయవాడ (5 సర్వీసులు) మధ్య ఈ రైళ్లు నడుస్తాయని పేర్కొన్నారు.

కోర్టుల్లో సదుపాయాలు కల్పించండి

- అధికారులను ఆదేశించిన సీఎస్ ఎస్‌కే జోషి

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని అన్ని కోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ సీఎస్ ఎస్‌కే జోషి చెప్పారు. కోర్టుల్లో సౌకర్యాల కల్పనపై మంగళవారం సచివాలయంలోని తన చాంబర్లో సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి అన్నిరకాల సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. నిర్మించాల్సిన కోర్టు కాంప్లెక్స్‌లకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిల్లో జుడిషియల్ అధికారులకు నివాస భవనాలు ఏర్పాటు చేయాలని, అన్ని కోర్టుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు రాష్ట్రపతి ఉత్తర్వులకు లోబడి వ్యవహరించాలని సూచించారు. సమావేశానికి సుప్రీంకోర్టు అడ్వకేట్ గౌరవ్ అగర్వాల్, ముఖ్యకార్యదర్శులు సునీల్‌శర్మ, రామకృష్ణారావు, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, హైకోర్టు అధికారులు హాజరయ్యారు.

భగీరథకు రూ.4.82 కోట్లు విడుదల

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో చేపట్టిన13 ‘భగీరథ’ పనులకు ప్రభుత్వం మంగళవారం నిధులు విడుదల చేసింది. రూ.4 కోట్ల 82లక్షలకు గాను పరిపాలన అనుమతులిస్తూ మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సబర్వాల్ ఉత్తర్వులిచ్చారు. ఎన్‌ఆర్‌డీడబ్ల్యూపీలో రాష్ట్ర గ్రాంట్ కింద ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిషన్ భగీరథలోని నలుగురు ఎస్‌ఈలకు చీఫ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పిస్తూ కార్యదర్శి స్మితా సబర్వాల్ జీవో జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో శ్రీనివాస్ రెడ్డి, రమేష్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు ఉన్నారు.



మంగళవారం తెలంగాణ సారస్వత పరిషత్‌లో మాట్లాడుతున్న కెప్టెన్ లక్ష్మీకాంతరావు

ఫిబ్రవరి 6న డ్రైవర్స్ డే నిర్వహించాలి

హైదరాబాద్, వెలుగు: ఆజాద్ హింద్ ఫౌజ్ దళపతి సుభాష్ చంద్రబోస్‌కు డ్రైవర్‌గా పనిచేసిన కల్నల్ నిజాముద్దిన్ వర్ధంతి రోజును నేషనల్ డ్రైవర్స్ డేగా నిర్వహించాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ అసోసియేషన్ ప్రధాని నరేంద్ర మోడీని కోరింది. ఈ మేరకు ఆ సంఘం ప్రతినిధులు మంగళవారం ప్రధానికి లేఖ రాశారు. ఇండియన్ నేషనల్ ఆర్మీలో కల్నల్‌గా పనిచేశారని ఆ లేఖలో పేర్కొన్నారు. నిజాముద్దీన్ 2017 ఫిబ్రవరి 6న మరణించారని, ఆయన సేవలకు గుర్తుగా డ్రైవర్స్ డే నిర్వహించాలన్నారు.

తాత్కాలిక సిబ్బంది వేతనాలు విడుదల

హైదరాబాద్, వెలుగు: ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బందికి (స్వీపర్లు, టాయిలెట్ క్లీనర్లు)పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు రూ.19.89కోట్ల వేతన బకాయి నిధులను విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. 25,206 బడుల్లో పనిచేస్తున్న 28,686 మందికి 2018 సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు బకాయిలను స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఖాతాల్లో జమ చేశారు.

టీచర్ల ప్రమోషన్లకు కసరత్తు

- త్వరలో విద్యాశాఖాధికారులతో సీఎం భేటీ

హైదరాబాద్, వెలుగు: ఏకీకృత సర్వీస్‌రూల్స్ నిబంధనలపై రాష్ట్రపతి సవరణ ఉత్తర్వులను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో టీచర్ల ప్రమోషన్లపై కదలిక మొదలైంది. గతంలో జరిగిన తప్పిదాలు మరోసారి పునరావృతం కాకుండా న్యాయశాఖ సలహా తీసుకుని ముందుకు వెళ్లాలని ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. దీనిపై సీఎం కేసీఆర్ విద్యాశాఖ ఉన్నతాధికారులు, టీచర్ ఎమ్మెల్సీలతో త్వరలో సమావేశం కానున్నారు. ఎన్నికల కోడ్, పరీక్షల సీజన్ నేపథ్యంలో ప్రమోషన్ల ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశముంది.

ప్రమోషన్లకు ముందు ఓ కమిటీ వేసి కొత్త సర్వీస్‌రూల్స్ తయారు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఏకీకృత సర్వీస్‌రూల్స్ డ్రాఫ్ట్ తయారు చేసి ఉండడంతో దాంట్లో న్యాయస్థానం అభ్యంతరం చెప్పిన అంశాలు తొలగించి, కొత్త అంశాలు చేర్చుతారు. వీటికి సీఎం ఆమోదం తర్వాత ఏకీకృత సర్వీస్‌రూల్స్ అమల్లోకి వస్తాయి. దీని ఆధారంగా జిల్లాల నుంచి టీచర్ల సీనియార్టీ లిస్టులు సేకరించి, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల చేస్తారు. దీని ద్వారా ఐదు వేల మంది స్కూల్ అసిస్టెంట్లుగా, మూడు వేల మంది హెచ్‌ఎంలుగా మరో రెండు వేల మంది వరకు జీహెచ్‌ఎం, ఎంఈఓ, డైట్, బీఈడీ లెక్చరర్లుగా పదోన్నతి పొందే అవకాశముంది.

రోజుల్లో నోటిఫికేషన్ వస్తేనే..

ప్రమోషన్లకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారొచ్చని టీచర్స్ యూనియన్లు అభిప్రాయపడుతున్నాయి. మార్చిలో టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశముంది. దీనికితోడు ఈ రెండు నెలలూ పరీక్షల కాలం. అందుకే 20 రోజుల్లోగా ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల చేస్తే ఎన్నికల సమయంలోనూ ప్రమోషన్ల ప్రక్రియ సాఫీగా సాగే అవకాశముందని అధికారులు చెప్తున్నారు.

ప్రభుత్వ పథకాలను బ్రాహ్మణులు ఉపయోగించుకోవాలి

- టీఆర్ఎస్ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు

హైదరాబాద్ , వెలుగు: ప్రభుత్వ పథకాలను బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని టీఆర్ఎస్ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు అన్నారు. బ్రాహ్మణ పరిషత్‌కు ఎన్నో నిధులిచ్చి సీఎం కేసీఆర్ ఆదుకుంటున్నారని ఆయనకు వారి ఆశీర్వాదం ఎప్పటికీ ఉంటుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో బ్రాహ్మణ పరిషత్ కార్పొరేషన్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల పథకం కింద ఎంపికైనా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అడగకముందే కేసీఆర్ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని ఢిల్లీలో ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలాచారి అన్నారు. బ్రాహ్మణ పరిషత్ ద్వారా 4 పథకాలు అమలవుతున్నాయని, ఇప్పటికే రెండు విడతలుగా 110 మందికి చెక్కులు అందజేశామని ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి చెప్పారు. మూడో విడతలో భాగంగా బుధవారం నుంచి 13వ తేదీ దాకా 470 మందికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారికి ఈనెల 25 కల్లా చెక్కులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పురాణం సతీష్, దేవాదాయ శాఖ కమిషనర్ అనీల్ కుమార్ పాల్గొన్నారు.


కళాత్మకంగా మైండ్‌స్పేస్

- జీహెచ్‌ఎంసీకి అర్వింద్‌కుమార్ ఆదేశం



హైదరాబాద్, వెలుగు: మైండ్‌స్పేస్ జంక్షన్‌ను కాకతీయ కళావైభవం ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ జీహెచ్‌ఎంసీని ఆదేశించారు. ఐటీ కారిడార్, కోకాపేట పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఐటీ కారిడార్ మైండ్‌స్పేస్ జంక్షన్‌ను కళాత్మకంగా తీర్చిదిద్దాలని, పరిసరాల్లో గ్రీనరీ పెంచాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హరిచందనకు ఆదేశాలు జారీచేశారు. కోకాపేట ట్యాంక్‌కు సమీపంలోని గేటెడ్ కమ్యూనిటీపై అనుమానం వ్యక్తం చేశారు. అక్కడి నిర్మాణాలపై తనకు సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద దరఖాస్తుతో పాటు మొత్తం డబ్బులు చెల్లించిన 1,440 మంది దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులోగా అనుమతివ్వాలని హెచ్‌ఎండీఏ అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ కింద హెచ్‌ఎండీఏకు 1,61,693 అప్లికేషన్లు రాగా వాటిలో 91,658 అప్రూవ్ చేసి, 58,052 రిజెక్ట్ చేశారు.

ఏమన్నారంటే



తమిళులకు చోటేది?

తాజా బడ్జెట్‌లో తమిళనాడు అంశాల్లేవు. ఆ మాటకొస్తే అసలు దీనివల్ల ఎవరికీ ఏమీ ఒరగదు. ఈ పద్దు బీజేపీ కోసమే అన్నట్లుంది.

– కమల్‌హాసన్, ఎంఎన్ఎం పార్టీ చీఫ్



ఇట్లైతే కష్టం!

ఎమ్మెల్యేలందరిలాగ నన్ను చూడట్లేదు. పార్టీకి నా సర్వీసు వద్దేమో. కేజ్రీవాల్ కావాలనే దూరం పెడుతున్నారు. ఇట్లైతే కొనసాగను.

– అల్కా లంబా, ‘ఆప్’ ఎమ్మెల్యే



పాస్ట్ ఈజ్ పాస్ట్

గతాన్ని పట్టించుకోను. భవిష్యత్తే ముఖ్యం. లైఫ్‌లో కొత్త చాప్టర్ మొదలుపెట్టాలనుకుంటున్నా. స్టార్టప్ కంపెనీలకు బూస్టప్ చేస్తా.

– బిన్నీ బన్సల్, ఫ్లిప్‌కార్ట్ మాజీ సీఈవో



పూజారి చేసింది తప్పు

గుడిని శుద్ధి చేసే ముందు మాట వరసకు చెప్పారు. మా నిర్ణయం తెలిపే లోపే పని మొదలుపెట్టారు. దానికి బోర్డు పర్మిషన్ లేదు.

– పద్మకుమార్, టీడీబీ ప్రెసిడెంట్



సంకటకట స్థితి

ఈ ఫొటోలో బ్రిటన్ ప్రధాని థెరిసా మే కటకటాల వెనక ఉన్నట్లుంది. కానీ, ఆమె మంగళవారం లండన్‌లోని ‘10 డౌనింగ్ స్ట్రీట్’ నుంచి వెళ్తుండగా ఇలా కనిపించారు. ఈ చిత్రం థెరిసా రాజకీయ సంకట స్థితికి అద్దం పడుతోంది. బ్రెగ్జిట్ తేదీ దగ్గరపడుతున్నా ఆ ఒప్పందంపై చట్టసభలో గ్రీన్ సిగ్నల్ రాలేదు.

మీరూ రాయొచ్చు!

సమాజాన్ని ప్రభావితం చేసే వేర్వేరు అంశాలమీద మీ అభిప్రాయాలను ఆర్టికల్ రూపంలో పంపవచ్చు. openpage@v6velugu.com

టాస్క్ కరెక్టే.. టైమింగే రాంగ్!



ప్రధాని నరేంద్ర మోడీపై రాజకీయ ప్రత్యర్థులు ఎన్ని విమర్శలు చేసినా ఆయనను అవినీతిపరుడు అనే దుస్సాహసం ఎవరూ చేయరు. రాజకీయ అవినీతికి తావులేకుండా ‘అచ్ఛే దిన్’ తీసుకువస్తానంటూ 2014 ఎన్నికల్లో గెలిచి అధికారానికి వచ్చారు. అదేం విచిత్రమో కానీ రాజకీయ అవినీతిపై ఎప్పుడు యుద్ధం చేద్దామని ప్రయత్నించినా కాలం ఆయనకు కలిసి రావడం లేదు. ఎన్నికల ఏడాది కావడంతో టైమింగ్ కూడా ఆయనకు ఇబ్బందిగా మారింది.

నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏ చిన్న ప్రయత్నం చేసినా అది బూమెరాంగ్ అవుతోంది. ఆచరణలో ఒకటి కాదు రెండు కాదు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. లోక్ సభ ఎన్నికలు తరుముకు వస్తున్న సమయంలో ఏ అవినీతి కుంభకోణాన్ని తవ్వి తీద్దామని ప్రయత్నించినా అది వివాదమవుతోంది. చివరకు మోడీకి దురుద్దేశాలు అంటగట్టే పరిస్థితులు వస్తున్నాయి.

కోల్‌కతా వివాదానికి కేంద్ర బిందువైన శారదా చిట్ ఫండ్ కుంభకోణం ఇవాళ్టిది కాదు. ఆరేళ్ల కిందటిది. ఏకంగా రూ.2,500 కోట్ల కుంభకోణం అది. ఈ కేసుకు సంబంధించి విచారణ జరపడానికి సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ కుమార్ (ప్రస్తుత కోల్‌కతా పోలీస్ కమిషనర్) నాయకత్వంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఓ కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. కుంభకోణం బయటపడి ఆరేళ్లయినా ఇప్పటివరకు దర్యాప్తు ఒక్క అడుగు ముందుకు పడలేదు. దర్యాప్తుకు సహకరించడం లేదన్నది రాజీవ్ కుమార్‌పై సీబీఐ చేసిన ప్రధాన ఆరోపణ. అంతేకాదు, స్కాంకు సంబంధించిన కీలక పత్రాలను గల్లంతు చేశారన్న ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారెంట్ లేకుండా సీబీఐ అధికారుల బృందం హఠాత్తుగా కోల్‌కతా రావడం, ఏకంగా పోలీస్ కమిషనర్ ఇంటికి వెళ్లి అరెస్టు చేయడానికి ప్రయత్నించడంతో వివాదం రాజుకుంది. సుప్రీంకోర్టు అనుమతి లేకుండా, మాట మాత్రమైనా చెప్పకుండా మెజిస్టీరియల్ అధికారాలున్న పోలీస్ కమిషనర్‌ని అరెస్టు చేయడానికి ఎలా వెళ్తారన్న ప్రశ్న తెరమీదకు వచ్చింది. సీబీఐ అధికారుల తొందరపాటు కారణంగా చిట్‌ఫండ్ కుంభకోణం వెనక్కి పోయి మిగతా విషయాలు ముందుకు వచ్చాయి. ఎన్నికల ఏడాది కావడంతో ప్రతిపక్షాలన్నీ ఫైర్‌బ్రాండ్ మమతా బెనర్జీకి అండగా నిలిచాయి. మమత ధర్నా హైలెట్ అయింది. కుంభకోణం మరుగున పడింది.

మాయావతి, అఖిలేశ్ విషయంలోనూ ఇంతే!

ఇదే తీరుగా యూపీలో జరిపిన అవినీతి దాడుల విషయంలోనూ జరిగింది. బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) చీఫ్, యూపీ మాజీ సీఎం మాయావతిపై రెండు ముఖ్యమైన కేసులున్నాయి. మొదటిది రూ.1,400 కోట్లతో నిర్మించిన స్మారక స్థూపాల కేసు కాగా, రెండోది రూ.4,900 కోట్ల జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ నిధుల స్వాహా కేసు. ఇవి రెండూ 2007లో ఆమె యూపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటివి. ఈ కేసులకు సంబంధించి తాజాగా యూపీలో మొత్తం 11 చోట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు నిర్వహించింది. దీంతో రాజకీయ ప్రత్యర్థులపై రాజ్యాంగ వ్యవస్థలను ఉసిగొల్పుతున్నారన్న విమర్శలను మోడీ సర్కారు ఎదుర్కోవలసి వచ్చింది. సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్‌పై కేసుల విషయంలోనూ ప్రతిపక్షాలు మూకుమ్మడిగా కేంద్రంపై దాడికి దిగాయి.

టైమింగే శాపంగా మారింది

రాజకీయ నాయకులకు సంబంధించిన కేసుల్లో కేంద్రం ఒకడుగు ముందుకేసినా అడ్డంకులు ఎదురవుతున్నాయి. దీనికి టైమింగే మోడీ సర్కార్‌కి శాపంగా మారింది. దేశంలో చాలామంది ప్రతిపక్ష నాయకులపై అవినీతి కేసులున్నాయి. అవన్నీ నిన్నమొన్నటివి కావు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులు. వాటి దుమ్ము దులపడానికి మోడీ సర్కారు ఏం చేసినా వివాదానికి దారితీస్తోంది. పాత కేసులను తవ్వి తీస్తున్నారంటూ ప్రతిపక్షాలు రచ్చరచ్చ చేస్తున్నాయి. స్కాంలతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో ప్రతిపక్ష నాయకులను ప్రశ్నించడానికి ఈడీ ప్రయత్నిస్తే రాజకీయంగా ఎదురుతిరగడం అలవాటుగా మారింది.


ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు ఇబ్బందులు

రాజకీయ అవినీతిని తవ్వితీయడానికి సాధ్యమైనంత త్వరగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేస్తానని కిందటిసారి మోడీ ఇచ్చిన ఎన్నికల హామీని ఎవరూ మరచిపోలేదు. చాలామంది ఆయన చిత్తశుద్ధికి జేజేలు పలికారు. నాలుగున్నరేళ్లు ఇట్టే గడిచాయి. ఇప్పటి వరకు ఆ కోర్టులను ఏర్పాటు చేసిందీ లేదు, నేతల అవినీతిని జనం ముందు నిలబెట్టిందీ లేదు. అడ్మినిస్ట్రేషన్ నత్తనడకన నడవటమే దీనికి ప్రధాన కారణం. కారణాలేమైనప్పటికీ చివరకు సామాన్య ప్రజలు మోడీ చిత్తశుద్ధిని శంకించే పరిస్థితులు వచ్చాయి.

(‘ది వైర్’ సౌజన్యంతో...)

మందిరంపైనా విమర్శలు

అయోధ్యలో రామమందిర నిర్మాణానికి బీజేపీ కట్టుబడి ఉందన్న అంశంపై ఎవరికీ ఎలాంటి అనుమానాలు లేవు. అయితే టైటిల్ డీడ్‌కి సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. దీంతో మందిర నిర్మాణానికి న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. సుప్రీంకోర్టును కాదని కేంద్రం ఏమీ చేయలేని పరిస్థితి. దీంతో సంఘ్ పరివార్‌కి చెందిన విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) వంటి సంస్థల నుంచి కూడా మోడీ సర్కార్ విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. మహారాష్ట్రలోనూ, కేంద్రంలోనూ భాగస్వామ్యంగా ఉన్న శివసేన కూడా కేంద్రాన్నే తప్పు పట్టింది. మొత్తానికి పాలనా వ్యవస్థలోని లోపాలతోపాటు ఆచరణలో ఎదురవుతున్న అనేక ఇతర కారణాలతో మోడీ చిత్తశుద్ధి ప్రజల దృష్టిలో ప్రశ్నార్థకంగా మారుతోంది.



‘అసంఘటిత’ పింఛన్‌కు.. పాత స్కీమ్‌ల గతే!

అనార్గనైజ్డ్ లేబర్‌కి ప్రకటించిన పెన్షన్ స్కీం గురించి కేంద్రం గొప్పలకు పోతోంది. ప్రపంచంలోనే పెద్ద పింఛన్ పథకం కానుందని ప్రచారం చేసుకుంటోంది. ఇదంతా ‘భ్రమ’లా ఉంది. ఈ సర్కారు గతంలో తెచ్చిన రెండు పథకాలు ఫలితాలను ఇవ్వలేదు. ఇదీ వాటిలాగే ఫెయిల్ కావటం ఖాయంగా కనిపిస్తోంది. స్కీంలో చేరాలనుకునేవారు వాలంటరీగా కంట్రిబ్యూషన్ చెల్లించటం జరిగే పని కాదు.‘కంపల్సరీ’ రూల్ పెట్టకుండా చందాల వసూలు అసాధ్యం.

మధ్యంతర బడ్జెట్‌లో అనార్గనైజ్డ్ సెక్టార్ వర్కర్ల కోసం ‘ప్రధానమంత్రి శ్రమ్ యోగి మాన్ ధన్’ పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. రిక్షా కార్మికులు, ఆటోడ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు తదితరులు అర్హులు. ఇది మోడీ సర్కారు 2014లో ప్రారంభించిన ‘పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ శ్రమేవ్ జయతే’ ప్రోగ్రామ్‌ని గుర్తుకు తెస్తోంది. అసంఘటిత కార్మికులకు సోషల్ సెక్యూరిటీ కార్డులు ఇస్తామని అప్పట్లో చెప్పారు. ఆరోగ్య బీమా, ఓల్డేజ్ పెన్షన్ వంటి బెనిఫిట్లు పొందడానికి అనార్గనైజ్డ్ వర్కర్స్ ఐడెంటిఫికేషన్ నంబర్ కార్డులు ఉపయోగపడతాయన్నారు. అప్లికేషన్ మేళాలు పెట్టి వేల సంఖ్యలో తీసుకున్నారు. కానీ, ఒక్కరికైనా కార్డు ఇస్తే ఒట్టు. దరఖాస్తులు దుమ్ముకొట్టుకుపోతున్నాయి. కొత్త స్కీమ్‌కీ ఇదే గతి పట్టకతప్పదనిపిస్తోంది. కొత్త పథకంలోని ఫీచర్లనే యాదికి తెచ్చే మరో కార్యక్రమమూ గతంలో జరిగింది. అదే... ‘అటల్ పెన్షన్ యోజన’.

2015 మే 9న అమల్లోకి వచ్చిన ఈ ప్రోగ్రామ్ ఆది నుంచీ ఆపసోపాలు పడుతోంది. ఆ ఏడాది 2.2 కోట్ల మందిని ఇందులో చేర్చాలనుకున్నా 6.5 శాతమే జాయిన్ అయ్యారు. మూడేళ్ల తర్వాత కూడా సబ్‌స్క్రైబర్ బేస్ 1.1 కోట్లే. అంటే 50 శాతం టార్గెట్‌నే రీచ్ అయ్యారు. కోటి మందికి పైగా చేరటం చెప్పుకోదగ్గ విషయమే.

అయితే, దేశంలోని మొత్తం అసంఘటిత కార్మిక శక్తితో పోల్చితే ఈ సంఖ్య చాలా స్వల్పం. దేశంలో అనార్గనైజ్డ్ సెక్టార్ వర్క్‌ఫోర్స్ 41.6 కోట్లు కానుందని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ 2011-12లో చేసిన 66వ రౌండ్ సర్వే తెలిపింది. శ్రమేవ్ జయతే, అటల్ పెన్షన్ యోజన సక్సెస్ కాకపోయినా వాటినే కాస్త మార్చి సరికొత్త స్కీంలా ప్రజెంట్ చేయటం జనరల్ ఎలక్షన్‌కి ముందు ప్రతిపక్షాలపై జరిపిన ‘పొలిటికల్ సర్జికల్ స్ట్రయిక్స్’గా చెప్పుకోవచ్చు. కానీ.. ఆర్మీ మెరుపు దాడుల్లా ఇవి మంచి పేరు తేవటం కష్టమే.

వాస్తవానికి దూరంగా లక్ష్యాలు

కొత్త పథకంపై విమర్శలకు రెండు కారణాలున్నాయి. ఒకటి... పని చేసినందుకు కార్మికులు తీసుకునే కూలి డబ్బుల నుంచి చందాలను నేరుగా వసూలు చేసే ఏర్పాటు లేకపోవటం. రెండు.. బీమా సొమ్ము పొందే వయసును 60 ఏళ్లుగా నిర్ణయించటం. స్కీంలో చేరాలనుకునే వారు వాలంటరీగా కంట్రిబ్యూషన్ చెల్లించటం జరిగే పని కాదు. కార్మికులు ఈ పథకాన్ని స్వాగతించే అవకాశం లేదు.

వరల్డ్‌లో నే కాదు. ఇండియాలోనూ సోషల్ సెక్యూరిటీ స్కీమ్‌లను ఎంప్లాయ్‌మెంట్‌తో లింక్ చేశారు. ఉద్యోగి శాలరీ నుంచి కొంత, అతను పని చేసే సంస్థ నుంచి కొంత నెలనెలా మినహాయిస్తారు. కానీ, కొత్త పథకంలో కంట్రిబ్యూషన్‌ని వర్కర్లే వాళ్ల ఇష్టప్రకారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా దాదాపు 20 నుంచి 30 ఏళ్ల వరకు చెల్లించాలి. ‘కంపల్సరీ’ రూల్ పెట్టకుండా చందాల వసూలు అసాధ్యం.

పీఎఫ్ డిడక్షన్స్ ‘తప్పనిసరి’ చేసిన ఈ రోజుల్లోనే కొన్ని సంస్థల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాల్లో వాళ్లకు చెప్పకుండానే కోత పెడుతున్నారు. పైగా ఆ డబ్బును పీఎఫ్ ఆఫీస్‌లో జమ చేయట్లేదు. మరో వైపు.. క్లెయిమ్ చేసుకునేవారులేక ఈపీఎఫ్ఓలో కోట్ల రూపాయలు మూలుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో 20, 30 ఏళ్ల తర్వాత వచ్చే పెన్షన్ కోసం కార్మికులే సొంతంగా డిపాజిట్లు చేయాలనటంలో లాజిక్ లేదు.

కటాఫ్ ఏజ్‌ని తగ్గించాలి

రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత కార్మికుల కోసం కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌లు తెచ్చాయి. అవి చాలావరకు ఇప్పుడు వాడుకలో లేవు. ప్రభుత్వ/ప్రైవేట్/కాంట్రాక్ట్ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనెఫిట్లు ఇవ్వటానికి కటాఫ్ ఏజ్ 60 ఏళ్లు పెట్టడం రీజనబులే. కానీ, నిత్యం కాయకష్టం చేసేవారికి కూడా పెన్షన్ పొందే వయసును 60 ఏళ్లుగా నిర్ణయించటం సరి కాదు. మన దేశంలో వ్యక్తి సగటు జీవన కాలం 68.8 ఏళ్లు. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 65 ఏళ్లు మాత్రమే. సామాజిక, ఆర్థిక కారణాల రీత్యా ఈ లైఫ్ టైం ఇతర కులాల్లోని మిడిల్ క్లాస్‌తో పోల్చితే ఎస్సీలు, ఎస్టీలకు ఇంకా తక్కువ. ఇన్‌ఫార్మల్ సెక్టార్‌లో పనిచేసేవాళ్లల్లో ఈ సామాజిక వర్గాల వాళ్లే ఎక్కువ మంది ఉంటారు.

‘ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ స్టడీస్’కి చెందిన ఎస్.కె.మహంతీ, ఎఫ్.రామ్‌లు విడుదల చేసిన రీసెర్చ్ పేపర్‌లో ఈ వివరాలను చూడొచ్చు. 2006లో ఎస్టీల జీవితకాలం 60.3 ఏళ్లు కాగా, వాళ్లల్లో పేదలకు లైఫ్ ఎక్స్‌పెక్టెన్సీ 56.9 ఏళ్లు. ఆ రోజుల్లో పేద ఎస్సీల సగటు జీవన కాలం 63 ఏళ్లని ‘లైఫ్ ఎక్స్‌పెక్టెన్సీ ఎట్ బర్త్ ఎమాంగ్ సోషల్ అండ్ ఎకనమిక్ గ్రూప్స్ ఇన్ ఇండియా’ అనే రీసెర్చ్ పేపర్ వెల్లడిస్తోంది. భవన నిర్మాణాలు, ఇటుక బట్టీలు, క్వారీలు తదితర పనులు చేసేవాళ్ల సగటు జీవన కాలం 40 ఏళ్ల లోపే అంటే ఆశ్చర్యం కలగక మానదు. వయసు 40 ఏళ్లు దాటిన తర్వాత బతికున్నా వేరే పనులు, ఉద్యోగాలు దొరికే పరిస్థితి కూడా లేదు. కారణాలేమైనా మెజారిటీ కార్మికుల జీవితం 60 ఏళ్లలోపే ముగుస్తోంది. అందువల్ల కొత్త పింఛన్ పథకం వల్ల లబ్ధిపొందేవాళ్లు చాలా తక్కువ. ‘మహా అయితే నాలుగైదేళ్లు పెన్షన్ తీసుకుంటానేమో. ఈ మాత్రం దానికే 20, 30 ఏళ్లపాటు చందా కట్టాలా?’ అని సగటు కూలీ ఆలోచించటంలో తప్పు లేదు. ఈ నేపథ్యంలో ‘ప్రధానమంత్రి శ్రమ్ యోగి మాన్ ధన్’లో పెన్షన్ ప్రారంభ వయసును 60 నుంచి 55 ఏళ్లకు తగ్గించాలి. అయినా.. అనార్గనైజ్డ్ లేబర్‌కి ప్రయోజనం కలిగించడానికి ఇంతకన్నా మంచి పథకాల్ని ప్రవేశపెట్టాల్సింది.

– సుధీర్ కటియార్

సెంటర్ ఫర్ లేబర్ రీసెర్చ్ అండ్ యాక్షన్



గుడ్ మోడల్

‘మహారాష్ట్ర మథాడి అండ్ అదర్ మ్యాన్యువల్ వర్కర్స్ యాక్ట్-1969’ మంచి ప్రత్యామ్నాయం అనిపిస్తోంది. ఆ రాష్ట్రంలో మథాడి బోర్డులు 30కిపైనే ఉన్నాయి. వాటి ద్వారా లక్షల మంది కూలీలు లబ్ధి పొందుతున్నారు. ఉపాధి కల్పించటం; ఉద్యోగికి, సంస్థకు మధ్య సంబంధాలను బలోపేతం చేయటం; ఎంప్లాయ్‌మెంట్‌తో సోషల్ సెక్యూరిటీ బెనెఫిట్స్‌ని ముడిపెట్టడం ద్వారా మథాడి బోర్డులు ఆదర్శంగా నిలుస్తున్నాయి.



లా వర్సిటీలు... ఆర్టీఐని పట్టించుకోవట్లా!



గవర్నమెంట్ వ్యవహారాలు ట్రాన్స్‌పరెంట్‌గా ఉండాలి. ప్రజల కోసం, ప్రజల ద్వారా ఏర్పడిన ప్రజా ప్రభుత్వాలు, రాజ్యాంగ వ్యవస్థలు సమాచారాన్ని దాచిపెట్టకూడదు. ఆర్టీఐ కింద అందుకున్న పిటిషన్లను సీరియస్‌గా తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పింది. అయినా.. చట్టాన్ని, రాజ్యాంగాన్ని నూరిపోసే ‘లా వర్సిటీలు’ లైట్ తీసుకుంటున్నాయి.

చట్టాల గురించి బోధించే లా యూనివర్సిటీలే చట్టానికి తూట్లు పొడుస్తున్న ఘటనలు ఆశ్చర్యపరుస్తున్నాయి. అవి కూడా సాధారణ వర్సిటీలు కావు. ‘నేషనల్’ స్థాయివి!. సమాచార హక్కు చట్టం ప్రజలకు ఆయుధం లాంటిది. ప్రభుత్వ వ్యవహారాలు ట్రాన్స్‌పరెన్సీ కోసం తీసుకువచ్చిన చట్టమిది. ఎన్నో ఉద్యమాలు, పోరాటాల తర్వాత వచ్చిన ఈ చట్టాన్ని నేషనల్ లా వర్సిటీలు పట్టించుకోకపోవడం విడ్డూరం.

మూడేళ్ల కిందట జరిగిన సంఘటన నాకు ఇప్పటికీ గుర్తుంది. ‘స్టూడెంట్ జ్యూరిడికల్ అసోసియేషన్ (ఎస్‌జేఏ)’ అనే సంఘం ‘రాజీవ్ గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా’కి సంబంధించి కొన్ని డాక్యుమెంట్లు కోరుతూ ఆర్టీఐ పిటీషన్ వేసింది. అప్పటి వైస్ చాన్సలర్ పి.ఈశ్వర భట్ ఈ పిటీషన్‌ని నిర్లక్ష్యంగా పక్కన పడేశారు. వీసీ ఆఫీస్ నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో ఒకసారి కాదు చాలాసార్లు ఎస్‌జేఏ పిటీషన్లు వేసింది. ఫలానా సమాచారం కావాలంటూ కోరింది. ఎన్నిసార్లు పిటీషన్లు వేసినా వీసీయే కాదు, వర్సిటీ రిజిస్ట్రార్ సర్ఫరాజ్ ఖాన్ నుంచి కూడా స్పందించలేదు. ఎడమ కంటితోనైనా పిటీషన్ల వైపు చూడలేదు. చివరకు ఆర్టీఐ కింద ఇన్ఫర్మేషన్ కోరుతూ సుప్రీం కోర్టు గడప తొక్కాల్సి వచ్చింది. అప్పటికి కానీ వర్సిటీ అధికారుల్లో కదలిక రాలేదు.

ఆ తర్వాత కూడా ‘రాజీవ్ గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా’లో పెద్దగా మార్పులు రాలేదు. వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ వంటి కీలక పోస్టుల్లో కొత్తవారు రావడంతో పరిస్థితి మారుతుందని స్టూడెంట్లు భావించారు. అవన్నీ భ్రమలేనన్న విషయం అర్థం కావడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. యాక్టింగ్ వీసీగా పనిచేసిన జస్టిస్ (రిటైర్డ్) అమిత్ తాలూక్‌దార్ కూడా ఆర్టీఐ చట్టాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అసలు అదో పెద్ద విషయం కాదన్నట్లే వ్యవహరించారు. బాధ్యతాయుతమైన పోస్టుల్లో ఉన్నవారు ఎలా వ్యవహరించినా విద్యార్థి లోకం ఊరుకోదు. పట్టు వదలని విక్రమార్కుడిలా ఒకటికి నాలుగు సార్లు ‘రైట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్’ చట్టం కింద పిటీషన్లు వేశారు. యూనివర్సిటీలో జరుగుతున్న అనేక స్కాంలను వెలికి తీశారు.


అరకొర సమాచారమే

స్టూడెంట్లు సైలెంట్‌గా ఉండే రకం కారనుకున్నారో ఏమో కానీ, కొన్నిసార్లు ఆర్టీఐ పిటీషన్లకు అధికారులు రియాక్ట్ అయ్యేవారు. అయితే కావలసిన ఇన్ఫర్మేషన్ కాకుండా పనికిమాలిన చెత్త చేతిలో పెట్టి, అదే అసలైన సమాచారం అన్నట్లుగా ఇచ్చేవారు. పైకి సమాచారం ఇచ్చినట్లూ ఉంటుంది. లోపలి లొసుగులు బయటపడకుండా తెలివిగా వ్యవహరించేవారు. ఇలాంటి సంఘటనలు ‘సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ (సీఐసీ)’ దాకా పోయాయి. సంబంధిత అధికారులను ఇన్ఫర్మేషన్ కమిషన్ చీవాట్లు పెట్టడం కూడా జరిగాయి. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని రాబట్టడంలో ఎన్ని అడ్డంకులు, అవరోధాలు ఎదురైనా ‘స్టూడెంట్ జ్యూరిడికల్ అసోసియేషన్’ తన పోరాటాన్ని ఆపలేదు. నేషనల్ లా యూనివర్సిటీల పాలనా వ్యవహారాల్లో ట్రాన్స్‌ఫరెన్సీకోసం పిటీషన్ల రూపంలో ఉద్యమిస్తూనే ఉంది.

– అంజు అగర్వాల్, అసోసియేట్ ఎట్ ట్రై లీగల్, ఢిల్లీ.

డేటా ఇవ్వడం కనీస బాధ్యత

ఆఫీసర్లు జరిపే సమావేశాల వివరాలను స్పష్టంగా ప్రజలకు తెలియచేయాలి. అదొక బాధ్యత. ‘మినిట్స్’లో ఏయే అంశాల గురించి చర్చించారు అనే విషయం ప్రజలకు తెలియాల్సి ఉంది. నేషనల్ లా యూనివర్సిటీలు ఈ విషయం పట్టించుకోవు. అన్ని వ్యవస్థలకు వర్తించే ఆర్టీఐ యాక్ట్ తమకు వర్తించదని భావిస్తాయేమో మరి! కొన్నిసార్లు వర్సిటీ అధికారులు తమ తెలివితేటల్ని ఇక్కడే చూపిస్తారు. పిటీషన్‌దారుడు అడుగుతున్న సమాచారం తమ వద్ద లేదని ఒక్క మాటతో తేల్చి పారేస్తారు. ఇన్ఫర్మేషన్ అందిన తర్వాత వెల్లడిస్తామని ఓ చిన్న మెలిక పెడతారు. ఇక అంతే... రోజులు గడిచిపోతుంటాయి. పిటీషన్‌దారు అడిగిన సమాచారం ఇక ఎప్పటికీ బయటకు రాదు.



చరణ్ వినయ విధేయత

హిట్ కొట్టాలనే ఎవరైనా సినిమా చేస్తారు. కానీ ప్రతి ప్రయత్నం ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేదు కాబట్టి ఒక్కోసారి పరాజయాలు తప్పవు. ఆ ఫలితాన్ని జీర్ణించుకోవడం ఎంత కష్టమో, దాన్ని ఓపెన్‌గా ఒప్పుకోవడం అంతకు మించిన సాహసం. రామ్‌చరణ్ ఇప్పుడదే చేశాడు. 'రంగస్థలం' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత చెర్రీ నుంచి భారీ అంచనాలతో వచ్చిన 'వినయ విధేయ రామ' తొలి రోజు నుంచే నెగిటివ్ టాక్ తెచ్చుకుంది. సంక్రాంతి సీజన్ కనుక వసూళ్ల మాటెలా ఉన్నా.. సినిమాలో చరణ్‌తో దర్శకుడు చేయించిన విన్యాసాలు సోషల్ మీడియాలో ఎక్కువగా ట్రోల్ అయ్యాయి. సినిమాపై ప్రేక్షకుల నుంచి వ్యక్తమైన విముఖతపై తాజాగా రామ్‌చరణ్ స్పందించాడు. తన అభిమానులకు, ప్రేక్షకులకు లేఖ రాశాడు. 'మీ అందరికీ నచ్చి, మీకు వినోదాన్నందించే సినిమా అందించడానికి ఎంతగానో శ్రమించాం. దురదృష్టవశాత్తూ అనుకున్న విధంగా ఒక మంచి సినిమాని అందించలేకపోయాం. మీ అంచనాలని అందుకోలేకపోయాం. మీ ఆదరాభిమానాలను ప్రేరణగా తీసుకుని భవిష్యత్తులో మీకు నచ్చే, మీరు మెచ్చే సినిమాలు చేయడానికి కృషి చేస్తాను' అంటూ తన లేఖలో తెలిపాడు రామ్‌చరణ్. సినిమాకి సంబంధించి చరణ్ పాత్రలోని వీరత్వం సోషల్ మీడియాలో ట్రోల్ అవగా.. ఇప్పుడు చరణ్ చూపిన విధేయత అదే మాధ్యమంలో హైలైట్ అవుతోంది.



సీబీఐ ఆఫీసర్‌గా..

ఫిమేల్ ఓరియెంటెడ్ చిత్రాలతో సత్తా చాటి, లేడీ సూపర్ స్టార్ అన్న పేరు తెచ్చుకుంది నయనతార. ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కిన తమిళ చిత్రం 'ఇమైక్క నొడిగళ్'. నయన్ సీబీఐ ఆఫీసర్‌గా నటించిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. దాంతో ఇప్పుడు తెలుగులోకి డబ్ చేస్తున్నారు. 'అంజలి సీబీఐ ఆఫీసర్' పేరుతో ఫిబ్రవరి 22న రిలీజ్ కాబోతున్న ఈ చిత్రంలో అధర్వ, రాశిఖన్నా ఇతర ముఖ్య పాత్రలు పోసించారు. జ్ఞానముత్తు దర్శకుడు. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఇందులో నెగిటివ్ రోల్ పోషించారు.

వాస్తవాల విచారణ



సంచలన తమిళ చిత్రం 'విసారణై'... తెలుగులో 'విచారణ' పేరుతో ఈనెల 8న రిలీజవుతోంది. కల్పనా చిత్ర బ్యానర్‌పై కోనేరు కల్పన విడుదల చేస్తున్నారు. చంద్ర కుమార్ అనే ఆటో డ్రైవర్ రాసిన 'లాకప్' నవల ఆధారంగా వెట్రిమారన్ ఈ సినిమా రూపొందించాడు. హీరో ధనుష్ నిర్మించాడు. తెలుగు నటుడు అజయ్ ఘోష్ పోలీసాఫీసర్‌గా కీలక పాత్రను పోషించాడు. అమాయకులైన నలుగురు తమిళ యువకులను ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఓ కేసులో ఇరికించి చిత్ర హింసలు పెట్టడం, ఆపై తమిళనాడు పోలీసులు కూడా వారి జీవితాలతో ఆడుకోవడం ప్రధాన కథాంశం. మూడేళ్ల క్రితం తమిళనాట విడుదలైన ఈ చిత్రం వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్ సహా పలు విదేశీ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమవడంతో పాటు... ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలో ఆస్కార్‌కు అధికారిక ఎంట్రీ పొందింది. మూడు జాతీయ అవార్డులను కూడా అందుకుంది. ఉత్తమ నటుడిగా సముద్రఖనితో పాటు ఉత్తమ చిత్రం, ఉత్తమ ఎడిటింగ్‌కు జాతీయ అవార్డులు లభించాయి. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా వచ్చిన ప్రయోగాత్మక చిత్రమిది. తమిళంలో మెప్పించిన ఈ సినిమా తెలుగులో ఎలాంటి ఫలితాన్ని అందుకోనుందో!



ఇంతలో ఎంత మార్పు!

అద్భుతాలు ఎప్పుడు ఎలా జరుగుతాయో తెలియదు. దానికి నిదర్శనమే నా జీవితం అంటున్నాడు విజయ్ దేవరకొండ. ఫోర్బ్స్ సంపన్నుల జాబితాలో తన పేరు చేరడంతో చాలా ఎక్సయిటవుతున్నాడు విజయ్. 'పాతికేళ్ల వయసున్నప్పుడు ఐదు వందల రూపాయల బ్యాలెన్స్ మెయింటెయిన్ చేయలేకపోతే బ్యాంకు వాళ్లు నా అకౌంట్ లాక్ చేశారు. అప్పుడు నాన్న... ముప్ఫయ్యేళ్లు వచ్చేలోపు నువ్వు సెటిలవ్వు, నువ్వు వయసులో ఉన్నప్పుడు, నీ తల్లిదండ్రులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సక్సెస్‌ని ఎంజాయ్ చేయగలవు అని చెప్పారు. నాలుగేళ్ల తర్వాత ఫోర్బ్స్ వందమంది సంపన్నుల లిస్ట్‌లో ఉన్నాను' అంటూ తన సంతోషాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నాడు విజయ్. నిజమే మరి. ఎంతమంది యువకులు అనుకున్నది సాధించలేక జీవితంలో వెనకబడిపోతు న్నారో. అలాంటి వారందరికీ విజయ్ దేవరకొండ ఒక స్ఫూర్తి. కష్టపడి పైకొచ్చాడు. చిన్న వయసులోనే పెద్ద విజయాలు సాధించాడు. ఇంకా ఎంతో సాధించాలంటూ తపన పడుతున్నాడు. యువతరం తనని ఆదర్శంగా తీసుకోవాల్సిందే.

యాభై రోజుల హుషారు



ప్రస్తుత పరిస్థితుల్లో సినిమా యాభై రోజులు ఆడటమే కష్టం. అలాంటిది యాభై రోజుల వేడుక నిర్వహించడమంటే మరీ అరుదు. అంతటి విజయాన్ని అందుకున్న 'హుషారు' టీమ్‌కి అభినందనలు చెప్పారు దిల్ రాజు. బెక్కెం వేణుగోపాల్ నిర్మాతగా హర్ష కొనుగంటి దర్శకత్వంలో తేజస్, దక్ష, అభినవ్, ప్రియా ముఖ్య పాత్రల్లో తెరకెక్కిన ఈ సినిమా యాభై రోజుల వేడుకకు దిల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై చిత్ర బృందానికి షీల్డులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ 'మొదటి పాట విడుదల రోజునే ఈ సినిమా విజయం సాధిస్తుందని చెప్పాను. ఆ మాట నిజమై యాభై రోజుల వేడుక జరుపుకోవడం సంతోషంగాఉంది' అన్నారు. నిర్మాత వేణుగోపాల్ మాట్లాడుతూ 'ఇంతటి ఘన విజయం ఊహించలేదు. కొద్దిపాటి వసూళ్లతో మొదలైన ఈ సినిమా క్రమంగా వసూళ్లు పెంచుకుంటూ యాభై రోజులు పూర్తి చేసుకుంది. తొలి చిత్రమైనా దర్శకుడు హర్ష కాంప్రమైజ్ అవకుండా అద్భుతంగా రూపొందించాడు. నటీనటులు, టెక్నీషియన్స్ అందరి కష్టానికి ప్రతిఫలమిది. ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు. చిత్రబృందమంతా పాల్గొన్నారు.

ఎంట్రీకి రెడీనా?

బాలీవుడ్‌లో హీరోల కొడుకులే కాదు... కూతుళ్లు కూడా ఇండస్ట్రీలో సత్తా చాటుతున్నారు. కరీనా కపూర్, సోనాక్షీ సిన్హా, ఆలియా భట్, జాన్వీ కపూర్, సారా అలీ ఖాన్... ఇలా ఒక్కొక్కరుగా వచ్చి తమ తల్లిదండ్రుల పేరు నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. షారుఖ్ కూతురు కూడా అదే బాటలో నడుస్తున్నట్టు కనిపిస్తోంది. నిజానికి కింగ్ ఖాన్ తన కొడుకుని హీరోని చేస్తాడనుకున్నారంతా. కానీ షారుఖ్ కొడుకు కంటే కూతురే మొదట్నుంచీ లైమ్ లైట్‌లో ఉంటూ వస్తోంది. పైగా రీసెంట్‌గా నటిగా కూడా మారింది. 'రోమియో జూలియెట్' నాటకంలో నటించింది. అప్పటి ఫొటో ఒకటి రీసెంట్‌గా లీకై నెట్‌లో వైరల్ అవుతోంది. అందులో సుహానా లుక్స్, ఎక్స్‌ప్రెషన్స్ గమనించిన వారంతా ఖాన్ వారసురాలంటూ కితాబిస్తున్నారు. హీరోయిన్‌గా ఎంట్రీ ఖాయమేనంటున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు కూడా జరుగుతున్నా యని సమాచారం.



ఎవరీ ఉన్మాది?

రక్షించే పోలీస్ ఉన్మాదిగా మారితే ఏం జరుగుతుంది? అసలు అతను అలా ఎందుకు మారాడు? తెలియాలంటే తమ 'ఉన్మాది' సినిమా చూడమంటున్నారు దర్శకుడు ఎన్.ఆర్.రెడ్డి. ఆయనే హీరోగా ప్రవీణ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై ఎన్.కరణ్ రెడ్డి సమర్పణలో రూపొందించిన ఈ చిత్రం ఫిబ్రవరి 8న విడుదల కానుంది. గ్రామీణ నేపథ్యంలో జరిగే కథ అని, పూర్తి కమర్షియల్ ఎంటర్‌టైనర్ అని, అందరికీ తప్పకుండా నచ్చుతుం దని నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారాయన.




అలరించే అలిటా

హాలీవుడ్ యాక్షన్ మూవీస్‌కి ప్రపంచ వ్యాప్తంగా అభిమానులున్నారు. అందుకే అవి ఇతర భాషల్లోకి డబ్ అవుతుంటాయి. ఇప్పుడు 'అలిట... బ్యాటిల్ ఏంజిల్' కూడా వస్తోంది. రాబర్ట్ రోడ్రిగ్జ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫిబ్రవరి 8న తెలుగులో రిలీజ్ కానుంది. దాదాపు రెండు వందల మిలియన్ డాలర్లతో తెరకెక్కించిన ఈ చిత్రంలో... అలిట పాత్రలో రోసా చేసిన అద్భుత విన్యాసాలు ప్రధాన ఆకర్షణ.

అది నిజం కాదు

ఇటీవల 'మిస్టర్ మజ్ను'లో అఖిల్ పక్కన కాసేపు అలరించింది ఇజబెల్లె. విజయ్ దేవరకొండతో క్రాంతి మాధవ్ తెరకెక్కిస్తోన్న సినిమాలో ఈమె కూడా ఒక కథానాయిక. అయితే జయంత్ సి. పరాన్జీ డైరెక్ట్ చేస్తున్న 'నరేంద్ర'లో కూడా నటిస్తోందంటూ రీసెంట్‌గా వార్తలు వచ్చాయి. ఆ విషయమై స్పందించింది ఇజబెల్లె. 'ఆ సినిమాలో నేను యాక్ట్ చేస్తున్నానని న్యూస్ వచ్చింది. అది నిజం కాదు. నేను చేయట్లేదు. అసలా సినిమా విషయంలో నన్నింతవరకూ ఎవరూ సంప్రదించలేదు' అని చెప్పింది. అయితే అవకాశాలు మాత్రం దండిగానే ఉన్నాయట. రెండు మూడు సినిమాలు చర్చల దశలో ఉన్నాయట. కన్‌ఫర్మ్ కాగానే చెబుతానంటోంది. మొత్తానికి ఈ బ్రెజిల్ బ్యూటీ టాలీవుడ్‌లో పాగా వేసేలానే ఉంది.





ట్విటర్ టాక్



"నాకున్న కొద్దిపాటి అనుభవంలో నేను తెలుసుకున్నది ఒక్కటే. జీవితమంటే పట్టు విడుపుల మేళవింపు. తర్వాత బాధపడ కూడదనుకుంటే వచ్చిన అవకాశాన్ని గట్టిగా పట్టుకోవాలి. బాధ కలుగుతుంది అనుకుంటే ఎంత ముఖ్యమైన విషయాన్నయినా పట్టించుకోకుండా వదిలేయాలి. కాకపోతే దేన్ని పట్టుకోవాలి, దేన్ని వదిలిపెట్టేయాలి అన్నది ఆయా పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది."

– కృతీసనన్

ఈవెంట్



ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా ప్రధాన పాత్రల్లో ఆర్.రఘురాజ్ రూపొందించిన చిత్రం '4 లెటర్స్'. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని 'ఎ' సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 22న విడుదల కానుంది. ఇటీవల ప్రముఖ హీరో వెంకటేష్ టీజర్, ట్రైలర్ చూసి చిత్ర బృందాన్ని అభినందించారు.

గప్‌చుప్

పాత్ర డిఫరెంట్‌గా ఉంటే స్టార్ హీరోలతోనే కాదు, అప్ కమింగ్ హీరోలతోనూ నటిస్తోంది సమంత. రీసెంట్‌గా బెల్లం కొండ శ్రీనివాస్‌తో నటించేం దుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని టాలీవుడ్ టాక్. 'ఆర్ ఎక్స్ 100' ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహించే ఈ సినిమాని ఓ ప్రముఖ సంస్థ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఆల్రెడీ 'అల్లుడు శీను'లో శ్రీనివాస్‌తో నటించింది సామ్. అన్నీ ఓకే అయితే ఇది రెండో మూవీ అవుతుంది.



ఫొటో ఫీస్ట్



వెండిమబ్బు తేరు మీద అప్సరస తేలి వస్తున్నట్టుంది కదూ! సురభి సినిమాల్లో తక్కువగానే కనిపించినా సోషల్ మీడియాలో మాత్రం తరచూ కనిపిస్తుంది. ఇలా అందంగా ముస్తాబై అందరినీ మురిపిస్తూ ఉంటుంది.

19 కోట్ల డాలర్లు పోయినట్టే!

సీఈఓ మృతితో పాస్‌వర్డ్‌లు గల్లంతు ● క్రిప్టోకరెన్సీ ఎక్స్‌చేంజీలో కల్లోలం



జెరాల్డ్ కాటన్

టొరంటో: కెనడాలోని అతిపెద్ద క్రిప్టోకరెన్సీ ఎక్స్‌చేంజ్ క్వాడ్రిగా యూజర్లకు చెందిన 19 కోట్ల డాలర్ల విలువైన (దాదాపు రూ. 1400 కోట్లు) బిట్‌కాయిన్లు కంప్యూటర్ల నుంచి బయటికి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ఎందుకంటే వీటికి సంబంధించిన పాస్‌వర్డ్స్ అన్నీ సీఈఓ జెరాల్డ్ కాటన్ దగ్గర ఉండేవి. ఆయన అనారోగ్యం కారణంగా ఇండియాలోనే గత డిసెంబరులో మరణించారు. తన కంప్యూటర్లపై దాడి జరిగే అవకాశం ఉండటంతో బిట్‌కాయిన్లను ఆన్‌లైన్‌లో ఉంచకుండా, ఆఫ్‌లైన్ స్టోరేజీలోకి తరలించారు. వీటిని కోల్డ్ వాలెట్స్ అని కూడా పిలుస్తారు. కాటన్ దగ్గరున్న పాస్‌వర్డ్స్‌తో (ప్రైవేట్ కీస్) మాత్రమే ఈ వాలెట్లను తెరవడం సాధ్యమని ఆయన భార్య జెన్నిఫర్ కెనడా సుప్రీంకోర్టుకు తెలిపింది. కాటన్ మరణం వల్ల క్వాడ్రిగా 10 వేల మంది ఖాతాదారులకు చెల్లింపులు నిలిపివేసింది. అందుకే కోర్టులో క్రెడిటర్ ప్రొటెక్షన్ పిటిషన్ వేసింది. క్రిప్టోకరెన్సీ ఎక్స్‌చేంజిని నిర్వహించడానికి తన భర్త ఉపయోగించే ల్యాప్‌టాప్ పూర్తిగా ఎన్‌క్రిప్ట్ అయిందని జెన్నిఫర్ తెలిపారు. ఎంత ప్రయత్నించినా, పాస్‌వర్డ్‌లు ఎక్కడా దొరకలేదన్నారు. కాటన్ ల్యాప్‌టాప్‌ను హాక్ చేయడానికి నిపుణులు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఆయన యూఎస్‌బీని ఓపెన్ చేయడానికి కూడా విఫలయత్నం చేశారు. అయితే క్వాడ్రిగా డైరెక్టర్లంతా రాజీనామా చేయడంతో కాటన్ ఒక్కరే కంపెనీని నడిపించేవారు. ఆయన మరణంతో పాస్‌వర్డ్స్ దొరకడం అసాధ్యంగా మారిందని ఆయన భార్య చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కోల్డ్ వాలెట్స్‌ను బిట్‌కాయిన్స్‌ను తీసుకోవడానికి మల్టీ సిగ్నేచర్ సిస్టమ్‌ను ఉపయోగిస్తారు. కాటన్ మాత్రం ఈ విధానాన్ని అనుసరించలేదు. అయితే కస్టమర్లు మాత్రం ఇందులో ఏదో మోసం ఉందని అంటున్నారు. కాటన్ మరణించినట్టు ఏదైనా ఆధారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఇండియాలో ఆయన మరణించినట్టు ఎలాంటి వార్తలూ రాలేదని ఒక యూజర్ సోషల్ మీడియాలో రాశారు. ఇది పెద్ద కుంభకోణమని అన్నారు.

రెండు కంపెనీలుగా సువెన్ లైఫ్



- ప్రత్యేక కంపెనీగా క్రామ్స్ అండర్‌టేకింగ్

హైదరాబాద్, వెలుగు: ఫార్మా రంగంలోని సువెన్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ కాంట్రాక్ట్ రిసెర్చ్ అండ్ మ్యానుఫాక్చరింగ్ సర్వీసెస్ (క్రామ్స్) అండర్‌టేకింగ్‌ను ప్రత్యేక కంపెనీగా డీమెర్జర్ చేయాలని నిర్ణయించింది. సువెన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్‌గా పిలిచే ఈ కొత్త కంపెనీ సువెన్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్‌కు నూరు శాతం సబ్సిడరీగా ఉంటుందని సువెన్ లైఫ్ సైన్సెస్ తెలిపింది. అక్టోబర్ 1, 2018 ని నిర్ధారిత తేదీగా నిర్ణయించినట్లు కూడా ఎక్స్ఛేంజ్‌కు పంపిన వర్తమానంలో సువెన్ లైఫ్ పేర్కొంది. సువెన్ లైఫ్ సైన్సెస్‌లోని రూ.1 విలువ చేసే ప్రతీ వాటాకూ సువెన్ ఫార్మాస్యూటికల్స్ రూ.1 విలువైన ఒక వాటాను జారీ చేస్తుందని, ఇండిపెండెంట్ ఆడిట్, కన్సల్టింగ్ సంస్థలు ఈ వ్యాల్యుయేషన్ ప్రక్రియను నిర్వహించాయని కూడా వెల్లడించింది. మంగళవారం నాడు సమావేశమైన డైరెక్టర్ల బోర్డు ఈ మేరకు నిర్ణయించినట్లు కంపెనీ తెలిపింది. స్కీమ్ ఆఫ్ ఎరేంజ్‌మెంట్ రూపొందిన తర్వాత, అవసరమైన రెగ్యులేటరీ అప్రూవల్స్‌కు వెళ్లనున్నట్లు పేర్కొంది. ఇదిలావుంటే, డిసెంబర్ 2018 తో ముగిసిన మూడోల క్వార్టర్‌లో సువెన్ లైఫ్ సైన్సెస్ ఆదాయం అంతకు ముందు క్వార్టర్ (సెప్టెంబర్ 2018)తో పోలిస్తే 40.24 శాతం పెరిగి 134.78 కోట్లకు చేరింది. ఇదే కాలానికి నికరలాభం కూడా 40.27 శాతం వృద్ధితో రూ.25.16 కోట్లయింది. ఈ ఆర్థిక ఫలితాలను 9 నెలలకు కలిపి చూసినప్పుడు ఆదాయం కేవలం 1.20 శాతం పెరగ్గా, నికర లాభం 14.57 శాతం క్షీణించడం గమనార్హం. రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో లాభదాయకత దెబ్బతింటోంది. ఇది గుర్తించే బహుశా క్రామ్స్‌ను ప్రత్యేక కంపెనీగా డీ మెర్జ్ చేయాలని సువెన్ లైఫ్ సైన్సెస్ బోర్డు నిర్ణయించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మంగళవారం నాటి మీటింగ్‌లో డైరెక్టర్ల బోర్డు 150 శాతం ఇంటరిమ్ డివిడెండ్ చెల్లించాలని కూడా ప్రతిపాదించింది. గడచిన 9 నెలల్లో సువెన్ లైఫ్‌కు నాలుగు దేశాలలో కొత్తగా పేటెంట్లు లభించాయి.

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.403	రూ.4.65
వరంగల్	రూ.405	రూ.4.65

సెన్సెక్స్ ↑ 34
36,616.81

నిఫ్టీ ↑ 22
10,934.35



వాల్‌మార్ట్ పీఛేముడ్

ఫ్లిప్‌కార్ట్‌లో పెట్టుబడి వెనక్కి కొత్త ఎఫ్‌డీఐ రూల్సే కారణం

న్యూఢిల్లీ: దేశీయ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో పెట్టిన లక్షల కోట్ల రూపాయల పెట్టుబడిని వెనక్కి తీసుకునే ఆలోచనలో పడింది వాల్‌మార్ట్. రూల్స్ మార్పు వల్ల కాలంలో లాభాలు వచ్చే అవకాశాలు లేకపోతే ఫ్లిప్‌కార్ట్ నుంచి వాల్‌మార్ట్ బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. చైనాలో అమెజాన్ ఇలాగే చేసిందని అమెరికాకు చెందిన ఆర్థిక సేవల సంస్థ మోర్గన్ స్టాన్లీ తెలిపింది. ''ఫ్లిప్‌కార్ట్ నుంచి వాల్‌మార్ట్ వైదొలుగుతుందనే వాదనను పూర్తిగా తీసిపారేయలేం. ఎందుకంటే ఇండియాలో ఈ-కామర్స్ మార్కెట్ సంక్లిష్టంగా తయారయింది'' అని ఈ సంస్థ 'అసెసింగ్ ఫ్లిప్‌కార్ట్ రిస్క్ టు వాల్‌మార్ట్ ఈపీఎస్' పేరుతో విడుదల చేసిన నివేదిక తెలిపింది. ఇండియాలో ఈ-కామర్స్, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) సంబంధించి ఈ నెల ఒకటో తేదీ నుంచి కొత్త రూల్స్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త నియమాల ప్రకారం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి కంపెనీలు సొంత వెండర్ల ద్వారా అమ్మకాలు జరపకూడదు. ఎక్స్‌క్లూజివ్ డీల్స్ కుదుర్చుకోకూడదు. భారీ డిస్కౌంట్లు ఇవ్వకూడదు. అందరు సెల్లర్లకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. చైనాలోనూ ఇలాంటి విధానాలు రావడం వల్లే అమెజాన్ అక్కడి నుంచి 2017లో వెనక్కి వచ్చిందని మోర్గన్ స్టాన్లీ తెలిపింది. ఇండియా కొత్త ఎఫ్‌డీఐ రూల్స్ వచ్చాక ఫ్లిప్‌కార్ట్ తన ప్రొడక్ట్స్‌లో 25 శాతం ఉపసంహరించుకుందని పేర్కొంది. చాలా స్మార్ట్‌ఫోన్, ఎలక్ట్రానిక్స్ మోడల్స్ అమ్మకాలను ఆపేయాల్సి రావడం ఫ్లిప్‌కార్ట్‌కు పెద్దదెబ్బని విశ్లేషించింది. ''ఎలక్ట్రానిక్స్ కేటగిరీ నుంచే ఫ్లిప్‌కార్ట్‌కు 50 శాతం ఆదాయం వస్తుంది. వీటి అమ్మకాలను నిలిపివేయడం సంస్థకు ఇబ్బందిగా మారుతుంది. వాల్‌మార్ట్ నుంచి ఒత్తిడి అధికమవుతుంది'' అని వివరించారు. మొదటి నుంచి స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల అమ్మకాలు ఈ కంపెనీకి పెద్ద ఎత్తున ఆదాయాలను తెచ్చిపెడుతున్నాయి.

ఇంకా అవకాశాలు ఉన్నాయి...

తాజా పరిస్థితులపై వాల్‌మార్ట్ అధికార ప్రతినిధి స్పందిస్తూ ''ఈ-కామర్స్ కంపెనీల కోసం ఇటీవల చాలా మార్పులు తెచ్చారు. ఇండియా మార్కెట్ చాలా పెద్దది కాబట్టి మాకు ఇంకా అవకాశాలు ఉన్నాయని ఆశిస్తున్నాం. ఎందుకంటే ఇక్కడ ఈ-కామర్స్ విస్తృతి ఇప్పటికీ తక్కువగానే ఉంది. ఇక నుంచి కూడా వ్యవసాయం, ఆహారం, రిటైల్‌లో సుస్థిర ఆర్థికవృద్ధి సాధించడంలో భాగస్వాములం అవుతాం. మా భవిష్యత్ పెట్టుబడులు ఇండియాకు ప్రయోజనం కలిగిస్తాయి'' అని ఆయన వివరించారు. కొత్త రూల్స్ వచ్చాక అత్యధికంగా నష్టపోయింది ఫ్లిప్‌కార్ట్, అమెజానే! అమ్మకాలు ఏకంగా 25-35 శాతం తగ్గాయి. తమ సొంత సెల్లర్‌లను సైట్ల నుంచి తొలగించడమే ఇందుకు ప్రధాన కారణం. అమెజాన్ టాప్ సెల్లర్స్ క్లౌడ్‌టేల్, అపారియో రిటైల్ ప్రొడక్ట్స్‌ను పూర్తిగా తొలగించారు. ఇవి రెండూ అమెజాన్‌తో జాయింట్ వెంచర్ కుదుర్చుకున్నాయి. ''వాల్‌మార్ట్ ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఇండియాలో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టింది. ఇప్పటికిప్పుడు మాత్రం ఇది ఫ్లిప్‌కార్ట్ నుంచి బయటికి రాకపోవచ్చు. ఇండియాలో ఈ-కామర్స్ ఇక ముందు ఎలా ఉంటుందనేది ఇప్పుడే చెప్పలేం'' అని ఒక విశ్లేషకుడు అన్నారు.



అంబానీకే లాభం

ఈ-కామర్స్ కంపెనీల్లోని అందరు సెల్లర్లకు సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే కొత్త రూల్స్ తెచ్చామని ప్రభుత్వం చెబుతోంది. దీనివల్ల అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ 'ప్రిఫర్డ్ సెల్లర్స్'ను తొలగించాల్సి వచ్చింది. వీటి అమ్మకాల్లో 80 శాతం ప్రిఫర్డ్ సెల్లర్స్ నుంచే వస్తున్నాయి. వీటిలో ఈ రెండు కంపెనీలకు ఈక్విటీ ఉంది. స్మార్ట్‌ఫోన్ వంటి విభాగాల్లో ఈ సైట్లు ఆఫర్ చేస్తున్న ఎక్స్‌క్లూజివ్ డీల్స్ అన్నీ రద్దయ్యాయి. గత ఏడాది నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో వాల్‌మార్ట్ 22 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.57 లక్షల కోట్లు) పెట్టుబడులుగా పెట్టింది. కొత్త రూల్స్ వల్ల అటు ఫ్లిప్‌కార్ట్, ఇటు అమెజాన్‌ల నష్టాలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది మేలో పార్లమెంటు ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో లోకల్ రిటైలర్ల ఒత్తిడికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త రూల్స్‌ను తీసుకొచ్చింది. మనదేశంలో అతిపెద్ద రిటైల్ నెట్‌వర్క్ ఉన్న రిలయన్స్‌కు ఈ పరిస్థితి కలిసి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ-కామర్స్ రంగంలోకి పెద్ద ఎత్తున ప్రవేశించాలనుకుంటున్న అంబానీకి ఇది సరైన సమయమని చెబుతున్నారు. రిటైల్ చైన్‌కుతోడు 28 కోట్ల మంది జియో కస్టమర్లు అతిపెద్ద ఆస్తి అని విశ్లేషిస్తున్నారు.



కిలోమీటరుకు రూ.1.75 మాత్రమే

స్పైస్‌జెట్ స్పెషల్ ఆఫర్

గురుగ్రామ్: కొన్ని రూట్లలో కిలోమీటరుకు కేవలం రూ.1.75 ధరతో టికెట్లను విక్రయిస్తున్నట్టు స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. అంతర్జాతీయ రూట్లలో కిలోమీటరుకు రూ.2.50 చార్జి చేస్తామని తెలిపింది. ఈ నెల 5-9 తేదీల మధ్య ఈ టికెట్లను కొనుక్కోవచ్చు. మొత్తం 3.50 లక్షల టికెట్లను అమ్ముతామని కంపెనీ తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబరు 25లోపు చేసే ప్రయాణాల కోసం ఈ ఆఫర్ వర్తిస్తుంది. తక్కువ దూరం ఉండే జమ్మూ-శ్రీనగర్, చెన్నై-బెంగళూరు, కొచ్చి-బెంగళూరు, హుబ్లీ-బెంగళూరు రూట్లలో టికెట్ కేవలం ధర రూ.899లు మాత్రమేనని స్పైస్‌జెట్ తెలిపింది.

సుజ్లాన్ ఎనర్జీ షేర్ 28 శాతం డౌన్

డిఫాల్ట్ పుకార్లే కారణం

న్యూఢిల్లీ: పవన విద్యుత్ కంపెనీ సుజ్లాన్ ఎనర్జీ షేర్లు మంగళవారం 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.2.70ను తాకాయి. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో ఈ షేరు 27 శాతం నష్టపోయి రూ.3.45 వద్ద ముగిసింది. రుణాల చెల్లింపులో కంపెనీ విఫలమైనట్టు పుకార్లు రావడంతో షేరు ధర ఘోరంగా పతనమైంది. వెంటనే స్పందించిన యాజమాన్యం వివరణ ఇచ్చింది. గత నాలుగేళ్లలో ఒక్క చెల్లింపులోనూ విఫలం కాలేదని ప్రకటించింది. ప్రస్తుతం క్యూ3 ఫలితాలను వెల్లడించే పనిలో ఉన్నందున, ఇంతకంటే ఎక్కువ ఏమీ చెప్పలేమని తెలిపింది.

సిప్‌లకు ఆదరణ

హైదరాబాద్, వెలుగు : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా, హైదరాబాద్ మార్కెట్లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)కు ఆదరణ పెరుగుతోందని మిరాయ్ ఎసెట్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ స్వరూప్ మొహంతి చెప్పారు. దాదాపు 30 వేల మంది ఇన్వెస్టర్లు సిప్ కింద రూ.11.80 కోట్లను తమ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టినట్లు వెల్లడించారు. హైదరాబాద్ మార్కెట్లో 1.59 శాతం వాటా సాధించామని తెలిపారు. గత పదేళ్లలో మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు భారీగా పెరిగాయని, సిప్‌లకు ఆదరణ పెరగడం ఒక కారణమని వివరించారు. 2007-08 లో ఇండియాలో ప్రవేశించిన మిరాయ్ ఎసెట్ మ్యూచువల్ ఫండ్ చేతిలోని ఎసెట్లు ఇప్పుడు రూ. 23,500 కోట్లకు చేరాయని, ఈ ఏడాది రూ. 40 వేల కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని మొహంతి చెప్పారు. 2017-18 లో 50 శాతం వృద్ధి సాధించినట్లు తెలిపారు. ఈక్విటీ, డెట్, ఈటీఎఫ్, హైబ్రిడ్ పథకాలను కొత్తగా కొన్ని తేనున్నామని, పనితీరు దీర్ఘకాలంలో బాగున్నందువల్లే మిరాయ్ పేరు నిలబెట్టుకోగలుగుతోందని వివరించారు. జులై 2013 నాటికి ఇండియాలో తమ అధీనంలోని ఎసెట్స్ రూ.500 కోట్లేనని, గత అయిదేళ్లలో అనూహ్యమైన వృద్ధి సాధించగలిగామని తెలిపారు. ఫైనాన్షియల్ సర్వీసెస్‌లోని అన్ని విభాగాలలోనూ ప్రవేశిస్తున్నామని చెప్పారు.

పీఎన్‌బీకి అమాంతం లాభం



- నాలుగు క్వార్టర్‌లలో తొలిసారి
- నీరవ్ కుంభకోణం నుంచి కోలుకుంటున్న పీఎన్‌బీ

ముంబై : గత మూడు క్వార్టర్ల నుంచి నష్టాలు ప్రకటిస్తూ వచ్చిన పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ), డిసెంబర్‌తో ముగిసిన క్వార్టర్‌లో లాభాలను ప్రకటించింది. బ్యాంక్ నికర లాభాలు 8 శాతం పెరిగి రూ.247 కోట్లుగా రికార్డయినట్టు పీఎన్‌బీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో పేర్కొంది. పీఎన్‌బీ రూ.9,800 కోట్ల నష్టాలను నమోదు చేస్తుందని విశ్లేషకులు అంచనావేశారు. వీరి అంచనాలను తారుమారు చేస్తూ.. పీఎన్‌బీ లాభాలతో సర్‌ప్రైజ్ ఇచ్చింది. బ్యాంక్ గతేడాది ఇదే కాలంలో రూ.230.11 కోట్ల లాభాలను రికార్డు చేసిన సంగతి తెలిసిందే. బ్యాంక్‌కి కీలక ఆదాయమైన నికర వడ్డీ ఆదాయం 7 శాతం ఎగిసి రూ.4,290 కోట్లకు చేరినట్టు పీఎన్‌బీ ప్రకటించింది. పీఎన్‌బీ ఆస్తుల నాణ్యత పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తుల రేషియో 17.16 శాతం నుంచి 16.33 శాతానికి తగ్గింది. సెప్టెంబర్ క్వార్టర్‌లో 8.90 శాతంగా ఉన్న నికర ఎన్‌పీఏల రేషియో కూడా 8.22 శాతానికి క్షీణించింది.

క్వార్టర్ లెక్కన కూడా ఈ డిసెంబర్ క్వార్టర్‌లో బ్యాంక్ ప్రొవిజన్లు, కంటిజెన్సీలు 38.4 శాతం తగ్గి, రూ.2,753 కోట్లుగా నమోదయ్యాయి. వీటిలో రూ.2,014 కోట్లను నీరవ్ మోడీ కుంభకోణంతో ప్రభావితమైన అకౌంట్లకు కేటాయించారు. ఇప్పడిక ఈ కుంభకోణం కోసం కేటాయించాల్సింది ఏమీ లేదని పీఎన్‌బీ ఎండీ, సీఈవో సునిల్ మెహతా చెప్పారు. డైమండ్ కింగ్ నీరవ్ మోడీ పీఎన్‌బీలో రూ.14,357 కోట్ల కుంభకోణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ క్వార్టర్‌లో బ్యాంక్ ప్రొవిజన్లు, కంటిజెన్సీలు రూ.9757.90 కోట్లు. బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల కాలంలో రూ.16వేల కోట్ల రికవరీ చేపట్టింది. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం మూడింతలు ఎక్కువ. ఫలితాలను ప్రకటించిన అనంతరం బ్యాంక్ షేర్లు 3.6 శాతం పెరిగి రూ.75.80 మధ్యలో ట్రేడయ్యాయి.

బీహెచ్‌ఈఎల్ సైతం జంప్

ప్రభుత్వ రంగ ఇంజనీరింగ్ సంస్థ బీహెచ్‌ఈఎల్ సైతం లాభాల్లో జంప్ చేసింది. డిసెంబర్‌తో ముగిసిన క్వార్టర్‌లో బీహెచ్‌ఈఎల్ నికర లాభాలు 25.30 శాతం పెరిగి రూ.191.95 కోట్లుగా నమోదైనట్టు ప్రకటించింది. ముందటి ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో బీహెచ్‌ఈఎల్ లాభాలు రూ.153.19 కోట్లుగా ఉన్నట్టు కంపెనీ తెలిపింది. ఫలితాల ప్రకటన సందర్భంగా బోర్డు 40 శాతం రేటులో(ఒక్కో షేరుకి రూ.0.80) మధ్యంతర డివిడెండ్‌ను ఇచ్చేందుకు ఆమోదించినట్టు కూడా వెల్లడించింది. ఈ డివిడెండ్‌ను 2019 ఫిబ్రవరి 21 వరకు చెల్లించనున్నట్టు పేర్కొంది. కొత్త వ్యాపారాల్లోకి వెళ్లడం, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూషన్‌ను పెంచడం, వ్యయాలను నియంత్రణలో పెట్టుకోవడం, వనరులు సరిగ్గా వాడుకునే చర్యలు వంటి వాటితో కంపెనీ ఈ స్థిరమైన ప్రదర్శనను కనబర్చినట్టు బీహెచ్‌ఈఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అతుల్ సోబ్తి చెప్పారు. కేవలం పవర్ వ్యాపారాలపైనే కాకుండా.. నాన్ పవర్ వ్యాపారాలను కూడా బలోపేతం చేస్తున్నట్టు పేర్కొన్నారు.

'నానో'కిక టాటా..



- అటకెక్కిన రతన్ టాటా డ్రీమ్ కారు
- నానో కథ ఇక కంచికే
- జనవరిలో జీరో ప్రొడక్షన్, జీరో సేల్స్

న్యూఢిల్లీ : రతన్ టాటా డ్రీమ్ కారు 'నానో'. అత్యంత తక్కువ ధరకు ప్రజల కారుగా ఇది మార్కెట్లోకి వచ్చింది. కానీ ఎంత స్పీడుగా అయితే మార్కెట్లోకి వచ్చిందో, అంతే స్పీడుగా ప్రజాధరణ కోల్పోయింది. ఈ చిన్న కారును కొనేవారే కరువయ్యారు. అమ్మకాలు లేకపోవడంతో, నానో కథ కంచికి చేరింది. ఇప్పుడు పూర్తిగా ఉత్పత్తిని, అమ్మకాలను ఆపివేసింది టాటా మోటార్స్. జనవరి నెలలో కనీసం ఒక్క కారును కూడా ఉత్పత్తి చేయలేదని, అంతేకాక ఒక్క కారును కూడా అమ్మలేదని తెలిసింది. ఇటీవలే కంపెనీ వర్గాలు కూడా నానో కథకు 2020 ఏప్రిల్ నుంచి ఫుల్‌స్టాప్ పెడుతున్నట్టు సంకేతాలు ఇచ్చాయి. బీఎస్ 6 ఎమిషన్స్ నిబంధనలను, ఇతర భద్రతా ప్రమాణాలను చేరుకోవడానికి రతన్ టాటా డ్రీమ్ కారుపై ఎలాంటి పెట్టుబడులు పెట్టేందుకు టాటా మోటార్స్ సిద్ధంగా లేదనీ తెలిసింది. రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కూడా ఈ ఏడాది జనవరిలో నానో ఉత్పత్తి జీరోగా ఉన్నట్టు టాటా మోటార్స్ వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలో నానో కారు ఉత్పత్తి 83 యూనిట్లుగా ఉంది. అంతేకాక దేశీయ మార్కెట్‌లోనూ నానో అమ్మకాలు లేవు. 2018 జనవరిలో నానో కారు అమ్మకాలు 62 యూనిట్లుగా ఉన్నాయి. ఎగుమతుల విషయానికొస్తే, ఈ కారుకు సంబంధించి ఎలాంటి షిప్‌మెంట్లను కంపెనీ చేపట్టలేదు. గత నెలలో కూడా నానో ఎగుమతులు లేవు. ప్రస్తుత రూపంలో ఉన్న నానో కారు కొత్త భద్రతా ప్రమాణాలను, ఎమిషన్స్ నిబంధనలను చేరుకోలేదని టాటా మోటార్స్ అధికార ప్రతినిధి కూడా ఒప్పుకున్నారు. వీటిని చేరుకోవాలంటే కొత్త పెట్టుబడులు పెట్టాలన్నారు. అయితే ఇంకా పెట్టుబడుల విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. ఒక్క ప్రొడక్ట్ లైఫ్ సైకిల్‌పై నిర్ణయం తీసుకోవాలంటే సమగ్రంగా విశ్లేషణ చేపట్టాలని, మార్కెట్ పరిణామాలు, నిబంధనలు వంటి వాటిని పరిగణలోకి తీసుకున్నాకే నిర్ణయం ప్రకటించాల్సి ఉంటుందని అధికార ప్రతినిధి తెలిపారు. ఒక నెల ఉత్పత్తి సంఖ్యను తీసుకుని ఈ ఊహాగానాలు వస్తున్నాయని, దానిలో కంపెనీ జోక్యం చేసుకోదని చెప్పారు. గతేడాది జూన్‌లో కంపెనీ ఒక్క యూనిట్ కారునే ఉత్పత్తి చేసింది. కానీ దేశీయ మార్కెట్‌లోనే మూడు యూనిట్లను అమ్మింది. మార్కెట్ డిమాండ్ బట్టి సనంద్ ప్లాంట్‌లో కంపెనీ నానో కారును ఉత్పత్తి చేస్తుందన్నారు. నానో భవిష్యత్తుపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు.

నానో ప్రస్థానం....

నానో కారును తొలిసారి ఆటో ఎక్స్‌పోలో 2008 జనవరిలో ఆవిష్కరించారు. ఇది బాగా ఆదరణ పొందింది. 2009 మార్చిలో ఈ కారు మార్కెట్లోకి లాంచ్ అయింది. దీని బేస్ మోడల్ ధర రూ. లక్ష. ఖర్చు పెరిగినప్పటికీ వాగ్దానం నెలబెట్టుకోవాలని రతన్ టాటా డ్రీమ్ ప్రాజెక్ట్ అని ఈ కారును లక్ష రూపాయలకే విక్రయించారు. ఈ కారుకు మొదటి నుంచి ఇబ్బందులే. పశ్చిమ బెంగాల్ సింగూర్‌లో ప్రతిపాదించిన టాటా మోటార్స్ ప్లాంట్ నుంచి ఈ కారును ఆవిష్కరించాలనుకున్నారు. భూసేకరణను స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. నానో అత్యంత చౌకైన కారు అని ప్రమోట్ చేయడం కంపెనీ చేసిన తప్పిదంగా రతన్ టాటా ఒప్పుకున్నారు. టాటా గ్రూప్ నుంచి అర్ధంతరంగా గెంటివేయబడ్డ టాటా సన్స్ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీ కూడా నానో నష్టాలను తెచ్చిపెట్టే మోడల్ అని, నానో వల్ల రూ. వెయ్యి కోట్ల వరకు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఇంత భారీ మొత్తంలో నష్టాలు వస్తోన్న భావోద్వేగ కారణాలతో టాటా మోటార్స్ దీని ఉత్పత్తిని ఆపివేయడం లేదని ఆరోపించారు.

24 గంటల్లో టాక్స్ రీఫండ్స్

న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారికి శుభవార్త. ఇక 24 గంటల్లోనే అన్ని రిటర్నులను ప్రాసెస్ చేసి, రీఫండ్స్‌ను కూడా వెంటనే జారీ చేయాలని రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నిర్ణయించింది. దీని కోసం రెండేళ్లలో ఓ కొత్త మెకానిజం ఏర్పాటు చేసేందుకు కసరత్తు కూడా ప్రారంభించింది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాక్చర్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.4,200 కోట్లను జారీ చేసింది. ఈ సిస్టమ్ ద్వారా రిటర్నులను, రీఫండ్‌లను ప్రాసెస్, స్క్రూటినీ చేయొచ్చు. వెరిఫికేషన్‌ను వేగవంతంగా చేపట్టవచ్చు. ప్రస్తుతం రీఫండ్‌లను ఆటోమేటెడ్‌గా ఆన్‌లైన్‌లో ప్రాసెస్ చేస్తున్నట్టు రెవెన్యూ సెక్రటరీ అజయ్ భూషణ్ పాండే తెలిపారు. ఈ ఏడాది రూ.1.50 లక్షల కోట్ల రీఫండ్లను నేరుగా బ్యాంక్ అకౌంట్లలోకి జమ చేసినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం సిస్టమ్‌ను మరింత అప్‌గ్రేడ్ చేసి, రీఫండ్‌లను 24 గంటల్లోపు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా ఈ మెకానిజంను పన్ను చెల్లింపుదారుల ముందుకు తీసుకొస్తామని పాండే తెలిపారు. 2019-20 మధ్యంతర బడ్జెట్ సమర్పించే సమయంలో, ఆదాయపు పన్ను శాఖ ఆన్‌లైన్‌గా పనిచేస్తుందని, రిటర్నులను, రీఫండ్‌లను, క్వరీస్‌ను ఆన్‌లైన్‌గా చేపడుతున్నట్టు ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. గతేడాది 99.54 శాతం ఇన్‌కమ్ టాక్స్ రిటర్నులను ఆదాయపు పన్ను శాఖ ఆమోదించినట్టు పేర్కొన్నారు.



రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించిన నిజామాబాద్ అర్బన్ జట్టు

నిజామాబాద్ అర్బన్ డబుల్ ధమాకా

నిజామాబాద్/ జయశంకర్ భూపాలపల్లి, వెలుగు: ‘వెలుగు, వీ-6’ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో నిజామాబాద్ అర్బన్ జట్టు మంగళవారం రెండు విజయాలతో అదరగొట్టింది. మొదటి మ్యాచ్‌లో జుక్కల్, నిజామాబాద్ అర్బన్ జట్లు తలపడగా.. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన జుక్కల్ 18.3 ఓవర్లలో 116 రన్స్ చేసింది. తర్వాత నిజామాబాద్ అర్బన్ 11.1 ఓవర్లలోనే 118 రన్స్ చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో బోధన్‌పై కూడా నిజామాబాద్ అర్బన్ ఘన విజయం సాధించింది. తొలుత బోధన్ 13.5 ఓవర్లలో 69 రన్స్ చేసింది. ఛేజింగ్‌లో అర్బన్ జట్టు 9.4 ఓవర్లలో 74 రన్స్ చేసి మ్యాచ్‌లో గెలిచింది. మొదటి మ్యాచ్‌లో 66 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచిన అంకిత్‌రెడ్డి, రెండో మ్యాచ్‌లో 24 రన్స్‌తో పాటు రెండు వికెట్లు తీసిన వాజిద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు.





వరంగల్‌లో కామెంటరీ చేస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

భూపాలపల్లి, ములుగు ఖాతాలో విజయాలు

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌ల్లో భూపాలపల్లి, ములుగు జట్లు విజయం సాధించాయి. మొదటి మ్యాచ్‌లో భూపాలపల్లి, ములుగు జట్లు పోటీపడగా ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భూపాలపల్లి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 రన్స్ చేసింది. ఛేజింగ్‌లో ములుగు జట్టు 97 రన్స్‌కే ఆలౌటైంది. అనంతరం ఉత్కంఠభరితంగా సాగిన రెండో మ్యాచ్‌లో ములుగు జట్టు పరకాలపై ఒక్క రన్ తేడాతో విజయం సాధించింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ములుగు జట్టు 15 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 121 రన్స్ చేసింది. అనంతరం పరకాల జట్టు 15 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 120 రన్స్ చేసి ఒక పరుగు తేడాతో ఓడిపోయింది. మొదటి మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసి 14 రన్స్ చేసిన విక్రమ్, రెండో మ్యాచ్‌లో 38 రన్స్ చేసి ఒక వికెట్ తీసిన రియాజ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు.



భూపాలపల్లి, ములుగు మ్యాచ్‌లో రనౌట్ చేసేందుకు ప్రయత్నిస్తున్న క్రీడాకారుడు



టెస్ట్‌ల్లో తిరుగులేని శక్తిగా ఎదిగినా.. వన్డేల్లో నంబర్ వన్ ర్యాంక్‌కు చేరువైనా.. టీ20ల్లో ఇప్పటికే చాలానే సాధించినా.. న్యూజిలాండ్‌తో టీ20 పోరులో మాత్రం ఇండియాది వెనకడుగే..! ఆ జట్టుతో ఇప్పటిదాకా ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో రెండింటిలోనే నెగ్గిన మన టీమ్ ఆరింటిలో ఓడిపోయింది..! కివీస్‌లో ఆడిన ఏకైక సిరీస్‌లోనూ చిత్తుగా ఓడిపోయింది..! ఇప్పుడు ఆ చెత్త రికార్డును తుడిచేసేందుకు టీమిండియా రెడీ అయింది.

ఇండియాను ఆపతరమా!

జోరుమీదున్న రోహిత్ సేన ■ కివీస్‌లో తొలి టీ20 సిరీస్‌పై గురి

న్యూజిలాండ్‌తో మొదటి టీ20 నేడు ■ మ. 12.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

వెల్లింగ్టన్: వరుస విజయాలతో మూడు నెలల విదేశీ టూర్‌ను ఇప్పటికే మధుర జ్ఞాపకంగా మార్చుకున్న టీమిండియా మరో సిరీస్‌పై కన్నేసింది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా బుధవారం ఇక్కడి వెస్ట్‌పాక్ స్టేడియంలో జరిగే మొదటి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. వన్డే సిరీస్‌లో చిత్తుగా ఓడి తీవ్ర ఒత్తిడిలో పడిపోయిన ఆతిథ్య కివీస్‌ను పొట్టి ఫార్మాట్‌లోనూ గట్టి దెబ్బతీయాలని రోహిత్ శర్మ నేతృత్వంలోని ఇండియా ఆశిస్తోంది. 4-1తో న్యూజిలాండ్ గడ్డపై అతి పెద్ద వన్డే సిరీస్ విక్టరీ నమోదు చేసిన భారత్.. అదే జోష్‌తో కివీస్‌లో తొలిసారి టీ20 సిరీస్‌ను కూడా ఖాతాలో వేసుకోవాలని కృత నిశ్చయంతో బరిలోకి దిగనుంది. అందుకు తొలి మ్యాచ్‌తో గట్టి పునాది వేసుకోవాలనుకుంటోంది.

ఆసీస్, కివీస్‌తో వరుసగా రెండు వన్డే సిరీస్‌ల్లో గొప్పగా రాణించడంతో ఇంగ్లండ్‌లో జరిగే వరల్డ్‌కప్‌లో పాల్గొనబోయే టీమ్ కాంబినేషన్‌పై ఇండియా ఇప్పటికే ఒక అంచనాకు వచ్చింది. మెగా టోర్నీకి ఫైనల్ 15లో కేవలం ఒకటి రెండు స్థానాలను మాత్రమే భర్తీ చేయాల్సి ఉంది. ఆ అన్వేషణకు ఈ సిరీస్‌తోనే ముగింపు పలికి స్వదేశంలో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ముందే వరల్డ్‌కప్ టీమ్‌ను ఖరారు చేసుకోవాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

వరల్డ్‌కప్ బెర్త్‌పై పంత్ కన్ను

వరల్డ్‌కప్ టీమ్ రిజర్వ్ బ్యాట్స్‌మన్ ప్లేస్‌లో సరైనోడిగా భావిస్తున్న యువ వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్‌కు ఈ సిరీస్ కీలకం కానుంది. ఇంగ్లండ్, ఆసీస్‌తో టెస్ట్‌ల్లో రాణించి ధోనీకి తానే సరైన వారసుడినని నిరూపించుకున్న పంత్.. ఈ సిరీస్‌లో సత్తా చాటి వరల్డ్ కప్ బెర్త్ దక్కించుకోవాలని భావిస్తున్నాడు. అదే విధంగా ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌కు దూరంగా ఉన్న వెటరన్ మహేంద్రసింగ్ ధోనీ కూడా ధనాధన్ ఫార్మాట్‌లో బ్యాట్ ఝుళిపించాలని చూస్తున్నాడు. చివరగా గతేడాది జులైలో టీ20 మ్యాచ్‌లో బరిలోకి దిగిన మహీపై.. ఈ సిరీస్‌లో అందరి దృష్టి ఉండనుంది. మరో యంగ్‌స్టర్ శుభ్‌మన్ గిల్ కివీస్‌తో చివరి రెండు వన్డేల్లో వచ్చిన ఛాన్స్‌ను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అయినా..కోహ్లీ గైర్హాజరీ నేపథ్యంలో వన్‌డౌన్‌లో అతనికి మరో అవకాశం దక్కొచ్చు. చివరి వన్డేలో అంబటి రాయుడు కీలక ఇన్నింగ్స్ ఆకట్టుకున్నప్పటికీ.. కొన్నాళ్లుగా టీ20ల్లో మంచి ఫినిషర్‌గా గుర్తింపు తెచ్చుకున్న దినేశ్ కార్తీక్ మిడిలార్డర్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంది. గాయం కారణంగా ఆసీస్ టూర్ మిస్సయిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తుది జట్టులో ఉండడం ఖాయమే. టీ20 స్పెషలిస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, షమీ గైర్హాజరీలో భువనేశ్వర్‌తో కలిసి పేస్ భారాన్ని మోసేందుకు ఖలీల్ అహ్మద్, సిరాజ్, సిద్దార్థ్ కౌల్ పోటీ పడుతున్నారు. . కుల్దీప్ యాదవ్, చహల్‌లో ఒక్కరే ఫైనల్ లెవెన్‌లో ఉండొచ్చు. ఇక, గత మూడు వన్డేల్లో విఫలమైన ఓపెనర్ ధవన్ ఈ సిరీస్‌తో రాణించి టూర్‌కు ఫినిషింగ్ టచ్ ఇవ్వాలని చూస్తున్నాడు. అందుకోసం మంగళవారం నెట్స్‌లో చెమటోడ్చాడు. హోమ్‌టీమ్ పేసర్ల బౌన్స్, స్వింగ్‌కు కౌంటర్ ఇచ్చేందుకు టెన్నిస్ బాల్‌తో ప్రాక్టీస్ చేశాడు. అది ఏ మేరకు ఫలితాన్నిస్తుందో చూడాలి.

కివీస్ ఏం చేస్తుందో!

వన్డేల్లో చిత్తుగా ఓడిన న్యూజిలాండ్ తమకు మెరుగైన రికార్డు ఉన్న టీ20ల్లో ఇండియాను ఓడించాలని భావిస్తోంది. 2008-09లో స్వదేశంలో జరిగిన ఏకైక సిరీస్‌ను 2-0తో గెలుచుకున్న కివీస్.. 2012లో ఇండియాలో జరిగిన సిరీస్‌ను 1-0తో కైవసం చేసుకుంది. చివరగా గతేడాది ఇండియా ఆతిథ్యం ఇచ్చిన సిరీస్‌లో మాత్రమే 1-2తో ఓడిపోయింది. టీ20ల్లో ఇండియాపై రికార్డును బ్లాక్‌క్యాప్స్ టీమ్ కొనసాగించాలని చూస్తోంది. పైగా యువ ఆటగాళ్ల చేరికతో హోమ్‌టీమ్ కొత్త కళను సంతరించుకుంది. అయితే, సీనియర్లు మార్టిన్ గప్టిల్, ట్రెంట్ బౌల్ట్ గైర్హాజరీలో ఫామ్‌లో ఉన్న కెప్టెన్ విలియమ్సన్, రాస్ టేలర్, జేమ్స్ నీషమ్ జట్టును ముందుండి నడిపించాల్సిన అవసరం ఉంది.





జట్లు (అంచనా)

ఇండియా: రోహిత్ (కెప్టెన్), ధవన్, శుభ్‌మన్, రిషభ్ పంత్, దినేశ్ కార్తీక్, ధోనీ (కీపర్), హార్దిక్, క్రునాల్/కేదార్ జాదవ్, భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్, చహల్/కుల్దీప్.

న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), మన్రో, టిమ్ సైఫర్ట్ (కీపర్), రాస్ టేలర్, జేమ్స్ నీషమ్, గ్రాండ్‌హోమ్, శాంట్నర్, స్కాట్ కుగెలైన్, బ్రేస్‌వెల్, ఫెర్గూసన్/టిమ్ సౌథీ, ఇష్ సోథీ.

పిచ్/వాతావరణం

వెస్ట్‌పాక్ స్టేడియం పిచ్ ఎప్పుడు ఎలా స్పందిస్తుందో చెప్పలేం. ఇక్కడ చివరగా జరిగిన మ్యాచ్‌లో హై స్కోర్లు నమోదయ్యాయి. 196 రన్స్ టార్గెట్‌ను కాపాడుకున్న కివీస్ కేవలం 12 రన్స్‌తో ఇంగ్లండ్‌ను ఓడించింది. నైట్ మ్యాచ్ కాబట్టి మంచు ప్రభావం ఉంటుంది. ఛేజింగ్‌లో బంతి అంత సులభంగా బ్యాట్‌పైకి రాకపోవచ్చు.

10/12
రోహిత్‌శర్మ కెప్టెన్సీలో ఆడిన గత 12 టీ20ల్లో ఇండియా పది మ్యాచ్‌ల్లో నెగ్గి రెండింటిలో మాత్రమే ఓడిపోయింది.

0
న్యూజిలాండ్‌లో టీమిండియా ఇప్పటిదాకా ఒక్క టీ20 మ్యాచ్‌లోనూ గెలవలేదు.



స్నెల్ పటేల్

రంజీ ఫైనల్ పోటాపోటీ

నాగ్‌పూర్: విదర్భ, సౌరాష్ట్ర మధ్య జరుగుతోన్న రంజీ ఫైనల్ మ్యాచ్ పోటాపోటీగా సాగుతోంది. ఐదు పరుగుల స్వల్ప ఆధిక్యంతో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భ ఆట ముగిసే సమయానికి 55/2 రన్స్‌తో నిలిచింది. లెఫ్టామ్ స్పిన్నర్ ధర్మేంద్ర జడేజా(2/36) విదర్భ ఓపెనర్లు ఫైజ్ ఫజల్(10), సంజయ్(16)ను ఔట్ చేశాడు. ప్రస్తుతం విదర్భ 60 రన్స్ లీడ్‌లో ఉండగా, గణేశ్ సతీశ్(24), వసీం జాఫర్(5) క్రీజులో ఉన్నారు. అంతకముందు ఓవర్‌నైట్ స్కోరు 158/5తో మంగళవారం ఉదయం ఆట ప్రారంభించిన సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 307కు ఆలౌటైంది. ఓపెనర్ స్నెల్ పటేల్(102) సెంచరీ చేయగా, చివర్లో కెప్టెన్ ఉనాద్కట్(46) రాణించాడు. ఆదిత్య సర్వాతే(5/98) ఐదు వికెట్లు తీయగా, అక్షయ్ వాఖరే(4/80) నాలుగు వికెట్లు తీశారు. బుధవారం విదర్భ ఇన్నింగ్స్‌ను ఎంత త్వరగా ముగిస్తే ఈ మ్యాచ్‌లో సౌరాష్ట్ర విజయావకాశాలు అంత అధికంగా ఉంటాయి.

కాలికట్ సెకండ్ విక్టరీ

కొచ్చి : ప్రొ వాలీబాల్ లీగ్ ఫస్ట్ ఎడిషన్‌లో కాలికట్ హీరోస్ అదరగొడుతుంది. వరుస విజయాలతో దూసుకెళుతోంది. మంగళవారం ఇక్కడ హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో కాలికట్ హీరోస్ 3-2(15-10, 12-15, 15-13,14-15, 15-9)తో యు ముంబా వాలీపై గెలిచింది. ప్రారంభం నుంచి ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌ను కాలికట్ సొంతం చేసుకోగా, రెండో సెట్‌ను యు ముంబా గెలిచింది. అనంతరం మూడో సెట్‌ను సొంతం చేసుకుని కాలికట్ లీడ్‌లోకి రాగా, నాలుగో సెట్‌లో గెలిచిన యు ముంబా మ్యాచ్‌ను ఐదో సెట్‌కు తీసుకెళ్లింది. తొలి నాలుగు సెట్లలో నువ్వా నేనా అన్నట్లు ఆడిన యు ముంబా నిర్ణయాక ఐదో సెట్‌లో పోటీ ఇవ్వలేక మ్యాచ్‌ను కోల్పోయింది. లీగ్‌లో ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచుల్లోను యు ముంబా ఓడిపోయింది.





విమెన్స్ టీమ్ మరో టైటిల్ వేట

నేడు న్యూజిలాండ్‌తో తొలి టీ20 పోరు

వెల్లింగ్టన్ : న్యూజిలాండ్ టూర్‌లో బిజీగా ఉన్న ఇండియా విమెన్స్ టీమ్ మరో సిరీస్ విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. మెన్స్ మాదిరిగానే వన్డే సిరీస్‌లో కివీస్‌ను చిత్తు చేసిన ఇండియా విమెన్స్ టీమ్ బుధవారం నుంచి ఆ జట్టుతో టీ 20 సిరీస్ ఆడనుంది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇండియా జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహించనుంది. గతేడాది చివర్లో వెస్టిండీస్ వేదికగా జరిగిన వరల్డ్ కప్ సెమీస్‌లో ఓటమి పాలైన తర్వాత టీమిండియా ఆడుతున్న తొలి టీ20 సిరీస్ ఇదే. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీస్‌లో మిథాలీరాజ్‌ను తప్పించడం.. ఇండియా ఓడిపోవడంతో మొదలైన వివాదం కొత్త కోచ్ నియామకం తర్వాత సద్దుమణిగింది. రమేశ్ పొవార్ స్థానంలో కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన డబ్ల్యువీ రామన్ పర్యవేక్షణలో ఇండియా కివీస్‌పై తొలి వన్డే సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. అదే ఉత్సాహంతో బుధవారం నుంచి మొదలయ్యే టీ20 సిరీస్‌కు రెడీ అయింది. వన్డే కెప్టెన్ మిథాలీ రాజ్ టీ 20ల్లో పెద్దగా ఆడలేకపోతుంది. దీంతో పాటు కివీస్ స్పిన్నర్లను ఆశించిన స్థాయిలో ఎదుర్కొనలేకపోతున్న ఇండియా టీ20ల్లో భారీ స్కోరుపైనే ఆశలు పెట్టుకుంది. ముఖ్యంగా కివీస్‌తో వన్డేలో సెంచరీ బాదిన స్టార్ ప్లేయర్ స్మృతి మంధానతో పాటు హర్మన్‌ప్రీత్ టీ20ల్లోనూ చెలరేగిపోతే తిరుగుండదని టీమిండియా ఆశిస్తోంది.

టీ20లకు మిథాలీ గుడ్‌బై !

టీమిండియా మహిళల వన్డే జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ త్వరలో టీ20 క్రికెట్‌కు గుడ్ బై చెప్పనుందని సమాచారం. వచ్చే నెల 4 నుంచి స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్ తర్వాత మిథాలీ రిటైర్మెంట్ ప్రకటించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడే జట్టులో ఉన్న మిథాలీకి తుది జట్టులో ఆడే ఛాన్స్ దక్కకపోవచ్చు. 2020 వరల్డ్ టీ20లో ఆడే ఉద్దేశం లేనందువల్లే మిథాలీ రిటైర్మెంట్ యోచనలో ఉందని తెలుస్తోంది.

నేషనల్ విమెన్స్ టీ 20 చాంపియన్ తెలంగాణ

ఫైనల్లో ఉత్తరప్రదేశ్‌పై ఘన విజయం

ఖమ్మం, వెలుగు: జాతీయ స్థాయి మహిళల టీ20 చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు విజేతగా నిలిచింది. ఉత్తరప్రదేశ్‌తో మంగళవారం ఇక్కడ జరిగిన ఫైనల్లో నెట్ రన్‌రేట్ ఆధారంగా తెలంగాణ జట్టును విజేతగా ప్రకటించారు. 8 రాష్ట్రాల టీమ్‌లు పాల్గొన్న ఈ టోర్నీ ఆసాంతం ఆకట్టుకున్న మన అమ్మాయిలు మంగళవారం జరిగిన ఫైనల్లోనూ అదరగొట్టారు. మొదట బ్యాటింగ్ చేసిన ఉత్తరప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 123 రన్స్ చేసింది. నీరజ (51) హాఫ్ సెంచరీతో రాణించింది. ఛేజింగ్‌కు దిగిన తెలంగాణ 13 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 82 రన్స్ చేసింది. ఈ దశలో వెలుతురు మందగించడంతో రన్‌రేట్ ఆధారంగా నిర్వాహకులు తెలంగాణ జట్టను విజేతగా తేల్చారు. చందన 35 బంతుల్లో 55 పరుగులతో దుమ్మురేపింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో జిల్లా జడ్జీ లక్ష్మణ్, పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు.



ట్రోఫీ గెలుచుకున్న ఆనందంలో తెలంగాణ విమెన్స్ టీ20 క్రికెట్ జట్టు

అంతరిక్షంలో మన కళ్లు

హవాయిలోని మౌనా కీలో అతిపెద్ద టెలిస్కోపు ■ నాలుగు దేశాలతో కలిసి నిర్మిస్తున్న భారత్

అమెరికా, కెనడా, జపాన్, చైనా టీంతో భారత్ కలుస్తోంది. ఎందుకో తెలుసా.. అంతరిక్షంలో చెరగని ముద్ర వేస్తున్న భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద టెలిస్కోపుకూ 'కళ్ల'లా ఉండబోతోంది. అర్థం కాలేదా.. అక్కడకే వస్తున్నాం.. హవాయి దీవుల్లోని మౌనా కీలో అబ్జర్వేటరీని ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచంలోనే పెద్దదైన టెలిస్కోపును నిర్మిస్తున్నారు. దాన్నే ముప్పై మీటర్ల టెలిస్కోపు (టీఎంటీ- థర్టీ మీటర్ టెలిస్కోపు)గా పిలుస్తున్నారు. ప్రస్తుతం దాని నిర్మాణం జరుగుతోంది. ఆ టీఎంటీలో ఓ ముఖ్యమైన, ఇంకా చెప్పాలంటే పరిశీలనల్లో అత్యావశ్యకమైన లెన్సులను భారత్ తయారు చేస్తోంది. సైంటిఫిక్‌గా చెప్పాలంటే సెగ్మెంట్ సపోర్ట్ అసెంబ్లీ (ఎస్ఎస్ఏ). టీఎంటీకి కీలకమైన 30 మీటర్ల ప్రాథమిక లెన్సుకు ఉప లెన్సుల్లా (సబ్ అసెంబ్లీస్) వీటిని అమరుస్తారు. అలా షడ్భుజి (ఆరు భుజాలు) ఆకారంలో ఉండే 492 ఉప లెన్సులను టీఎంటీ ప్రధాన లెన్సుకు సపోర్ట్‌గా పెడతారు. దాని వల్ల టెలిస్కోపు మరింత కచ్చితత్వంతో పరిశీలనలు చేసే వీలుంటుంది.

ఎల్ అండ్ టీకి ప్రాజెక్టు

ఈ అతి ముఖ్యమైన ఎస్ఎస్ఏ ప్రాజెక్టును లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ)కి అప్పగించింది సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ. ఈ ప్రాజెక్టు కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ (డీఎస్టీ), అణు విద్యుత్ శాఖ (డీఏఈ)లు సంయుక్తంగా ₹1300 కోట్లు ఖర్చు చేస్తున్నాయి. అందులో భాగంగా ఎల్ అండ్ టీతో పదేళ్ల ఒప్పందం చేసుకున్నాయి. కేటాయించిన బడ్జెట్‌లో టీఎంటీకి చాలా ముఖ్యమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ వ్యవస్థల కోసమే 70 శాతం మేర ఖర్చు పెట్టనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం బెంగళూరుకు సమీపంలోని హోసకోటలో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)లో ప్రత్యేకంగా ఇండియా టీఎంటీ ఆప్టిక్స్ ఫాబ్రికేటింగ్ ఫెసిలిటీ (ఐటీవోఎఫ్ఎఫ్)ను ఏర్పాటు చేశారు. "ఇండియా టీఎంటీ, ఐఐఏ తరపున గత ఏడాది డిసెంబర్ 18న ఎల్ అండ్ టీతో 100 ఎస్ఎస్ఏల తయారీకి ఒప్పందం చేసుకున్నాం. ఆ ఒప్పందం విలువ సుమారు ₹60 కోట్లు" అని ఇండియా టీఎంటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ ఈశ్వర్ రెడ్డి తెలిపారు. ఒప్పందంలో భాగంగా ఈ ఏడాది 10 ఎస్ఎస్ఏలను ఎల్ అండ్ టీ తయారు చేసి ఇస్తుందన్నారు. ఇక, ఇప్పటిదాకా ఈ ప్రాజెక్టు కోసం వివిధ ఫెసిలిటీల నిర్మాణానికి ₹100 కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. అందులో వర్క్ షాపులు, ప్రొటోటైప్ ల నిర్మాణం, పరీక్షల కోసం సెంటర్లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే వివిధ కంపెనీలతో ఆరు ప్రొటో టైప్ ఎస్ఎస్ఏలను తయారు చేయించింది ఇండియా టీఎంటీ.



- ముఖ్యమైన ఎస్ఎస్ఏల నిర్మాణానికి ఒప్పందం
- ప్రాజెక్టును ఎల్ అండ్‌టీకి అప్పగించిన డీఎస్టీ
- డీఏఈతో కలిసి ₹1300 కోట్ల ఖర్చుతో నిర్మాణం

ఇండియాకు ముఖ్యమైన పని

టీఎంటీ విడి భాగాలను (సబ్ అసెంబ్లీస్) తయారు చేసే దేశాల జాబితాలో భారత్‌కూ చోటు దక్కడం విశేషమే. అందులోనూ అత్యంత ముఖ్యమైన లెన్సుల తయారీకి ఒప్పందం చేసుకోవడం ప్రతిష్ఠాత్మకం. ఇందులో భాగంగా ప్రధాన లెన్సుకు చుట్టూ పెట్టేందుకు 80 లెన్సులను భారత్ తయారు చేయనుంది. ఈ లెన్సులను తయారు చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఇక, మొత్తంగా 492 లెన్సులను 82 రకాలుగా తయారు చేస్తారు. ఒక్కో లెన్సుకు అంచుల్లో 12 సెన్సర్లను పెడతారు. ప్రధాన లెన్సుకు ఈ చిన్న లెన్సులను పెట్టేటప్పుడు తలెత్తే చిన్నచిన్న సమస్యలనూ సెన్సర్లు పసిగట్టి అప్రమత్తం చేస్తాయి. ప్రతి మిర్రర్ సెగ్మెంట్ (విడిభాగం)కు వెనక ఉండే మూడు యాక్చువేటర్లకు సమాచారాన్నిస్తాయి. వీటన్నింటి నియంత్రణ కోసం ఓ సాఫ్ట్‌వేర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. "సెన్సర్లు, యాక్చువేటర్లు, ఎస్ఎస్ఏలన్నింటినీ ఇండియాలోనే తయారు చేస్తాం. ఇంతపెద్ద అంతరిక్ష ప్రాజెక్టులో భాగం కావడం ఇండియాకు ఇదే మొదటిసారి. భారత సైంటిస్టులు, పరిశ్రమల సత్తా ఏంటో తెలుస్తుంది" అని ఇండియా టీఎంటీ అసోసియేట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ ఏఎన్ రాంప్రకాశ్ అన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన ముడిపదార్థాలను సమకూర్చుకోవడం దగ్గర్నుంచి ఎస్ఎస్ఏల అభివృద్ధి వరకు ఎల్ అండ్ టీదే బాధ్యత అని ఈశ్వర్‌రెడ్డి చెప్పారు. మొదటి దశలో భాగంగా ప్రొడక్షన్ క్వాలిఫికేషన్ ఫేజ్ సహా వివిధ పరీక్షలుంటాయని, ఆ తర్వాతే నిధులిచ్చి ప్రాజెక్టును పూర్తిగా అప్పగిస్తామని చెప్పారు.

చట్టపరమైన సవాళ్లు


నిజానికి 2014 అక్టోబర్‌లోనే ఈ ప్రాజెక్టు ఇండియాకు దక్కింది. అయినా కూడా గత ఏడాది వరకూ ఇండియా టీఎంటీ కన్సార్షియంకు చట్టపరమైన సవాళ్లు తప్పలేదు. ముఖ్యంగా మౌనా కీలో టెలిస్కోపు అబ్జర్వేటరీ ఏర్పాటుపై హవాయిలోని కొన్ని గ్రూపులు వ్యతిరేక గళం వినిపించాయి. అయితే, అక్కడి సుప్రీం కోర్టు మాత్రం వాళ్ల వాదనలను కొట్టిపారేసింది. టీఎంటీకి అనుకూలంగా రెండు తీర్పులనిచ్చింది. టెలిస్కోపు నిర్మాణానికి మార్గం సుగమం అయింది. అయినా కూడా తీర్పుల నేపథ్యంలో ప్రాజెక్టును సాఫీగా ముందుకు తీసుకెళ్లేందుకు టీఎంటీ బోర్డు తనకున్న అవకాశాలపై సమీక్షిస్తోంది.





హే... పట్టేసుకున్నా..పట్టేసుకున్నా

చిన్నప్పుడు అమ్మ చెంగు పట్టుకుని తిరుగుతూ పిల్లలు భలే అల్లరి చేస్తుంటారు. మరి, అదే జంతువులైతే.. వాటికి బట్టలు, చెంగులు ఉండవు కదా. ఇదిగో ఈ బుడ్డ సింహానికి తన తల్లి తోకే చెంగైంది. కానీ, ఆ తోకను పట్టుకోవడానికి ఆ బుడ్డది బానే కష్టపడ్డది. ఎందుకంటే ఆ తోక దానికి అందలేదు కాబట్టి. ఇదేమో పొట్టిగుండే.. తల్లేమో ఎత్తుండే.. తోక దానికి అందనంత ఎత్తులో ఉండే. అందుకే తోకను పట్టుకోవడానికి ఎగిరెగిరి ప్రయత్నించింది ఆ బుడ్డ సింహం. చివరకు ఆ ప్రయత్నాల్లో గెలిచేసిందనుకోండి. ప్రయత్నించు.. సాధించు అన్న నానుడి ఈ బుడ్డ పిల్లకి తెలిసొచ్చినట్టుంది. గత నెలలో కెన్యాలోని ఒలారే కన్జర్వెన్సీలో ఈ బుడ్డ సింహం ఆటలు సాగాయి మరి. అంత ముచ్చటైన ఆటలు చూశాక ఫొటో గ్రాఫర్లు ఊరుకుంటారా? ఇదిగో పాల్ గోల్డ్‌స్టీన్ అనే ఫొటోగ్రాఫర్ ఇలా పట్టేశాడు.



మన గ్రహం మరింత నీలంగా

భూమికి ఇంకో పేరు నీలి గ్రహం. సముద్రాలు నీలంగా కనిపించడం వల్ల దానికి ఆ పేరు వచ్చింది. మరి, నీలి గ్రహం మరింత నీలంగా మారిపోతుందట. కారణం సముద్రాల రంగు మారడమేనట. ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతుండడం వల్ల వాతావరణం మారిపోతోంది కదా. అదే సముద్రాలు, భూమి రంగు మరింత ముదరడానికి దోహదం చేస్తుందట. మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) పరిశోధకులు చేసిన స్టడీలో ఈ విషయం వెల్లడైంది.

ఫైటోప్లాంక్టన్‌లు తగ్గి...

సముద్రాలు సాధారణంగా నీలం, ఆకుపచ్చ కలిసిన రంగుల్లో (పచ్చగా) ఉంటాయి. దానికి కారణం అందులోని ఫైటోప్లాంక్టన్ అనే బ్యాక్టీరియా. అది ఎంత ఎక్కువుంటే అంత పచ్చగా సముద్రాలు కనిపిస్తాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల 2100 నాటికి సముద్రాల్లోని ఫైటోప్లాంక్టన్లు తగ్గి దాదాపు 50 శాతం సముద్రాలు నీలంగా మారిపోతాయని సైంటిస్టులు చెబుతున్నారు. ఇప్పటికే పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల చాలా సముద్రాల్లో ఫైటోప్లాంక్టన్‌ల సంఖ్య తగ్గిపోయిందన్న మునుపటి పరిశోధనలను సైంటిస్టులు గుర్తు చేస్తున్నారు. "కచ్చితంగా సముద్రాల రంగు మారిపోద్ది. అయితే, ఆ మార్పును మన కళ్లు గుర్తుపట్టలేవు. సెన్సర్లతో అయితే ఈజీగా గుర్తుపట్టొచ్చు" అని పరిశోధనకు నేతృత్వం వహించిన ఎంఐటీ ప్రొఫెసర్ డాక్టర్ స్టెఫానీ డుక్వీక్జ్‌చెప్పారు. వాతావరణం వేడెక్కడం వల్ల సముద్రాల ప్రవాహంపై ప్రభావం పడుతోందని, దాని వల్ల ఫైటోప్లాంక్టన్ల ఆహారానికి కొరత ఏర్పడుతోందని చెబుతున్నారు. గతంలో సైంటిస్టులు ఫైటోప్లాంక్టన్ల క్లోరోఫిల్ ను శాటిలైట్ ల ద్వారా కొలిచి వాతావరణ మార్పులను విశ్లేషించారు. ఇప్పుడు మాత్రం నేరుగా ఫైటోప్లాంక్టన్లు రిఫ్లెక్ట్ చేస్తున్న కాంతినే అంచనా వేశారు. కొన్ని ప్రాంతాల్లో అతి త్వరలోనే సముద్రాల్లో మార్పు కనిపిస్తుందని, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం ఓ దశాబ్దం పట్టొచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. ఉత్తర అట్లాంటిక్ సముద్రంలోనే తొలి మార్పులు కనిపిస్తాయని, ఆ తర్వాత దక్షిణంవైపున రంగు మారుతుందని చెప్పారు. అయితే, భూమధ్య రేఖకు సమీపంలోని సముద్రాలు మాత్రం ఆకుపచ్చగా కనిపిస్తాయని అంటున్నారు. ఎందుకంటే అక్కడ ఉండే ఫైటోప్లాంక్టన్లు వేడిని బాగా శోషించుకుంటాయని, వేడిని తట్టుకుని బతుకుతాయని అంటున్నారు.

పెరిగే వేడి.. కాలుష్యానికి జోడి

పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల వాతావరణంలోని ఏరోసోల్స్ (వాయు ద్రావణాలు) తీవ్రత పెరుగుతుందని , దాని వల్ల ప్రపంచ మొత్తం కాలుష్యం మరింత తీవ్రమవుతుందని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. వేడి వల్ల భూమిపై తేమ తగ్గడమే అందుకు కారణమన్నారు.

చదువు ఆగినా.. తెలివి ఆగలె

- ఆల్కహాల్ డిటెక్టర్‌ను కనిపెట్టిన హైదరాబాద్ యువకుడు

కొత్తకొత్త ఆవిష్కరణలు చేయాలంటే పెద్దపెద్ద డిగ్రీలు అవసరం లేదు.. తెలివుంటే చాలని నిరూపించాడో కుర్రాడు. పదో తరగతి తర్వాత చదువు మానేసినా ఎలక్ట్రానిక్స్‌పై ఆసక్తితో రోడ్డు ప్రమాదాలను నివారించే సరికొత్త ఆల్కహాల్ డిటెక్టర్‌ను కనిపెట్టాడు.. కేటీఆర్‌తో శభాష్ అనిపించుకున్నాడు.



హైదరాబాద్‌కు చెందిన 22 ఏళ్ల కుర్రాడు సాయితేజ కొన్ని కారణాల వల్ల 10వ తరగతి తర్వాత చదువు మానేశాడు. కానీ ఎలక్ట్రానిక్స్ అంటే ఆసక్తి. ఎప్పుడూ ఏదో ఒకటి కనిపెట్టాలని తపన పడుతుండేవాడు. తన ఆవిష్కరణకు ఇంటర్నెట్‌ను గురువుగా వాడుకున్నాడు. డ్రైవర్ మద్యం తాగితే గుర్తించే ఈ పరికరం.. 30 శాతం కన్నా ఎక్కువ మద్యం తీసుకున్నట్టయితే ఇంజన్ పనిచేయకుండా ఆపేస్తుంది. అంతేకాదు.. అందులో ముందే ఫీడ్ చేసిన మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ అలర్ట్ కూడా పంపిస్తుంది. పరికరం తయారీకి సాయికి 15 రోజులు పట్టింది. రూ.2,500 ఖర్చయింది. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ద్వారా అతడికి అండగా ఉంటామని మంగళవారం కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



100 ఏళ్లలోపు వారికి సిగరెట్ అమ్మబడదు!

హవాయి అసెంబ్లీలో కొత్త బిల్లు

"డాక్టర్ ఇచ్చిన మందుల చీటీ లేకుండా మెడికల్ షాపుల్లో మందులు తీసుకోవడం నిషిద్ధం. ఏ డ్రగ్ పడితే అది వాడటం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. అందుకే వద్దని చట్టం తెచ్చాం. మరి అంతకంటే భయంకరమైన సిగరెట్‌ను జనం వద్దకు ఎందుకు చేరనిస్తున్నాం" అంటూ అమెరికాలోని హవాయి అసెంబ్లీ సభ్యుడు ఇచ్చిన స్పీచ్ వైరల్‌గా మారింది. సిగరెట్ అమ్మకాలపై కఠిన నిబంధనలు తేవాలని స్థానిక డెమొక్రటిక్ పార్టీ సభ్యుడు రిచర్డ్ క్రెగన్ పేర్కొన్నారు. 2024 కల్లా సిగరెట్ కొనాలంటే కచ్చితంగా వందేళ్ల వయసు ఉండేలా చట్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిజంగానే ఇప్పుడు దానిపై బిల్లును తెచ్చింది హవాయి ప్రభుత్వం. ప్రస్తుతం 21 ఏళ్లు నిండిన వారికి మాత్రమే అక్కడ సిగరెట్ అమ్ముతారు. వచ్చే ఏడాది ఈ పరిమితిని 30 ఏళ్లకు, 2021లో 40 ఏళ్లకు, 2022లో 50 ఏళ్లకు, 2023లో 60 ఏళ్లకు, 2024లో 100 ఏళ్లకు పెంచాలని క్రెగన్ పేర్కొన్నారు. ఎలాంటి చట్టపరమైన సవాళ్లనైనా తట్టుకుని నిలబడగలిగేలా ఈ సరికొత్త బిల్లును తయారు చేసినట్లు ఆయన వెల్లడించారు.

జెండర్ మారినా ఓకే

- ఎల్జీబీటీక్యూ పట్ల తీరు మార్చుకుంటున్న కంపెనీలు
- సెక్స్ మార్పు ఆపరేషన్‌కు సెలవులు, ఆర్థిక సాయం

ప్రహాసిని అరుముగం.. ఆర్బీఎస్ ఇండియాలో ఉద్యోగి..11 ఏళ్ల కిందట జాబ్‌లో చేరింది.. అబ్బాయిగా.. అవును.. అబ్బాయిగానే జాయిన్ అయింది.. కానీ ఈమధ్య 7 నెలలుగా హార్మోన్ చికిత్స చేయించుకుంటోంది.. సెక్సువల్ రీఅసైన్‌మెంట్ సర్జరీ (లింగ మార్పిడి) ఒక్కటే మిగిలింది.. అది జరిగితే పూర్తి అమ్మాయిగా మారిపోద్ది.. దీనికోసం ఉద్యోగాన్ని వదిలేద్దామనకుంది.. కానీ కంపెనీ వారించింది.. జాబ్ మానేయాల్సిన అవసరం లేదంది.. తనవంతు సాయం కూడా చేసింది.

ఇలా ఆర్బీఎస్ ఒక్కటే కాదు.. చాలా కార్పొరేట్ కంపెనీలు ఎల్జీబీటీక్యూల పట్ల తీరు మార్చుకుంటున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 377పై సుప్రీంకోర్టు తీర్పునిచ్చాక తమ విధానాల్లో మార్పులు చేస్తున్నాయి. ఎల్జీబీటీక్యూ ఉద్యోగులకు సాయం చేసేందుకు ముందుకొస్తున్నాయి. సర్జరీలు చేయించుకుంటే సెలవులిస్తున్నాయి. ఆర్థిక సాయం చేస్తున్నాయి. ప్రత్యేక రెస్ట్‌రూంలు, టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నాయి. సేమ్ సెక్స్ పార్ట్‌నర్లకు వైద్య బీమా కల్పిస్తున్నాయి. ముఖ్యంగా మద్దతిస్తున్నాయి.

45 రోజుల సెలవు

ప్రహాసిని తనకు సర్జరీ చేశాక కోలుకోవడానికి సుమారు 45 రోజుల సమయం పడుతుందని, అప్పటివరకు సెలవు కావాలని కంపెనీని కోరింది. ఆర్థికసాయం కూడా చేయాలంది. అందుకు ట్రాన్స్‌జెండర్స్‌కు సంబంధించి విధానాలను రివ్యూ చేస్తున్నామని ఆర్బీఎస్ చెప్పింది. సెక్కువల్ రీఅసైన్‌మెంట్ సర్జరీకి సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని, దాన్ని ఇన్సూరెన్స్ కంపెనీనో, పని చేస్తున్న కంపెనీలో అందిస్తుందని ఆర్బీఎస్ డైవర్సిటీ ఆఫీసర్ రీతీ దుబే అన్నారు. జెండర్ మార్చుకున్న వాళ్లకు సరైన కౌన్సెలింగ్ ఇస్తే 95 శాతం మంది మళ్లీ సాధారణ జీవితం మొదలెడతారన్నారు. తన లైంగిక ధోరణిని మేనేజర్ అవమనించారంటూ ఓ మాజీ టెక్ మహీంద్రా ఉద్యోగి విమర్శించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. మేనేజర్‌ను ఉద్యోగంలోంచి తీసేసేంతవరకు వెళ్లింది వ్యవహారం. కానీ ఇప్పుడు కంపెనీ విధానాలాన్నీ మారాయి. వారికి సంబంధించి ప్రత్యేక విధానాలు కంపెనీ రూపొందించింది. "ఎల్జీబీటీక్యూలకు ప్రత్యేక టాయిలెట్లు, డ్రెస్సింగ్ రూంలు ఏర్పాటు చేశాం. డైవర్సిటీ అండ్ ఇన్‌క్లూజన్ పాలసీ పాటిస్తున్నాం" అన్నారు కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ హర్షవేంద్ర. "సెక్సువల్ రీఅసైన్‌మెంట్ సర్జరీ చేయించుకునే వారికి 30 రోజుల పెయిడ్ లీవ్స్ ఇస్తున్నాం. వాళ్లకు సంబంధించి విషయాలు గోప్యంగా ఉంచుతాం. కౌన్సెలింగ్ కూడా ఇస్తాం" అన్నారు. వైద్య ఖర్చుల విషయమై ఇప్పటికే ఇన్సూరెన్స్ కంపెనీలతో టెక్ మహీంద్రా మాట్లాడుతోంది. తమ కంపెనీలో ఎల్‌జీబీటీక్యూలు చాలా మందే ఉన్నారని వీఎల్‌సీసీ గ్లోబల్ హెడ్ హెచ్‌ఆర్ ఆపరేషన్స్ ప్రణవ్ జ్యోతి అంటున్నారు.



ఇంకా అవమానాలే

- 99 శాతం మంది ఎల్‌జీబీటీక్యూలను ఒకసారికన్నా ఎక్కువగా అవమానించారు. ముఖ్యంగా సొంత కుటుంబసభ్యులే.
- 92 శాతం మందిని ఉద్యోగంలోంచి తీసేశారు. దీంతో అడుక్కోవడమో, వ్యభిచారంలోకో దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- 55 శాతం మంది స్కూలుకెళ్లలేదు. వెళ్లిన వాళ్లకు అవమానాలు.
- అధికారిక లెక్కల ప్రకారం ట్రాన్స్‌జెండర్లు 4.9 లక్షలు. కానీ సామాజిక కార్యకర్తలు మాత్రం 60-80 లక్షల వరకు ఉంటారంటున్నారు.

అంతా ఆడోళ్ల వల్లే

వృద్ధుల సంఖ్య పెరగడానికి వాళ్లే కారణం

జపాన్‌కున్న పెద్ద సమస్య ముసలోళ్లు పెరిగిపోతుండడం. ఇప్పుడు ఆ సమస్యకు కారణాన్ని ఆడోళ్లపై మోపారు జపాన్ ఉప ప్రధానమంత్రి టారో ఆసో. ఫుకువుకా లో మాట్లాడిన ఆయన.. జపాన్ సంక్షోభానికి కారణాన్ని వృద్ధులపైకి నెడుతున్నారని, అది తప్పని అన్నారు. దేశంలో వృద్ధ జనాభా పెరిగిపోవడానికి పిల్లల్ని కనకుండా ఉంటున్న ఆడోళ్లే కారణమని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పిల్లల జననాలు లేకపోవడం వల్ల వృద్ధుల సంఖ్య భారీగా పెరుగుతోందన్నారు. ఇదిలాగే కొనసాగితే ముమ్మందు దేశం మరింత సంక్షోభంలో కూరుకుపోతుందని హెచ్చరించారు. ఆ వ్యాఖ్యలు చేసిన కొద్దిసేపటికే ప్రతిపక్షాలు మండిపడడంతో ఆయన తన మాటలను ఉపసంహరించుకున్నారు. క్షమాపణలు చెప్పారు. తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని, రాబోయే ఉపద్రవాన్ని మాత్రమే తాను తెలియజెప్పాలనుకున్నానని అన్నారు. 2018లో జపాన్ జనాభా 4.48 లక్షలు తగ్గింది. ఇటు జననాల సంఖ్య కూడా 9.21 లక్షలు తగ్గింది. ఆ లెక్కలు చూపిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది జూన్‌లో అధికార పార్టీ సెక్రటరీ జనరల్ తొషిహిరో నికై కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అయితే, నెపాన్నంతా ఆడోళ్లపై తోసేయకుండా .. పిల్లల్ని కనని జంటల వల్లే వృద్ధుల సంఖ్య పెరుగుతోందన్నారు. రెండు నెలల క్రితం అదే రూలింగ్ పార్టీకి చెందిన మరో నేత.. మహిళలు కనీసం ముగ్గురు పిల్లల్ని కనాలని సూచించారు.



Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.